21-12Pg1exHMNWJQE.qxd:21-12Pg1exHMNWJQE.qxd 01/01/01 9:45 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఒంగోలు, : fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

21-12-2024 శనివారం సంపుటి: 30 సంచిక: 323 పేజీలు: 12 వెల: 6.50

దేశంలో పెరుగుతున్న మందిర్, మసీదు వివాదాలు

9లో

రష్యా దాడులతో ఉక్రెయిన్ ఉక్కిరిబిక్కిరి

# రైతు క్షేమమే అజెండా

## ధాన్యం సేకరణలో ఎక్కడా పొరబాట్లు జరుగరాదు..

## తేమశాతంలో కచ్చితత్వం ఉండాలి

## ధాన్యం మిల్లుకు చేరగానే రైతుకు డబ్బు జమ

## గంగూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు పరిశీలించిన సిఎం చంద్రబాబు



శుక్రవారం గంగూరు రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని ఆరా తీస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి నాదెండ్ల

**విజయవాడ,డిసెంబరు 20,ప్రభాతవార్త ప్రతినిధి:** ధాన్యం సేకరణలో ఎక్కడా తప్పు జరగడానికి వీలేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఐవీఆర్ఎస్ ద్వారా రైతుల నుంచి తానే స్వయంగా అభిప్రాయాలు సేకరిస్తానని తెలిపారు. అధికారుల నుంచి తనకు కావాల్సింది డాక్యుమెంటేషన్ కాదని, రైతులకు సేవ చేసే విషయంలో ఇంప్రూవ్‌మెంట్ కనిపించాలని సూచించారు. తేమ శాతం నమోదు, ఇతరత్రా అంశాల్లో ఎగుమతి, దిగుమతి దగ్గర ఒకేలా కచ్చితత్వం ఉండాలన్న సీఎం ఇందులో ఎక్కడ తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. విజయవాడ సమీపంలో గంగూరులో రైతు సేవాకేంద్రాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది, రైతులు, అధికారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ మొదలు మిల్లులకు ఎగుమతి చేసే ప్రక్రియ మొత్తాన్ని సీఎం చంద్రబాబు క్షుణ్ణంగా పరిశీలించారు. తూకంలో హెచ్చు తగ్గులు, తేమశాతంలో లొసుగులవంటి అంశాలను స్వయంగా తెలుసుకున్నారు. రైతులనుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. తేమశాతంలో ఎందుకు మార్పులు వస్తున్నాయంటూ అధికారులు, రైతుల నుంచి వివరణ తీసుకున్నారు. తేమశాతం నిర్ధారణ చేసే మిషన్ పనితనాన్ని స్వయంగా పరిశీలించారు. రైతులకు ఐవీఆర్ఎస్‌పై స్వయంగా అవగాహన కల్పించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ఎప్పటికప్పుడు తనకు ఫీడ్ బ్యాక్ పంపాలని సీఎం చంద్రబాబు సూచించారు. తేమశాతంలో సేవాకేంద్రం వద్ద ఎంత రీడింగ్ వస్తే మిల్లు వద్ద కూడా అంతే రీడింగ్ రావాలని కానీ దానిలో మార్పు ఉంటే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సేవ కేంద్రంలో ఓ రైతుతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రైతు నుంచి ధాన్యం ఎలా సేకరిస్తారో సీఎంకు సేవాకేంద్రం సిబ్బంది చూపించారు. ధాన్యం తాను ఎలా అమ్ముతున్నది సిఎంకు రైతు ఆకునూరి సాంబశివరావు వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట చాలా బాగా పండిందని రైతు వెల్లడించారు. మిషన్ కోత వల్ల రూ. 5, 6వేలు ఎకరానికి ఈ ఏడాది కలిసి వచ్చిందని రైతు తెలిపారు. దీనికి దిగుబడి పెరగడం కూడా కారణమని రైతు సాంబశివరావు తెలిపారు. గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వాళ్లు తీసుకుంటే మరో రూ.5వేలు వరకూ వస్తుందని రైతుతెలిపారు. గతంలో మనుషులు >>2



# పార్లమెంటు నిరవధికంగా వాయిదా

**న్యూఢిల్లీ, డిసెంబరు 20:**పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి. అత్యంత కీలకమైన వన్‌నేషన్ వన్ ఎలక్షన్‌కు సంబంధించిన బిల్లులు సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించేందుకు ఆమోదం తెలపడంతో ఉభయసభలు వాయిదా పడ్డాయి. శీతాకాల సమావేశాలు ప్రారంభంనుంచి కూడా విపక్షాల నిరసనలతో అధికారపక్షం ప్రతిదాడులతోనే కాలంగడిచిపోయింది. మూడో సెషన్‌లో 65 గంటలు మొత్తం మూడుసెషన్లలో 70 గంటలకుపైగా సమయం వృధా అయినట్లు తేలింది. నవంబరు 25న ప్రారంభం అయిన శీతాకాల సమావేశాలు మూడు విడతలుగా కొనసాగాయి. డిసెంబరు 20వతేదీతో ముగిసాయి.19వతేదీ లోక్‌సభలో వాగ్వాదాలు ప్రతిపక్ష ఎంపిల నిరసనల >>2



# హర్యానా మాజీ సిఎం చౌతాలా కన్నుమూత

**చండీఘర్, డిసెంబరు 20:** హర్యానా మాజీ ముఖ్యమంత్రి, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ చీఫ్ ఓంప్రకాశ్ చౌతాలా(89) కన్నుమూసారు. గురుగ్రామ్‌లోని ఆయననివాసంలో శుక్రవారం గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. 1989 నుంచి 2005 వరకూ హర్యానా సిఎంగా ఆయన బాధ్యతలు నిర్వహించారు. ఓంప్రకాష్‌చౌతాలా 1935లో జన్మించారు. ఆయన భారత దేశానికి ఆరో ఉపప్రధానిగా పని చేసిన చౌదరి దేవిలాల్ కుమారుడు. ఉపా >>2



పెను కెరటాలకు విశాఖ గోకుల్ పార్కువద్ద కూలిన బీచ్ రక్షణ గోడ

# 48 గంటలు భారీ వర్షాలు

## విశాఖ, కళింగపట్నం పోర్టులలో మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ

**విశాఖపట్నం, డిసెంబరు 20, ప్రభాతవార్త:** అల్పపీడనం ప్రభావంతో ఆంధ్ర ప్రదేశ్ లోని అనేక జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురియడంతో జనజీవనం అస్తవ్యస్తమైనది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. మధ్య బంగాళాఖాతంలో 5.8 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారం తెలియజేశారు. దీని ప్రభావం వలన మరో రెండు రోజులుపాటు భారీ వర్షాలు కురుస్తాయని తెలియజేసింది. కళింగపట్నం >>2

# ఓర్వకల్లులో రూ.14వేల కోట్ల పెట్టుబడులు

**విజయవాడ,డిసెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ. 14వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ ఇండియాకు చెందిన కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. అమరావతిలో ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌తో కంపెనీ ప్రతినిధులు సమావేశమైనట్లు మంత్రి భరత్ తెలిపారు. రాయల సీమలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని సమావేశంలో పెట్టుబడిదారులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. చర్చల అనంతరం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ. 14వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ ప్రతినిధులు ముందుకొచ్చారన్నారు. జనవరి రెండవ వారంలో సీఎం చంద్రబాబు సమక్షంలో కంపెనీతో ఎంవోయూ చేసుకోను >>2





శుక్రవారం విజయవాడలో అవార్డును అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ

# తాడిపత్రి మునిసిపాలిటీకి గోల్డ్‌మెడల్

## అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే జె.సి అశ్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** అన్నింటిలో ముందుండి ఆదర్శ మున్సిపాలిటీగా పేరు పొందిన తాడిపత్రి మున్సిపాలిటీకి గోల్డ్ మెడల్ అవార్డు దక్కింది.రాష్ట్రస్థాయిలో రాష్ట్ర ఎనర్జీ కన్వెన్షన్ అవార్డుల్లో తాడిపత్రి మున్సిపాలిటీ గోల్డ్‌మెడల్ అవార్డును దక్కించుకుంది. శుక్రవారం విజయవాడలోని తాజ్ వివంతహోటల్‌లో జరిగిన సమావేశంలో ఎనర్జీ చీఫ్‌సెక్రటరీ విజయ్‌ఆనంద్, ఏపి జెన్‌కో ఎండి చక్రధర్‌బాబు,ఎపి >>2

# 7500 మంది వ్యాపారులకు వాణిజ్య పన్నుల నోటీసులు

**విజయవాడ డిసెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా 7500 మంది వ్యాపారులకు వాణిజ్య పన్నుల శాఖ నోటీసులు జారీచేసింది. జీఎస్టీ రిటర్నుల్లో పేర్కొన్న వివరాలు, వేబిల్లుల మధ్యన , కోరుకున్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల మధ్య ఉన్న వ్యత్యాసాలు వార్షిక రిటర్నులకు నెల వారీగా రిటర్నులకు మధ్యన ఉన్న వ్యత్యాసాల ఆధారంగా ఆటోమేటిక్ సిస్టమ్ జనరేటెడ్ విధానంలో నోటీసులను పంపించింది. వ్యాపారస్తులు ఇచ్చే వివరణ ఆధారంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో ఉన్న 13 డివిజన్లకు సుమారు 400 చొప్పున నోటీసులు వ్యాపారస్తులకు వెళ్లాయి. కొందరు వ్యాపారస్తులకు ఒకటికంటే >>2

# డోలీ మోతలకు ఇక స్వస్తి!

## మన్యం జిల్లాలోని 19 గ్రామాల్లో తారురోడ్డు పనులను ప్రారంభించిన డి.సిఎం పవన్, మహిళా సంఘాలకు రూ.4.14కోట్ల చెక్కు పంపిణీ



శుక్రవారం మన్యం జిల్లాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**పార్వతీపురం (పార్వతీపురం మన్యం జిల్లా ) డిసెంబరు 20 ప్రభాతవార్త :** గిరిజన ప్రాంతాల్లో డోలి మోతలకు స్వస్తి పలికేందుకు అన్ని గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఒకరోజు జిల్లా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు పంచాయతీలోని బాగుజోల గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 20.11 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలో చేపట్టనున్న 19 గ్రామాల్లో రూ.9.50 కోట్ల అంచనా వ్యయంతో బాగుజోల నుంచి సిరివర గ్రామం వరకు ఏర్పాటు చేయనున్న తారురోడ్డు నిర్మాణ పనులకు ఉప ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ప్రకృతి అందాలకు, సహజ సిద్ద జల పాతాలకు మన్యం జిల్లా నెలవని ఆయన అభివర్ణించారు. పర్యాటకంగా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు అవసరమని, కాని గత ఐదేళ్ళలో అది జరగలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో నిధులు లేనప్పటికీ రహదారులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఇదే క్రమంలో అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. కుల మత జాతి సంబంధం లేకుండా యువత అభివృద్ధి చెందాలనేదే తన తపన అని పేర్కొన్నారు. అనంతరం పనసభద్ర పంచాయతీ పరిధిలోని మహిళా సంఘాలకు నాలుగు కోట్ల 14 లక్షల 72 వేల చెక్కును ఉప ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, రాష్ట్ర గిరిజన సంక్షేమం, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంద్యారాణి, కురుపాం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, లోకం మాధవి, ఇతర జిల్లా అధికారులు గిరిజన గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**'మీ జీవనం చూస్తే అసూయ కలుగుతోంది'**

**మక్కువ :** ప్రతి రెండు నెలకు ఒకసారి గిరిజన ప్రాంతాల్లో పది నుంచి 15 రోజులు వారి సమస్యలు తెలుసుకోవటానికి పర్యటిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పనసభద్ర పంచాయతీ బాగుజోల గ్రామం నుంచి సిరివర గ్రామానికి వెళ్ళే 9.50 కోట్ల రూపాయలతో నిర్మించనున్న >>2



అమరావతి (ఇన్‌సెట్‌లో వరల్డ్ బ్యాంక్ లోగో)

# అమరావతికి ప్రపంచ బ్యాంక్ రుణం రూ.6,800 కోట్లు

## ఎడిబి నుంచి ఇప్పటికే రూ.6,700 కోట్లు మంజూరు

**విజయవాడ,డిసెంబరు 20,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం ,జనసేన,భారతీయ జనతా పార్టీల కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతి అభివృద్దికి నిధులు వస్తున్నాయి. రూ.6 వేల 700 కోట్ల రుణాన్ని ఏడీబీ అమరావతికి ఇప్పటికే మంజూరు చేసింది.ఈ నేపథ్యంలో తాజాగా ప్రపంచ బ్యాంకు కూడా రాజధాని నిర్మాణం కోసం రుణం ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. ప్రపంచ బ్యాంకు బోర్డు సమావేశంలో అమరావతికి 6 వేల 800 కోట్ల రూపాయల రుణం ఇచ్చేందుకు ఆమోదముద్ర వేసింది. అమరావతిలో వచ్చే ఐదేళ్లలో 50 వేల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని పేర్కొంది. 17 వేల మంది వ్యక్తులకు నేరుగా శిక్షణ ఇస్తుందని, అందులో 10 వేల మంది మహిళలు, మెరుగైన, అధిక జీతాలతో ఉద్యోగాలకు వారి జీవన విధానం మెరుగవుతుందని ప్రపంచబ్యాంకు అభిప్రాయపడింది. రోడ్డు గ్రిడ్, ప్రజా రవాణా, వరదల నుంచి ఉపశమనం, నీరు, వ్యర్థజలాల వ్యవస్థలతో నగరానికి అవసరమైన కీలక మౌలిక సదుపాయాలను నిర్మించడానికి అంతర్జాతీయ పరిజ్ఞానాన్ని ప్రపంచబ్యాంకే అందిస్తుందని ప్రకటించింది.తక్కువ కార్బన్‌తో ప్రకృతి ఆధారిత పరిష్కారాలను ఉపయోగించడంతో సహా వాతావరణ ప్రభావాలకు నగరాన్ని మరింత స్థితి స్థాపకంగా మార్చడానికి స్మార్ట్, గ్రీన్ టెక్నాలజీ, డిజైన్ విధానాలను ప్రభుత్వం తీసుకువస్తుందని పేర్కొంది. విపత్తు నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందని ప్రపంచ బ్యాంకు ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుత 800 మిలియన్ల డాలర్ల రుణం 6 సంవత్సరాల గ్రేస్ పీరియడ్‌తో సహా 29 సంవత్సరాల మెచ్యూరిటీని కలిగి ఉంటుందని తెలిపింది. జపాన్ కరెన్సీ.. ఖియెన్‌ఖిలో రుణాన్ని పొందాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రపంచబ్యాంకు వెల్లడించింది. కూటని ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటికే రాజధాని అమరావతిలో చేపట్టే పనులకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. 33 వేల 137.98 కోట్ల రూపాయలతో 45 ఇంజినీరింగ్ పనుల్ని చేపట్టేందుకు సీఆర్డీఏకి అనుమతిచ్చింది. ఐఏఎస్, గెజిటెడ్ అధికారులు, 4వ తరగతి ఉద్యోగుల క్వార్టర్లు, వరద నివారణ కార్యక్రమాలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులకు గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర వేశారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో అమరావతి నిర్మాణానికి సంబంధించి కీలక >>2


# నందిగం సురేష్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

## ముందస్తుబెయిల్‌కు తిరస్కృతి

## విచారణ జనవరి7కు వాయిదా




**విజయవాడ, డిసెంబరు20, ప్రభాతవార్త ప్రతినిధి:** బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ మాజీ సభ్యుడు నందిగం సురేష్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వెలగపూడిలో మరియమ్మ హత్య కేసులో నందిగం సురేష్ అరెస్టయ్యారు. ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సురేష్ పిటిషన్‌ను >>2



# విజయసాయికి ఇడి నోటీసులు

## కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్, సెజ్ వాటాల వ్యవహారం

**విజయవాడ డిసెంబర్ 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ హయాంలో కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్, కాకినాడ సెజ్ లోని వాటాలను బలవంతంగా లాగేసుకున్న కేసులో నిందితులపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ పూర్తి దృష్టిపెట్టింది. కేసులో నిందితులైన వైకాంగ్రెస్‌పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తనయుడు వై.విక్రాంత్‌రెడ్డి.ఈపార్టీకే చెందిన ఎంపీ విజయసాయిరెడ్డి, ఆయన అల్లుడి సోదరుడు అరబిందో సంస్థ యజమాని పెనక శరత్‌చంద్రారెడ్డి, విజయసాయిరెడ్డి నామినీ సంస్థగా పేరొందిన పీకే ఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఎల్ఎల్‌పీ ప్రతినిధులకు ఈడీ ఇటీవల నోటీసులు జారీ చేసింది. విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున తాను విచారణకు రాలేనంటూ విజయసాయిరెడ్డి అనారోగ్య కారణాలవల్ల హాజరు కాలేనంటూ విక్రాంత్‌రెడ్డి ప్రస్తుతం విచారణకు రావటం కుదరదంటూ శరత్‌చంద్రారెడ్డి ఇలా ఒక్కొక్కరు ఒక్కో సాకు చెప్పి ఈడీ విచారణకు గైర్హాజరైనట్లు సమాచారం .ఈ నేపథ్యంలో ఈడీ మరోసారి వారికి నోటీసులివ్వనుంది. బలవంతంగా వాటాలు లాగేసుకున్న వ్యవహారంలో రికార్డుల ప్రకారం అంతిమ లబ్దిదారులైన అరబిందో రియాల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ దాని డైరెక్టర్లకూ నోటీసులిచ్చేందుకు ఈడీ సిద్ధమవుతోంది. వీరి విచారణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనుంది కేఎస్‌పీఎల్ యజమాని కర్నాటి వెంటకేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ ,ఇప్పటికే ప్రాథమిక విచారణ జరిపింది. భారీగా మనీ లాండరింగ్ జరిగినట్లు గుర్తించింది. దాని ఆధారంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అభియోగాలు మోపి ఎన్ ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేసింది. మరోవైపు, ఈ కేసులో >>2



మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేసిన ఫిజిక్స్ వాలా, టీబీఐ, ప్రభుత్వ ప్రతినిధులు

# ఫిజిక్స్ వాలా, టిబిఐ ప్రభుత్వంతో ఒప్పందం

## మంత్రి లోకేష్ సమక్షంలో సంతకాలు

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో యువతకు శిక్షణే లక్ష్యం

**విజయవాడ,డిసెంబరు20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునాతన సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగేందుకు అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ లో డీప్‌టెక్ ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఈ రెండు ఒప్పందాలు జరిగాయి.ఫిజిక్స్ వాలా (పిడబ్ల్యూ) ఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో ఎ1-ఫోకస్డ్ ఫస్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ (ఎల్ఓఇ)... యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్ (యుఒఎల్)ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. మరోవైపు, రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ (టిబిఐ)తో ఏపీ ప్రభుత్వం మరో ఒప్పందం చేసుకుంది. ఉండవల్లి నివాసంలో నారా లోకేశ్ సమక్షంలో ఫిజిక్స్ వాలా, టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్ ను ఏకీకృతం చేసే దిశగా పని చేస్తుంది. పరిశోధన, విద్య, ఉపాధిలో కీలక సవాళ్లను పరిష్కరించడంపై దృష్టిసారిస్తుంది. హబ్‌అండ్ స్పోక్ మోడల్‌ను అనుసరించి ఇన్నోవేషన్ యూనివర్సిటీ సెంట్రల్ హబ్‌గా పనిచేస్తుంది. దీని ద్వారా విభిన్న నేపథ్యాలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు సమకాలీన, హైబ్రిడ్ విద్య అందుబాటులోకి వస్తుంది. ఆన్‌లైన్, వ్యక్తిగత అభ్యసన అనుభవాలను ఇంటిగ్రేట్ చేస్తారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ కృత్రిమ మేధ (ఏఐ)లో ఏపీ యువతను నెం.1గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అను గుణంగా ఈ ఒప్పందాలు జరిగాయని అన్నారు. అధునాతన ఆవిష్కరణల >>2



మంత్రి నారా లోకేష్,మంత్రి టీజీ భరత్ సమక్షంలో ఒప్పందం చేసుకున్న జపాన్ ఇండియాకు చెందిన కంపెనీ ప్రతినిధులు

## ఓర్వకల్లులో రూ.14వేల కోట్ల పెట్టుబడులు

>>న్నట్లు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ దూరదృష్టితోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పారిశ్రామిక అభివృద్ధిని పెంచడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రానున్న రోజుల్లో మరెన్నో పెట్టుబడులు వస్తాయన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇది సాధ్యమవుతుందని మంత్రి టి.జి భరత్ చెప్పారు. ఆవిష్కంణలు మరియు పురోగతికి కేంద్రంగా కర్నూలు జిల్లా మారబోతుందని మంత్రి టి.జి భరత్ తెలిపారు.

## ఫిజిక్స్ వాలా, టిబిఐ ప్రభుత్వంతో ఒప్పందం

>>ను ముందుకు తీసుకెళ్లడం, అందుకు ఏపీ యువతను సన్నద్ధం చేయడమే తమ లక్ష్యమన్నారు. పరిశ్రమలడిమాండ్, ప్రమాణాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్ మెంట్ పై యూనివర్సిటీ ఆఫ్ ఇన్నోవేషన్ దృష్టి సారిస్తుందని మంత్రి లోకేష్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్య వ్యవస్థను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్‌గ్లోబల్ చేంజ్(।)తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం (లీవీగీ)పై సంతకం చేసింది. ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం ఈ ఒప్పంద లక్ష్యమన్నారు.

## నందిగం సురేష్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

>> జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. నందిగం సురేష్‌కు బెయిలిచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. నందిగం సురేష్ పిటిషన్‌పై తదుపరి విచారణ జనవరి 7కు వాయిదా వేసింది. 2020లో తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన ఎస్సీ మహిళ మరియమ్మ గత ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారు. తనకు వస్తున్న పెన్షన్‌ను నిలిపివేశారని, ఇళ్లు ఇస్తామని ఇవ్వలేదని అప్పటి సీఎం జగన్‌ను దూషించారు. ఈ క్రమంలో అప్పటి ఎంపీ నందిగం సురేష్ అనుచరులు మరియమ్మ ఇంటిపై దాడి చేశారు. ఈ ఘర్షణలో మరియమ్మ మరణించింది. అయితే దీనిపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ కూడా పట్టించుకోని పరిస్థితి. ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరియమ్మ కుమారుడు మంత్రి నారా లోకేష్‌ను కలిసి మరియమ్మ మృతి గురించిన వివరాలను, తాము ఇచ్చిన ఫిర్యాదును తెలియజేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు.

## పార్లమెంటు నిరవధికంగా వాయిదా

>> నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలు శుక్రవారం ముగిసినట్లు ప్రకటించారు. అధికారిక సమాచారం ప్రకారం లోక్‌సభలో మొదటి సెషన్‌లో 5.37 గంటలు వృధా అయింది. రెండో సెషన్‌లో 1.53 గంటలు, మూడో ముగింపు సెషన్‌లో ఆశ్చర్యంగా 65.15 గంటలు విలువైన సమయాన్ని కోల్పోయినట్లు లోక్‌సభ సచివాలయం ప్రకటించింది. లోక్‌సభ తొలిసెషన్‌లో ఏడు, రెండో సెషన్‌లో 15, మూడో సెషన్‌లో 20 సమావేశాలు జరిగాయి. తొలిసెషన్‌లో ఏడు గంటలు, రెండోసెషన్‌లో 33 గంటలు, మూడో సెషన్‌లో 21.7గంటలపాటు చర్చల్లో ఎంపిలు పాల్గొన్నారు. మరో వైపు రాజ్యసభ తొలిసెషన్‌లో 34.16 గంటల పాటు చర్చనడిచింది. రెండో సెషన్‌లో చర్చా సమయం 115.21 గంటలకు పెరిగింది. అయితే మూడో సెషన్‌లో చర్చాసమయం 62 గంటల కనిష్టస్థాయికి పడిపోయింది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరణ్‌రిజిజు మాట్లాడుతూ లోక్‌సభలో కేవలం 54.5 శాతం మాత్రమే ఉత్పాదకత వచ్చిందని, రాజ్యసభలో అయితే కనిష్టంగా 40శాతం మాత్రమే ఉత్పాదకత ఉన్నదని తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసారు. ప్రతిపక్ష పార్టీల నాయకులకు పదేపదే విజ్ఞప్తులు చేసామని, సభా కార్యక్రమాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరినా సహకారం లేదన్నారు. నూరుశాతం ఉత్పాదకత సాధిస్తేనే లక్ష్యాలు సాధించినవారం అవుతామన్నారు. కాగా శుక్రవారం కూడా పార్లమెంటు వద్ద ఇండియా కూటమి నేతలు నిరసనప్రకటించారు. విపక్షనేతల నిరసనకు పోటీగా ఎన్డీయే కూటమి నాయకులు సైతం ప్లకార్డులతో నిరసనలకుదిగడంతో స్పీకర్‌ఓంబిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## డోలీ మోతలకు ఇక స్వస్తి!

>> రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిరివర గ్రామానికి వెళ్ళే రహదారి మీదుగా చిలకమండంగి సమీపం వరకు నడిచి అక్కడ గిరిజనులతో మాట్లాడారు. అనంతరం బాగుజాలలో ఏర్పాటు చేసిన గిరిజనులతో ముఖాముఖి గా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకే తాను ఇక్కడికి వచ్చానన్నారు. గత ప్రభుత్వం గిరిజనులకు రహదారులను ఏర్పాటు చేయలేక పోయిందని ఆయన విమర్శించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో గిరిజన సమస్యలపై మాట్లాడానని తెలిపారు. గిరిజన అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. అలాగే గిరిజన యువతలో నైపుణ్యతను గుర్తించి వారికి అవసరమైన ఉపాధి అవకాశాలు ఏడాదిలోగా కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. తాను అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలతోనే మమేకమవుతున్నానని పేర్కొన్నారు. ఈ ప్రకృతి అందాల మధ్య సహజ వాయువులను పీలుస్తూ మీరు జీవిస్తున్న విధానంపై తనకు ఈర్ష్య కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇక్కడ ప్రకృతి చూశాక ఇక్కడే ఇల్లు కట్టుకుని నివసించాలని అనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన స్త్రీ, శిశు శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుణం రూ.6,800 కోట్లు

>> నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటికే రాజధాని అమరావతికి హడ్కో ద్వారా 11 వేల కోట్ల రూపాయలు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ నుంచి 5 వేల కోట్ల రూపాయలు రుణాలు తీసుకోవడానికి సీఆర్‌డీఏకి ప్రభుత్వం అనుమతిచ్చింది. రాజధాని అమరావతిని మూడేళ్లలో పూర్తి చేస్తామని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కొద్ది రోజుల క్రితమే తెలిపారు. దీనికి సంబంధించి వచ్చే జనవరికి 62 వేల కోట్ల రూపాయలతో టెండర్లు పిలుస్తామని తెలిపారు. అమరావతి నిర్మాణానికి నిధులు ఇస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటన చేసింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల ద్వారా నిధులు సమకూరుస్తామని చెప్పింది. ఈ 2 సంస్థల ద్వారా 13 వేల 500 కోట్ల రూపాయల నిధులు సమకూర్చుతామని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం తెలిపింది. అమరావతి సమగ్ర, స్థిరమైన అభివృద్ధికి మద్దతిస్తున్నట్లు ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. దేశంలో 2050 నాటికి పట్టణ జనాభా 95 కోట్లకు చేరుతుందని, పట్టణ పరివర్తనకు అమరావతి అద్భుతమైన మోడల్ అని కొనియాడింది.

## 48 గంటలు భారీ వర్షాలు

>>విశాఖపట్నం పోర్టులలో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించింది. ఇదిలా ఉండగా ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాలలో భారీ వర్షాలకు ఇళ్లు, చెట్లు నేలకూలుతున్నాయి. 24 గంటల్లో విశాఖ జిల్లాలో 387. 6 మిల్లీమీటర్ల వర్షం పాతం నమోదయింది. విశాఖ జిల్లాలోని అనంతపురంలో 47. 8 మిల్లీమీటర్లు, పెదగంట్యాడలో 42. 6, ములగాడలో 39. 4, భీమిలిలో 39. 2, గాజువాకలో 36. 4, పద్మనాభంలో 35. 6, మహారాణి పేటలో 35. 2, విశాఖ గ్రామీణ ప్రాంతంలో 32. 6, పెందుర్తి 27. 8, గోపాలపట్నంలో 26. 8, సీతమ్మదారుల 24.2 మీటర్ల వర్షపాతం నమోదయింది. ఇదిలా ఉండగా అల్పపీడన ప్రభావం వలన విశాఖలోని సముద్ర తీరం అల్లకల్లోలంగా ఉంది. పెద్ద ఎత్తున కెరటాలు ఒడ్డుకు చేరడంతో శుక్రవారం గోకుల్ పార్కు వద్ద ఉన్న బీచ్ రక్షణ గోడ చాలా వరకు దెబ్బతింది.

## విజయసాయికి ఇడి నోటీసులు

>> ఏపీ సీఐడీ కూడా చర్యలు వేగవంతం చేసింది. తమ ఎదుట విచారణకు హాజరుకావాలని శరత్‌చంద్రారెడ్డికి నోటీసులిచ్చింది. తర్వాతి దశలో మిగతా నిందితులకు నోటీసులిచ్చి విచారణకు పిలిచేందుకు సిద్ధమవుతోంది. వైకాపా ప్రభుత్వం హయాంలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుట్ర మేరకు అక్రమ కేసులు పెడతామని అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని బెదిరించి భయపెట్టి ఒత్తిడి చేసి కాకినడా సీ పోర్ట్స్ లిమిటెడ్‌లోని రూ.2500 కోట్ల విలువైన వాటాలనుసాయి రూ.494 కోట్లకు కాకినాడ సెజ్‌లోని రూ.1109 కోట్ల విలువైన వాటాలను రూ.12 కోట్లకు బలవంతంగా అరబిందో సంస్థకు బదలాయించుకున్నారనే పిర్యాదపుపై సీఐడీ ఇటీవల కేసు నమోదు చేసింది. మొత్తంగా రూ.3 వేల కోట్ల మేర దోచుకున్నారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

## వాణిజ్య పన్నుల నోటీసులు

>> కంటే ఎక్కువగా నోటీసులు జారీ అయ్యాయి. రిటర్నుల కొర్రీలపై 5వేలు, ఆడిటింగ్‌లో గుర్తించిన లోపాలకు సంబంధించి 1500 వ్యాపారస్తులకు నోటీసులు పంపారు. సుమారు 1000 సంస్థల ప్రదేశాలను నేరుగా తనిఖీ చేయనున్నారు. ఎక్కువ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చూపించి రిజిస్ట్రేషన్‌లను రద్దుచేసుకున్న సంస్థలు అనుమానిత వివరాల నమోదు, వివిధ మార్గాల్లో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ తనిఖీలు జరగనున్నాయి. అధికారులకు ఆడిటింగ్ నిర్వహణకు 75 రోజులు, స్క్రూటినీకి 75 రోజులు, తనిఖీలకు 45 రోజుల చొప్పున వాణిజ్య పన్నులశాఖ కాల వ్యవధిని నిర్ణయించింది. డివిజన్ల పరిధిలో పనిచేసేవారే ఏకకాలంలో నోటీసుల జారీకి అనుగుణంగా తక్కువ వ్యవధిలో విధులు నిర్వహించాల్సి రావడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు నోటీసుల జారీవ్యాపారస్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. కొన్ని నోటీసులు రెండు మూడు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించినవి కూడా ఉన్నాయి. నోటీసుల జారీతో రెండురోజుల నుంచి వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాల్లో హడావుడి నెలకొంది.

## చౌతాలా కన్నుమూత

>> ధ్యాయ నియామకాల్లో అవకతవకలకు సంబంధించిన కేసులో 2013లో దోషిగా తేలారు. దీనితో ఆయనకు పదేళ్ల శిక్ష పడింది. 2021లో ఆయన తీహార్ జైలునుంచి విడుదలయ్యారు. చౌతాలా మృతికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, హరియానా మాజీ సీఎం కాంగ్రెస్ సీనియర్‌నాయకుడు భూపీందర్‌సింగ్‌హుడా సంతాపం ప్రకటించారు. చౌతాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. హర్యానా ప్రభుత్వం మూడురోజులు సంతాపదినాలు ప్రకటించింది. శనివారం ప్రభుత్వ సెలవుగా ప్రకటించింది. దివంగతనేతకు గౌరవసూచకంగా సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఓంప్రకాష్‌కు తేజ్‌ఖర్రా రైతు క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయి. ఆయన సొంత జిల్లా సిర్సాలో ఆయనకు వ్యవసాయ క్షేత్రంఉంది. ఐదుసార్లు హర్యానా సిఎంగా పనిచేసిన చౌతాలా 89వ యేట కన్నుమూసారు.

## 'జమిలి' జెపిసిలో విజయసాయి

**విశాఖపట్నం, డిసెంబరు 20, ప్రభాతవార్త :** దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణల బిల్లుపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ( జేపీసి )లో రాజ్యసభ సభ్యులు విజయసారెడ్డికి స్థానం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేపీసీలో తాను ఒక సభ్యునిగా బాధ్యతమైన సేవలు అందిస్తానన్నారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని మరింత బలపరిచే విధంగా, పరిపాలన నైపుణ్యతను పటిష్టపరిచే కార్యాచరణలో తాను భాగస్వామిని కావటం గర్వంగా ఉందన్నారు. జేపీసీ ముందున్న కార్యాచరణకు ఒకప్రజాప్రతినిధిగా తన వంతు సహకారం అందిస్తానని విజయసాయి వెల్లడించారు.



శుక్రవారం ధాన్యం తేమశాతం అంచనా వేసే పరికరాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

# రైతు క్షేమమే అజెండా

>> కోస్తే ఎకరానికి రూ. 6వేలు కోతకు, మరో రూ. 6వేలు కుప్ప వేయడానికి అయ్యేదని రైతు తెలిపారు. తొలకానికి మరో రూ. 3 వేలు ఖర్చు అయ్యేదని అన్నారు. ఈ లెక్కన అన్ని కలుపుకుని మనుషుల ద్వారా వ్యవసాయం చేస్తే రూ. 25వేలు దాకా ఖర్చు వచ్చేదని చెప్పారు. ధాన్యం డబ్బుల్లో కోత లేదు.. డబ్బులు కరెక్టుగానే వస్తున్నాయని చెప్పారు. ఇప్పుడు ఉన్న వ్యవస్థ బాగానే పనిచేస్తోందని అన్నారు. కోత మిషన్లు బయటనుంచి వస్తున్నాయని వివరించారు. ప్రొక్యూర్మెంట్‌కు షెడ్యూలింగ్ మొత్తం ఒకటిగా లేదా వేర్వేరుగా పంట కోత కోస్తే పార్ట్ షెడ్యూలింగ్ ఇస్తామని సీఎం చంద్రబాబుకు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు. రైతుకు దిగుబడి ఎంత వస్తుందో కూడా నమోదు కావాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఎవరి దగ్గరైనా బాగా పంట పండితే సాగు పద్ధతులు ఏంటో తెలుసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. వరి పంట వేసే రకం తినగలిగేది అయి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఏ గ్రామంలో ఎంత ప్రొడక్టివిటీ వచ్చిందో చెప్పాలని అన్నారు. ధాన్యం తేమశాతాన్ని ఎలా గణిస్తారో స్వయంగా సీఎం చంద్రబాబు పరిశీలించారు. సీజన్ ముందు అన్ని మిషన్లను తేమ విషయంలో క్యాలిబ్రేట్ చేస్తామని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. మళ్ళీ,మళ్ళీ చెబుతున్నా ధాన్యం సేకరణలో ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదు, తేమశాతంలో కచ్చితత్వం ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే అకౌంట్లో డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగితే రైతులకు శ్రమ తగ్గడంతో పాటు ఉత్పత్తిని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. పెట్టుబడి తగ్గించి రైతులను అప్పుల ఊబి నుండి బయటకు తీసుకొచ్చి ఉపశమనం కలిగించడంతో పాటు ఆదాయం పెంచాలన్నదే తమ సంకల్పమన్నారు. ఈ తనిఖీల్లో రైతుల నుంచి ధాన్య సేకరణ ఎలా చేస్తున్నారో సీఎంకు రైతు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు. అనంతరం తాము ధాన్యం ఎలా అమ్ముతున్నది సీఎంకు రైతులు వివరించారు. గతేడాది కంటే ఈ ఏడాది పంట ఎక్కువగా వచ్చిందని, మిషన్ కోత వల్ల ఎకరానికి అయిదారు వేలు కలిసి వచ్చిందని రైతులు చెప్పారు. కోసిన గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వాళ్లు తీసుకుంటే మరో రూ.5 వేల వరకూ వస్తుందని రైతులకు సీఎం తెలిపారు. ధాన్యం కొన్న 48 గంటల్లోనే డబ్బులు జమ అవుతున్నాయా అని సీఎం అడగ్గా...డబ్బులు కరెక్టుగానే వస్తున్నాయని రైతులు సమాధానమిచ్చారు. ప్రొక్యూర్మెంట్‌కు షెడ్యూలింగ్ మొత్తం ఒకటిగా లేదా... వేర్వేరుగా పంట కోత కోస్తే పార్ట్ షెడ్యూలింగ్ ఇస్తామని సిఎంకు సేవా కేంద్రం సిబ్బంది వివరించారు. సాగు చేస్తున్న పొలాన్ని బట్టి రైతుకు దిగుబడి ఎంత వస్తుందో కూడా నమోదు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. అనంతరం ధాన్యం తేమశాతాన్ని ఎలా గణిస్తారో స్వయంగా సీఎం చంద్రబాబు పరిశీలించారు. తేమశాతంలో సేవాకేంద్రం వద్ద ఎంత రీడింగ్ వస్తే మిల్లులో కూడా అంతే రావాలని, మార్పు వస్తే చర్యలు తీసుకుంటామని సీఎం అన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం తేమశాతం పరిశీలించిన అనంతరం మిల్లుకు చేరిన వెంటనే రైతుల అకౌంట్లో డబ్బులు వేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నాం. ఒకరోజు ముందుగానే రైతులకు ధాన్యం డబ్బులు ఇస్తే మరింత సంతోషిస్తారు. క్షేత్రస్థాయిలోకి నేను వచ్చింది రైతులతో మాట్లాడటానికే. మీ సూచనలు, సలహాలు కూడా తీసుకునేందుకు వచ్చాను. ఏ పంట పండిస్తే ఎక్కువ ఆదాయం వస్తుందో రైతులు ఆలోచించుకోవాలి. భూమి, వాతావరణ పరిస్థితులు అంచనా వేసుకుని పంట సాగు చేయాలి. నీళ్ల సరైన సమయంలో ఇవ్వక పోవడంతోనే రైతులు నష్టపోతున్నారు. అకాల వర్షాలతో అప్పులపాలవుతున్నారు. గత 5 సంవత్సరాలు కాలువల్లో పూడిక తీయలేదు. పట్టిసీమ ద్వారా సకాలంలోనే వరినాట్లకు నీరందిస్తాం. వ్యవసాయం మన సంస్కృతి, వ్యసనం. రైతుకు ఒక్కరోజు పొలం చూడక పోయినా నిద్రరాదు. సొంత భూమిలో చేసినా, కౌలుకు చేసినా రైతులకు ఆదాయం రావాలి. ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు కోరిన విధంగా డ్రయర్ మిషన్లు పొలం వద్దకే పంపే ఏర్పాటు చేస్తాం అని సీఎం సీఎం అన్నారు. కాలువలపై ఎంక్రోచ్ మెంట్ ఉండటం వల్ల నీరు సరిగా రావడం లేదని అధికారులు సీఎంకు తెలపగా... వాటిని తీసేయాలని ఆదేశాలు జారీ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం తేమశాతం పరిశీలించిన అనంతరం మిల్లుకు చేరిన వెంటనే రైతుల అకౌంట్లో డబ్బులు వేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నాం. అనంతరం రైతులకు సీఎం చంద్రబాబు టార్పాలిన్ పరదాలు పంపిణీ చేశారు. రైతుల ధాన్యం కళ్లం దగ్గర నుంచి మిల్లుకు చేరే విధానాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ క్రమంలో ఆయన మిల్లులో దాన్యంలోని తేమశాతం లెక్కింపును పరికరం ద్వారా స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెళ్ల మనోహర్, కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర కార్మిక కర్మాగారాలు బాయిలర్లు, వైద్య బీమా సేవలు శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, పెనమలూరు, పామర్రు, గుడివాడ, పెడన నియోజకవర్గాల శాసనసభ్యులు బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యదర్శి వీర పాండ్యన్, కమిషనర్ జిలాని, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారిణి వి పార్వతి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ డి షర్మిల, జిల్లా మేనేజర్ పద్మ దేవి, తదితర శాఖల అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీరయ్య పిన్నమనేని, రైస్ మిల్ యజమాని వి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 21-12-2024, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
షష్టి మ.12.22
పుబ్బ తె.6.13
వర్జ్యం : మ.12.35-2.21
దు.ఉ.6.41-8.13
శుభసమయం : ఉ.8.10-8.40,
2) సా.3.35-4.20
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** మీ పరిధులు మరింతగా విస్తరిస్తారు. అదే స్థాయిలో ఫలితాలు సాధిస్తారు.

**వృషభం :** వివిధ రకముల వృత్తుల వారికి, వ్యాపారస్థులకు వ్యక్తిగత నైపుణ్యమును నిరూపించుకొంటారు.

**మిథునం:** చెవి, ముక్కు, గొంతు సంబంధిత ఇబ్బందులు ఏర్పడతాయి. ఋణబాధలు తప్పవు.

**కర్కాటకం :** ఇరువర్గములతో సఖ్యత మంచిది కాదని తెలిసినా పరిస్థితుల ప్రాబల్యానికి లోబడరు.

**సింహం:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**కన్య :** ప్రత్యర్థులు మీపై వేసే ఎత్తులను చిత్తు చేయగలుగుతారు. విలువైన వస్తువులు కొనుగోలు.

**తుల :** ఆభరణాలు, స్థలాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు. ఉన్నత ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** మిత్రుల కష్టాలను కూడా మీవిగా భావించి కష్టపడతారు. పోటీ పరీక్షలలో విజయం.

**ధనుస్సు:** వ్యాపారపరమైన చర్చలు ఊపందుకుంటాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మకరం:** అంతంత మాత్రముగానే ఉన్న పరిచయములను గట్టిపరుచుకునే యత్నాలు ఫలిస్తాయి.

**కుంభం:** మిత్రుల నుండి మందలింపులను ఎదుర్కొంటారు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**మీనం :** రానిబాకీ వసూలు తలకు మించిన భారం అవుతుంది. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## తాడిపత్రి మునిసిపాలిటీకి గోల్డ్‌మెడల్

>> ఎస్‌పిడిసిఎల్ సిఎండి పాతశెట్టి, రాష్ట్ర ఎనర్జీ కన్వెన్షన్ మిషన్ సిఇఒ బివిపి కుమార్‌రెడ్డి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అవార్డును తాడిపత్రి మున్సిపల కమిషనర్ శివరామకృష్ణ అందుకున్నారు. వీధి దీపాలు, నీటి సరఫరా, మోటర్ల ఉపయోగంలో విద్యుత్ ఆదా చేసినందుకు ఈ గోల్డ్‌మెడల్ అవార్డు దక్కింది. ఈ అవార్డు పొందినందుకు మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందికి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలియచేశారు. అవార్డు రావడానికి సహకరించిన పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మీ అందరి సహకారంతో మరింత అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు ఈ అవార్డు మరింత ఉత్తేజాన్ని నింపిందన్నారు. మరింత కష్టపడి తాడిపత్రి మున్సిపాలిటీని దేశవ్యాప్తంగా ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని జె.సి పిలుపునిచ్చారు.


THE GOVERNMENT OF BODOLAND
Results of 20/12/2024
M.R.P. ₹.2/-

FUTURE SERIES Dr No:25
1st Prize Rs.100000/- 894818
2nd Prize Rs.7000/- 60986
3rd Prize Rs.3500/-
01063 03846 07556 21447 28315
36796 56114 75227 80076 80788
4th Prize Rs.200/-
0500 2065 3888 5077 6116
6261 7620 8067 9259 9355
5th Prize Rs.100/-
1376 1974 1992 2946 6050
7471 7662 7703 8047 9182
6th Prize Rs.50/-
0018 2148 3855 5832 6980 8643
0043 2160 4094 5858 7119 8659
0132 2181 4213 5911 7161 8794
0331 2182 4235 5931 7203 8795
0393 2606 4398 6080 7241 8842
0548 2671 4448 6290 7327 8895
0662 2798 4559 6352 7448 8982
0679 2815 4645 6363 7586 9012
0717 2835 4725 6374 7651 9014
0970 2919 4756 6435 7797 9323
0971 3018 4779 6535 7881 9558
1404 3026 4794 6612 8062 9707
1493 3215 4795 6822 8144 9725
1591 3312 5113 6889 8187 9823
1647 3436 5495 6927 8214 9902
1879 3763 5538 6939 8512
2032 3852 5659 6956 8609

SINGAM SERIES Dr No:25
1st Prize Rs.100000/- 366507
2nd Prize Rs.7000/- 42104
3rd Prize Rs.3500/-
01272 09735 09983 11877 29278
34880 58076 58206 76652 85955
4th Prize Rs.200/-
1435 2907 2986 3840 4527
7064 7938 8207 9185 9441
5th Prize Rs.100/-
0770 1385 3595 4784 5290
6405 7461 8771 9128 9554
6th Prize Rs.50/-
0023 1495 2935 4179 5766 8371
0026 1497 3012 4250 5947 8584
0121 1554 3064 4586 6107 8656
0132 1558 3104 4609 6363 8824
0221 1561 3150 4739 6941 9079
0245 1771 3208 4742 7051 9081
0830 2109 3297 4887 7117 9168
0853 2112 3384 4902 7214 9208
0920 2143 3462 4905 7296 9439
0962 2234 3628 5074 7411 9465
1043 2364 3635 5171 7748 9499
1146 2407 3700 5341 7777 9515
1190 2449 3776 5436 7836 9649
1277 2526 3822 5563 7842 9874
1460 2894 3964 5620 8072 9891
1488 2908 4033 5674 8104
1489 2927 4082 5753 8222

ABBLE SERIES Dr No:25
1st Prize Rs.100000/- 682351
2nd Prize Rs.7000/- 42802
3rd Prize Rs.3500/-
03783 25971 41424 42933 49442
57888 63941 68929 96477 99367
4th Prize Rs.200/-
0295 0542 2321 3672 4606
4856 5706 5964 9313 9475
5th Prize Rs.100/-
0861 1811 5504 6963 7119
7537 8506 8600 9246 9574
6th Prize Rs.50/-
0026 1189 2640 4207 6372 8011
0047 1283 2707 4356 6706 8078
0091 1295 2893 4457 6738 8084
0175 1391 2897 4643 6753 8162
0233 1414 3036 4695 6892 8493
0321 1846 3050 4781 7002 8521
0451 1871 3087 4853 7102 8529
0499 1978 3209 5264 7168 8876
0531 2029 3212 5401 7222 9022
0625 2051 3254 5404 7240 9119
0643 2137 3338 5439 7295 9169
0768 2179 3682 5500 7451 9360
0802 2227 3708 5505 7675 9412
0863 2303 3879 5531 7692 9624
0954 2327 4138 5559 7837 9976
1014 2562 4149 5624 7986
1144 2613 4190 5897 7988

NALLANERAM SERIES Dr No:25
1st Prize Rs.100000/- 398780
2nd Prize Rs.7000/- 88356
3rd Prize Rs.3500/-
16482 24038 27002 32128 49064
66522 67884 85906 95535 98546
4th Prize Rs.200/-
0721 1908 2643 4645 5071
5205 5324 5471 5984 8548
5th Prize Rs.100/-
0037 0844 0970 1354 2164
2674 3132 5660 7835 8472
6th Prize Rs.50/-
0083 2005 3487 6009 7796 9060
0224 2199 3559 6052 7857 9092
0274 2239 4023 6236 8068 9288
0637 2280 4544 6320 8156 9296
0720 2335 4703 6616 8261 9317
0754 2428 4812 6862 8345 9429
0943 2442 4824 6901 8503 9444
1012 2545 4905 6916 8522 9484
1093 2713 5095 7001 8527 9500
1132 2813 5129 7184 8543 9547
1261 2822 5149 7236 8618 9594
1412 2934 5171 7306 8622 9599
1708 3135 5353 7356 8683 9722
1795 3206 5464 7440 8761 9774
1821 3245 5795 7563 8846 9965
1826 3277 5876 7588 8938
1930 3341 5949 7613 9002

KUIL SERIES Dr No:25
1st Prize Rs.100000/- 410489
2nd Prize Rs.7000/- 35969
3rd Prize Rs.3500/-
02273 02949 14693 19009 25431
31884 57331 58077 58647 65138
4th Prize Rs.200/-
1169 2462 4076 4941 5755
6134 6907 7194 7477 7864
5th Prize Rs.100/-
0797 2673 4050 4903 5042
5861 5863 7253 7833 8999
6th Prize Rs.50/-
0018 1292 2778 4542 7006 8574
0049 1419 2902 4765 7144 8696
0100 1598 2994 5047 7196 9017
0152 1615 3398 5173 7241 9095
0184 1832 3457 5197 7392 9103
0203 1842 3591 5299 7412 9139
0205 1909 3606 5370 7471 9140
0264 1946 3641 5476 7482 9179
0332 1976 3749 5565 7694 9216
0397 2077 3807 5704 7755 9260
0595 2244 3918 6160 7834 9277
0618 2251 3997 6185 7904 9395
0853 2266 4063 6299 8103 9591
0872 2272 4178 6332 8133 9766
0886 2382 4285 6384 8169 9790
0942 2433 4325 6454 8239
1168 2675 4409 6684 8347

ROSA SERIES Dr No:25
1st Prize Rs.100000/- 224482
2nd Prize Rs.7000/- 94127
3rd Prize Rs.3500/-
06629 19514 38251 54376 68629
69652 76098 93351 94115 99133
4th Prize Rs.200/-
2704 2933 3413 3706 4359
4436 5339 7342 7546 9126
5th Prize Rs.100/-
2177 2267 4294 5208 5914
6244 8383 9458 9899 9984
6th Prize Rs.50/-
0080 1438 3081 4634 7056 8886
0149 1532 3136 4756 7181 8937
0213 1558 3223 4821 7188 8998
0373 1589 3400 5007 7208 9106
0395 1699 3401 5101 7293 9312
0442 1707 3735 5167 7584 9361
0464 1799 3783 5302 7843 9364
0515 1908 3863 5634 7926 9479
0657 1953 3974 5655 8322 9521
0738 2320 4213 5750 8395 9654
0763 2400 4366 5921 8538 9717
0922 2452 4457 5926 8561 9747
0988 2546 4485 5975 8604 9831
1153 2627 4492 6339 8661 9834
1174 2786 4498 6589 8773 9849
1210 2979 4628 6708 8803
1415 3004 4630 6959 8818

KUMARAN SERIES Dr No:25
1st Prize Rs.100000/- 225203
2nd Prize Rs.7000/- 57482
3rd Prize Rs.3500/-
09174 39586 54813 57871 58810
64233 70338 85465 87277 89192
4th Prize Rs.200/-
0287 0840 0903 1174 2487
3456 7046 7251 7727 8842
5th Prize Rs.100/-
0758 1741 2266 3565 3898
4992 6845 7063 7202 9508
6th Prize Rs.50/-
0073 1513 3398 4973 6711 8900
0085 1642 3468 5032 6881 8970
0117 1677 3594 5192 7055 9050
0159 2044 3812 5213 7081 9070
0168 2137 3965 5225 7220 9206
0315 2160 4259 5237 7456 9236
0335 2471 4295 5503 7765 9312
0683 2576 4357 5542 7848 9373
0693 2658 4431 5799 7938 9396
1014 2677 4547 6027 7946 9478
1156 2726 4700 6041 8012 9584
1163 2830 4710 6055 8263 9745
1280 2835 4754 6152 8300 9789
1312 2919 4777 6241 8406 9886
1352 2925 4805 6256 8429 9972
1459 3034 4877 6326 8490
1484 3115 4936 6332 8675

VISHNU SERIES Dr No:25
1st Prize Rs.100000/- 936362
2nd Prize Rs.7000/- 67286
3rd Prize Rs.3500/-
14403 17040 21001 34305 48583
71795 74754 76054 91863 95671
4th Prize Rs.200/-
1059 2030 2216 3311 3622
6667 6720 8365 9083 9510
5th Prize Rs.100/-
0288 1481 1824 1857 1898
3375 4795 4895 5857 7528
6th Prize Rs.50/-
0029 1396 3367 5001 7273 8767
0151 1459 3376 5017 7491 8808
0181 1472 3413 5103 7514 8832
0322 1754 3570 5346 7574 8838
0478 2086 3754 5416 7874 8917
0495 2109 4088 5507 7932 9005
0625 2146 4112 5587 8251 9117
0837 2243 4124 5696 8331 9147
0887 2458 4129 5989 8340 9275
0927 2782 4138 6239 8370 9452
1020 2818 4170 6514 8380 9515
1029 2964 4177 6580 8402 9556
1178 3085 4492 6607 8417 9680
1190 3137 4516 6670 8448 9711
1220 3194 4576 6892 8495 9800
1317 3334 4609 7026 8663
1359 3355 4899 7234 8700

DEAR SERIES Dr No:25
1st Prize Rs.100000/- 765396
2nd Prize Rs.7000/- 75298
3rd Prize Rs.3500/-
02039 13352 21149 22902 35909
48917 54349 56522 62214 85480
4th Prize Rs.200/-
3343 3500 4036 4453 4863
6754 7970 8695 9763 9994
5th Prize Rs.100/-
0345 1455 1915 3011 4591
4976 8108 8274 8962 9416
6th Prize Rs.50/-
0210 2770 4001 5521 6806 8537
0249 2778 4006 5528 7231 8577
0269 2927 4513 5548 7291 8586
0311 2934 4523 5611 7336 8750
0376 3032 4538 5640 7389 8818
0401 3195 4840 6050 7627 8871
0461 3225 4859 6085 7668 9394
0629 3345 4989 6149 7690 9500
1295 3351 5079 6199 7764 9539
1465 3377 5086 6351 7877 9540
1903 3478 5111 6356 7890 9553
1947 3561 5183 6445 7977 9649
2026 3577 5214 6490 8019 9835
2313 3647 5254 6604 8336 9836
2342 3665 5368 6608 8340 9876
2381 3920 5390 6674 8388
2519 3948 5465 6700 8421

THANGAM SERIES Dr No:25
1st Prize Rs.100000/- 132112
2nd Prize Rs.7000/- 85709
3rd Prize Rs.3500/-
01514 17643 39599 39731 54215
56085 56304 63420 79870 87686
4th Prize Rs.200/-
0103 1337 2678 2971 4365
5393 5409 6711 6933 7357
5th Prize Rs.100/-
0022 1652 3728 3942 5394
5766 6095 6418 7093 9351
6th Prize Rs.50/-
0041 1562 3366 5584 7759 8998
0134 1602 3379 5624 7950 9037
0166 1605 3447 5672 7978 9246
0181 1733 3491 5794 8265 9308
0224 1745 3899 5842 8312 9326
0248 1765 4011 6231 8320 9371
0278 1907 4247 6408 8357 9384
0282 1961 4299 6667 8362 9394
0399 2239 4328 6749 8450 9395
0491 2343 4446 6768 8494 9584
0630 2367 4453 6821 8525 9842
0739 2408 4526 7124 8671 9896
0742 2432 4616 7153 8713 9905
0827 2726 4656 7231 8756 9938
0852 3113 4660 7373 8796 9941
1283 3317 4708 7374 8897
1472 3328 4957 7721 8990

SWARNALAXMI SERIES Dr No:25
1st Prize Rs.100000/- 468399
2nd Prize Rs.7000/- 79828
3rd Prize Rs.3500/-
13268 24204 35824 46486 57414
68754 79527 81409 81871 92939
4th Prize Rs.200/-
0577 2728 2744 4517 4674
5358 6066 6491 7483 9044
5th Prize Rs.100/-
0603 1152 1755 1972 3521
4154 5585 6773 7507 9204
6th Prize Rs.50/-
0072 1649 3373 4822 7591 8759
0276 1738 3476 4909 7682 8968
0328 1807 3489 5198 7719 9002
0392 2105 3677 6506 7720 9021
0616 2124 3795 6610 7782 9124
0668 2132 3826 6617 7815 9165
0795 2237 3944 6659 7927 9178
0996 2262 4014 6689 7998 9221
1069 2280 4035 6830 8034 9254
1159 2480 4064 6887 8217 9463
1221 2500 4217 6984 8226 9545
1326 2565 4249 7360 8290 9599
1332 2775 4456 7394 8328 9672
1382 3108 4678 7426 8332 9941
1420 3113 4713 7453 8379 9967
1542 3199 4762 7490 8401
1597 3208 4813 7538 8480

LION SERIES Dr No:25
1st Prize Rs.100000/- 612663
2nd Prize Rs.7000/- 34337
3rd Prize Rs.3500/-
12200 12841 23298 23930 45419
45766 56505 67576 78631 89899
4th Prize Rs.200/-
2289 3480 4369 5263 5416
5610 5821 7780 8311 9235
5th Prize Rs.100/-
0031 0750 2224 4262 5796
6351 6589 6898 7836 8023
6th Prize Rs.50/-
0060 1158 2598 4967 7000 8609
0079 1398 3072 5173 7115 8918
0189 1416 3394 5223 7173 8974
0306 1429 3402 5308 7203 8995
0348 1573 3475 5357 7258 9051
0355 1729 3601 5581 7458 9075
0356 1776 3682 5593 7646 9270
0375 1819 3737 6179 7655 9416
0822 1884 3799 6284 7741 9483
0889 1979 3849 6375 7767 9535
0921 2187 3918 6420 7875 9581
0927 2462 4014 6429 7982 9629
0970 2500 4391 6435 8201 9668
0986 2505 4468 6538 8258 9886
0994 2531 4752 6617 8313 9976
1064 2555 4773 6791 8317
1074 2580 4810 6848 8343

21-12Pg3exHMNWJQERLK.qxd:21-12Pg3exHMNWJQERLK.qxd 01/01/01 9:27 AM Page 1



# రాష్ట్రానికి మరో వందేభారత్ రైలు

**విజయవాడ డిసెంబర్ 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో రైలు ప్రయాణికులకు మరో శుభవార్త రైల్వే శాఖ తెలిపింది. మరో వందేభారత్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. అమరావతి రాజధాని ప్రాంతం నుంచి రాయలసీమ కనెక్టివిటీని పెంచే పనిలో ఉన్నారు. ఈ మేరకు విజయవాడ బెంగుళూరు మధ్య వయా అనంతపురం కొత్త వందేభారత్ రైలును నడపాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఈ సర్వీసును త్వరలోనే ప్రారంభించేదుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుంది అంటున్నారు. రాయలసీమ లో ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజల ప్రయాణాలకు ప్రయాణం సౌకర్యంగా ఉంటుందంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మికుల నాయకులు

# చేనేత చిరుగులను పట్టించుకోరా?

## వైఎస్సార్సీ నేత మిద్దెల హరి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 20 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో చేనేతి పరిస్థితి దయనీయంగా మారిందని వైకాపా నేత మిద్దెల హరి ఆవేదన వ్యక్తం చేసారు. చేనేత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు. శుక్రవారం నగరి వీధిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆప్‌కో మాజీ డైరెక్టర్ ఎపియస్‌ఆర్‌టిసి మాజీ వైస్ చైర్మెన్ మిద్దెల హరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో 2025 యూనియన్ క్యాలండర్‌ను ముద్రించటానికి అలాగే చేనేత రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. చేనేత రంగంలో కార్మికులు పెట్టుబడులకు తిప్పలు పడుతున్నారని హరి వివరించారు. నానాతిప్పలు పడి ఉత్పత్తి చేసిన వాటికి మార్కెటింగ్ సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక ముడిసరకుల ధరల నియంత్రణ లేదన్నారు. తయారైన చేనేత వస్త్రాలకు తగిన గిట్టుబాటు ధరలేకపోవటంతో కార్మికులు పని లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రభుత్వం ప్రతినియోజకవర్గంలో మంగళగిరి తరహాలో వీవర్ శాలను ఏర్పాటు చేసి చేనేతలకు పని కల్పించటానికి పట్టు సబ్సీడీ ఆదరణ పథకం కింద పని ముట్లు పంపిణి, 50శాతం సబ్సీడీలతో బిసి ఎస్ సి కార్పోరేషన్ తరహాలో రుణాలు చేనేతలకు ఇప్పించేందుకు యువ నాయకుడు నారాలోకేష్ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకుడు అధ్యక్షుడు ఆకుల వాసు, ఉపాధ్యక్షుడు వెంకటముని, కార్యనిర్వాహాక కార్యదర్శి గుత్తి త్యాగరాజు పాల్గొన్నారు.

# రైల్వే కార్మికుల విశ్వాసాన్ని నిలుపుకుంటాం

## విజయోత్సవాల్లో అఖిల భారత రైల్వే కార్మిక సమాఖ్య

**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 20,ప్రభాతవార్త** రైల్వే కార్మిక లోకం అఖిల భారత రైల్వే కార్మిక సమాఖ్య, అనుబంధ సంస్థలపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలుపుకుంటామని అఖిల భారత రైల్వే కార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా, కోశాధికారి/దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావులు ప్రకటించారు. రైల్వే కార్మిక సంఘాల గుర్తింపుకై ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో రైల్వే కార్మికులు తమపై నమ్మకం, విశ్వాసంతో మరోసారి విజయం చేకూర్చి పట్టం కట్టారని తెలిపారు. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీ సభను మజ్దూర్ యూనియన్ నిర్వహించింది. ఏర్పాటు చేసిన సమావేశంకు మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కామ్రేడ్ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ శివగోపాల్ మిశ్రా మాట్లాడుతూ నేడు రైల్వే కార్మికులు 8వ వేతన సంఘం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొంటు ఎన్నికల విజయంతో పాటు కేంద్ర 8వ వేతన సంఘాన్ని సాధించి అమలు చేసే వరకు పోరా టాన్ని సాగిస్తామన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసాం కాబట్టి దేశంలోనే అత్యధిక జోన్ లలో కార్మికులు తమ ను గెలిపించారన్నారు. దేశంలో రైల్వే కార్మికుల హక్కులకై పోరాటాలు, ఉద్యమాలు చేసే ఏకైక కార్మిక సంఘంగా ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్‌కు పట్టం కట్టారని అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని వారు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. క్యాడర్ రిస్ట్రక్షరింగ్‌లో కార్మికులకు మెరుగైన పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. యునైటెడ్ పెన్షన్ స్కీంలో మార్పులు వచ్చేలా చేస్తామని పాత పెన్షన్ స్కీం తరహాలో ఇంకా మెరుగైన ప్రయోజనాలు కలిగేలా కృషి చేస్తామని అన్నారు. జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ రైల్వే యాజమాన్య, కార్మిక సంఘాల సమన్వయంతో కార్మికులకు న్యాయం చేకూర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించిన ఎన్నికల అధికారులకు ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, గుంతకల్లు డివిజనల్ కార్యదర్శి యస్ విజయకుమార్‌లు ఘనంగా సత్కరించారు.



రైల్వే ఎన్నికల అధికారిని సత్కరిస్తున్న మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, గుంతకల్లు డివిజనల్ కార్యదర్శి యస్ విజయ్‌కుమార్‌లు

# రాష్ట్రంలో పురుషులకు డ్వాక్రా సంఘాల మాదిరిగా సిఐజీలు

**విజయవాడ,డిసెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న పేదలకు సాయం చేయడానికి ఏపీలోని తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. డ్వాక్రా సంఘాల మాదిరిగానే పురుషుల గ్రూపులను ఏర్పాటు చేయిస్తోంది. తద్వారా వారితో పొదుపు కట్టించి బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా సర్కార్ చర్యలు చేపడుతోంది. ఇక తొలివిడతగా అనకాపల్లిలో 28 గ్రూపులు ఏర్పాటు చేయాలనేది టార్గెట్ కాగా ఇప్పటికే 20 గ్రూపులు ఏర్పాటు అయినట్లు తెలుస్తోంది. టీడీపీ హయాంలో పది మంది మహిళా సభ్యులతో ఒక్కో డ్వాక్రా సంఘాన్ని ఏర్పాటు చేసి, వారితో పొదుపు చేయించారు. దీని ఆధారంగా బ్యాంకుల నుంచి రుణం తీసుకుని సక్రమంగా చెల్లించిన వారికి రుణం పెంచుకుంటూ వచ్చారు. ఇప్పుడు ఇదే తరహాలో ఐదుగురు సభ్యులతో కామన్ ఇంట్రస్ట్ గ్రూపు (సీఐజీ) ఏర్పాటు చేస్తున్నారు. వాచ్‌మెన్లు, ప్రైవేట్‌గా పనిచేస్తున్నవారు, రిక్షాకార్మికులు, జొమాటో, స్విగ్గీ డెలివరీ బాయ్స్, భవన నిర్మాణ కార్మికులు ఇలా ఎవరైనా 18 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న పురుషులు సీఐజీలో చేరొచ్చు. అనకాపల్లి జీవీఎంసీ జోనల్ ఆఫీస్‌లోని యూసీడీ కార్యాలయంలో ఆధార్, తెల్ల రేషన్ కార్డులు జతచేసిన దరఖాస్తులు అందిస్తే వారు గ్రూపును ఏర్పాటు చేస్తారు. సీఐజీ గ్రూపులకు తొలివిడతలో రూ. 75వేల నుంచి రూ. లక్ష వరకు రుణం అందించేలా చర్యలు తీసుకుంటోంది. ఐదుగురు సభ్యులు వస్తే ఎన్ని గ్రూపులైనా పెట్టడానికి రెడీగా ఉన్నామని అధికారులు పేర్కొన్నారు. గ్రూపులుగా ఏర్పడితే తక్కువ వడ్డీకి బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని అన్నారు. వాటిని సక్రమంగా చెల్లిస్తే డ్వాక్రా సంఘాల మాదిరిగానే బ్యాంకులు రుణ పరిమితిని పెంచుతాయని తెలిపారు.

# అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ మనుగడ కోల్పోతోంది: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,డిసెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజ్యాంగ బద్ధంగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఉన్నట్టుండి రాజ్యాంగం, అంబేద్కర్ మీద ప్రేమ పుట్టుకువచ్చిందని విమర్శించారు. ఇవాళ విజయవాడలో మంత్రి సత్యకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మీడియా మాట్లాడుతూ.. రాజ్యాంగంలో 24వ సవరణ తీసుకువచ్చి ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులు హరించే విధంగా కాంగ్రెస్ పాలన చేసిందని అన్నారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రాజ్యాంగం రచించ్చేటప్పుడు అంబేద్కర్‌ని అవమానపరిచేలా కాంగ్రెస్ పార్టీ కార్టూన్స్‌ని విడుదల చేశారని ఫైర్ అయ్యారు. అంబేద్కర్‌ని నెహ్రూ చాలా విధాలుగా అగౌరవపరిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ని ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడించారని చెప్పారు. అంబేద్కర్ పోటీ చేసినప్పుడు బీజేపీ అభ్యర్థిని పోటీకి దించకుండా ఆయన్ని బీజేపీ గౌరవించింది. అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించటానికి నెహ్రూ అడ్డుపడ్డారు. అంబేద్కర్ సేవలకు భారతరత్న ఇవ్వకుండా నెహ్రూకు మాత్రం ప్రకటించుకున్నారు. అంబేద్కర్ సేవలు గుర్తించి బీజేపీ భారతరత్న ఇచ్చి గౌరవించింది. అంబేద్కర్ నడయాడిన ఐదు ప్రదేశాల్లో పంచ తీర్థ్ కార్యక్రమంతో బీజేపీ శ్రీకారం చుట్టింది. ఏపీలో కూడా కొత్త పిచ్చగాళ్ళు తయారయ్యారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయ్యింది. అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ మనుగడ కోల్పోతుంది. కాంగ్రెస్ తప్పు తెలుసుకుని అసత్య ప్రచారాలు చేయటం మానుకుంటే మంచిది. జమిలి ఎన్నికలు ఈ దేశానికి కొత్త కాదు. గతంలో చూసుకుంటే దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగాయ్ని అని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

# రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యవర్గాల ఏర్పాటు

## ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు

**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 20,ప్రభాతవార్త** రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల అనంతరం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ రానున్న మూడేళ్ల కాలవ్యవధికి కొత్తగా జోనల్, డివిజనల్ కార్యవర్గాలను ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు ప్రకటించారు. సికింద్రాబాద్‌లో శుక్రవారం జరిగిన రైల్వే మజ్దూర్ యూనియన్ 7వ. త్రైవార్షక(54వ. వార్షిక సమావేశాల్లో)సమావేశంలో ఈ మేరకు జరిగిన మార్పులు, చేర్పులను ఆయన వివరించారు. రాబోయే మూడు సంవత్సరాలకు జోనల్ ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ శంకర్‌రావు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే జోనల్ అధ్యక్షులుగా శ్రీనివాస్ ఎన్నిక కాగా, సరోజినీ రెడ్డి, జోనల్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శిగా రవీంద్ర, విజయవాడ డివిజనల్ కార్యదర్శిగా లీల, గుంతకల్లు డివిజనల్ కార్యదర్శిగా ఎస్. విజయకుమార్, గుంటూరు డివిజనల్ కార్యదర్శి ప్రసాద్, హైదరాబాద్ డివిజనల్ కార్యదర్శిగా కృష్ణ, వర్క్‌షాప్ డివిజనల్ కార్యదర్శిగా బుచ్చిరెడ్డి, నాందేడ్ డివిజనల్ కార్యదర్శిగా మణికుమార్‌లు తిరిగి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మాణం చేశారు. జోనల్ వర్కింగ్ కమిటీలో గుంతకల్లు డివిజన్ నుంచి కొత్తగా జి సురేష్ కుమార్‌ను నియమించగా గుంతకల్లు రైల్వే డివిజనల్ అధ్యక్షుడిగా పనిచేసిన సుదర్శనరాజు నవంబరు 30న పదవి విరమణగావించడంతో ఆయన స్థానంలో సహాయ కార్యదర్శిగా ఉన్న బిఎం భాషాను అతని స్థానంలో శ్రీనివాసులును ఎన్నుకున్నట్లు యూనియన్ వర్గాలు తెలిపాయి.

# గంజాయి అమ్మకం స్థావరాలపై పోలీసుల దాడులు

## రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం.. 7 గురు అరెస్ట్ : కావలి డిఎస్పీ శ్రీధర్

**కావలి (నెల్లూరు), డిసెంబర్ 20, ప్రభాతవార్త :** గంజాయి అమ్మకాలను తుదముట్టించి యువతను కాపాడాలన్న సంకల్పంతో కావలి టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వి.గిరిబాబు పోలీసుసిబ్బందితో గంజాయి స్థావరాలపై ఆకస్మికదాడులు నిర్వహించారు. 55వేల రూపాయాలపైచిలుకు విలువ కలిగిన రెండు కిలోల ఐదువందల ముప్పైగ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 7 మందిని అరెస్ట్ చేశారు. రెండు మోటార్ సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్స్ స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కావలి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కావలి డీఎస్పీ పి.శ్రీధర్ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాలమేరకు తన పర్యవేక్షణలో టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గిరిబాబు సిబ్బందితో కలిసి గంజాయి అమ్మకాల స్థావరాలపై ఆకస్మికదాడులు నిర్వహించారు. ఇటీవల కాలంలో యువత, విద్యార్థులు గంజాయి తదితరవాటికి బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. గంజాయిని పూర్తిస్థాయిలో తుదముట్టించాలని జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు పోలీసు నిఘావేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా కావలి పెద్దపవనిరోడ్డు పి.జి కళాశాల ఎదురుగా, వైకుంఠపురం రైల్వేబ్రిడ్జికింద గంజాయి అమ్మకందారులను నిఘావేసి వలపన్ని పట్టుకున్నారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా దొరకొండ ప్రాంతంనుండి గంజాయి కొనుగోలు చేసినట్లు ముద్దాయిలు తెలిపారన్నారు. ఈ దాడుల్లో పట్టుబడ్డ 7 మంది గత కొంతకాలంగా గంజాయిని అక్రమంగా కొనుగోలుచేయడం, అమ్మడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ అక్రమలాభాలు ఆర్జిస్తున్నారన్నారు. ప్రజలు, యువత ఆరోగ్యానికి హానికల్గించే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గంజాయిని పూర్తిస్థాయిలో అరికడతామని డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. గంజాయిని అక్రమంగా అమ్ముతూ యువతను బానిసలుగా చేస్తున్న 8 మందిని గుర్తించగా, వారిలో 7 మందిని అరెస్ట్‌చేయడం జరిగిందని కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. కావలి పి.జి కళాశాల ఎదురుగా పెద్దపవని రోడ్డులో నివసిస్తున్న షేక్.మస్తానమ్మ, అదే ప్రాంతంలో నివసిస్తున్న షేక్.గౌస్‌బాషా, వైకుంఠపురంలో నివసిస్తున్న షేక్.మీరాబీ, లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లి గ్రామానికి చెందిన దగ్గు చిన్నఅబ్బయ్య, ప్రకాశంజిల్లా నేకునాంపురం గ్రామానికి చెందిన కారంశెట్టి సుధాకర్, పొన్నలూరు మండలం మాలేపాడు గ్రామానికి చెందిన షేక్.గౌస్‌బాషా, అదే గ్రామానికి చెందిన షేక్.రసూల్‌బీలను అరెస్ట్‌చేయడం జరిగిందన్నారు. తూర్పు గోదావరిజిల్లా కొటానందూరు మండలం, దొరకొండ గ్రామానికి చెందిన గంజాయి సరఫరా చేసిన వ్యక్తిని గుర్తించడం జరిగిందన్నారు. వీరితోపాటు రెండుకిలోల ఐదువందల ముప్పైగ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నామన్నారు.




# శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి గ్రంథావిష్కరణ

**విజయవాడ,డిసెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాషా వికాసానికి జీవితకాలమంతా పరిశ్రమించి మహనీయుడు చిన్నయ సూరి అని అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు.

పరవస్తు చిన్నయ సూరి 218వ జయంతిని పరవస్తు సాహితీ పీఠం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా అధ్యక్షులు టి శోభనాద్రి సభాధ్యక్షతన ఆచార్య వెలమల సిమ్మన్న డాక్టర్ గుమ్మా సాంబశివరావు రచించిన శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి అనే గ్రంధాన్ని ఆవిష్కరించారు. విజయవాడ ఠాగూర్ లైబ్రరీలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండలి బుద్ధప్రసాద్ హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానంద పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషకు విశేషమైన కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చిన బాల వ్యాకరణం నీతి చంద్రికలాంటి రచనలు చేసి భాషాభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు, పి.తేజస్వీని, ప్రముఖ కవులచే కవి సమ్మేళనం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి ఎస్పీ శేషగిరిరావు స్వాగతం పలికి సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జి వి పూర్ణచంద్, విద్యావేత్త రాకేష్ విద్య సంస్థల డైరెక్టర్ ఎన్వీరావ్, సాహితీ పీఠం కార్యవర్గం తత్తరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా రాజకీయ వ్యాఖ్యలు సహించం !

- బిఆర్‌ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్‌పై చట్టరీతా చర్యలు
- టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు



**తిరుమల,డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:** హిందువుల పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ పవిత్రతకు భంగం కలిగించినా, ప్రశాంతతను దెబ్బతీసేలా ఎవరైనా రాజకీయ వ్యాఖ్యలు చేస్తే చూస్తూ సహించేదిలేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మరోసారి స్పష్టం చేశారు. గురువారం ఉదయం తిరుమలలో ఆలయం ముందు హైదరాబాద్ బిఆర్‌ఎస్ పార్టీనేత శ్రీనివాస్‌గౌడ్ రాజకీయ వ్యాఖ్యలు చేయడంతో సంచలనం కలిగించింది. దీనిపై సామాజికమాధ్యమాల వేదికగా టిటిడి ఛైర్మన్ నాయుడు స్పందించారు. తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రం, ఇది రాజకీయ వేదిక కాదని, రాజకీయంగా తిరుమలను వేదికగా చేసుకుంటే చర్యలు తప్పవని గతంలోనే నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ నేపధ్యంలో బిఆర్‌ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యలపై చర్యలకు వెనుకడుగువేయబోమని, కొండపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమని , గౌడ్‌పై చర్యలకు ఆదేశించారు. మరీ ఈ ఘటనపై ఎలాంటి మలుపులు తిరుగుతాయో చూడాల్సిందే.

**- తొలిసమావేశంలోనే కీలక నిర్ణయం:** వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వచ్చి తమ కోర్కెలు చెప్పుకుని, కష్టాలు తీర్చమని సామాన్య భక్తుల నుండి వివిఐపిలు వేడుకోవడం పరిపాటి. తిరుమల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని దశాబ్ధకాలం క్రిందటే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలి ప్రతిపాదనలు చేసింది. అయితే ఇది కార్యరూపాం దాల్చలేదు. గత దశాబ్ధంగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న ప్రజాప్రతినిధులు, రాజకీయనేతలు, ప్రముఖులు ఆలయం వెలుపల రకరకాల రాజకీయ వ్యాఖ్యలు చేయడం, ఆరోపణలతో ఆలయ పవిత్రతను మంటగలుపుతున్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమిలోని తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పవిత్రతను కాపాడూతామని, ఇక్కడ గోవింద నామస్మరణ తప్ప మరో పదం వినిపించకూడదని స్పష్టంగా ఆదేశించారు. టిటిడి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడు(బిఆర్‌నాయుడు)నేతృత్వంలోని బోర్డు గతనెల 18న తొలిసమావేశంలోనే నిర్ణయం తీసుకుంది.

## విఐపి బ్రేక్ బ్లాక్‌లో - పట్టుబడిన పోలీసు కానిస్టేబుల్

**తిరుమల,డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:** నిజాయితీగా సేవలందించాల్సిన ఓ కానిస్టేబుల్ ఏకంగా తనకున్న పలుకుబడి ఉపయోగించుకుని విఐపి బ్రేక్ దర్శనాలను అధిక ధరకు విక్రయించి టిటిడి విజిలెన్స్‌కు చిక్కాడు. కొందరు భక్తులకు తనకు తెలిసిన వారికి 10మందికి బ్రేక్ దర్శనాలు ఇప్పించాడు. అధికంగా డబ్బులు తీసుకోవడంతో చంద్రశేఖర్‌పై భక్తులు ఫిర్యాదు చేయడంతో టిటిడి విజిలెన్స్ వింగ్ అధికారులు పట్టుకున్నారు. దీనిపై తిరుమల 2టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

## అంతా మంచి జరగాలని వేడుకున్నాం - శ్రీవారిసేవలో ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలకు అంతా మంచి జరగాలని, చిత్ర పరిశ్రమ లోని అందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు యువ నటుడు అక్కినేని అఖిల్ తెలిపారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో నటుడు అఖిల్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. వెలుపలకు వచ్చిన అఖిల్‌ను చూడటానికి, సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్



**తిరుమల,డిసెంబర్ 20ప్రభా తవార్త ప్రతినిధి:** కలి యుగప్రత్యక్ష దైవమ్ శ్రీవేంక టేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఆకాంక్షించారు. రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని వేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. శుక్రవారం వేకువజామున కుటుంబంతో కలసి ఆయన శ్రీవారి అభిషేకసేవలో పాల్గొన్నారు. ఆలయం మహద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. అభిషేకసేవలో పాల్గొన్న సిఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్ కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం చేయించారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. సిఎస్ వెంట తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఉన్నారు.

## మార్చినెల శ్రీవాణి, ఎస్ఇడి దర్శనాల విడుదల తేదీలో మార్పు

-23న వైకుంఠద్వార దర్శనాల టిక్కెట్లు

**తిరుమల,డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని మరింత సులభంగా దర్శించుకునేందుకు 90రోజుల ముందు ఆన్‌లైన్‌లో విడుదల చేసే రానున్న మార్చినెల శ్రీవాణి, ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్ల విడుదల తేదీల్లో టిటిడి మార్పుచేసింది. రానున్న జనవరి నెల 10నుండి 19వతేదీ వరకు తిరుమల ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి శ్రీవాణి, 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు విడుదల చేస్తుండటంతో మార్చినెల కోటా టిక్కెట్లు విడుదలలో మార్పుచేసినట్లు టిటిడి తెలిపింది. జనవరిలో వైకుంఠద్వార దర్శనాల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు ఈనెల 23వతేదీ ఉదయం 11గంటలకు, ఎస్ఇడి టిక్కెట్లు 24వతేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తున్నారు. ఈ కారణంగా మార్చినెల ఆన్‌లైన్‌లో దర్శనాల టిక్కెట్లు విడుదల తేదీలు మార్పుచేసింది. డిసెంబర్ 25వతేదీ ఉదయం 11గంటలకు మార్చినెల శ్రీవాణి టిక్కెట్లు, 26వతేదీ ఉదయం 11 గంటలకు ఎస్ఇడి దర్శనాలు టిక్కెట్ల కోటా విడుదల చేస్తున్నారు. అదేరోజు సాయంత్రం తిరుపతిలోని వసతిగదుల బుకింగ్‌కు గదుల కోటా విడుదలచేస్తారు. భక్తులు ఈ మార్పును గమనించాలని, తమ దర్శనాలు, వసతిని "టిటిడిదేవస్థానమ్స్. ఎపి, జిఒవి, ఇన్" వెబ్‌సైట్‌లో మాత్రమే టిక్కెట్లు బుక్‌చేసుకోవాలి.

## గుట్టగా పేరుకున్న చెత్త తొలగింపు

**తిరుమల,డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:** దశాబ్ధకాలంగా తిరుమలలో పోగయ్యే ఘన,ద్రవ పదార్థాల చెత్తను పాపవినాశనమ్ మార్గంలోని కాకులకొండ సమీపంలో నిల్వచేస్తున్న టిటిడి దాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటోంది,. ఇందులో బాగంగా ఇప్పటికే కొందరు గుత్తేదార్లు ముందుకు వచ్చినా చెత్తను పూర్తిగా తొలగించలేదు. దీంతో టిటిడి నూతన ప్రస్తుత బోర్డు ఛైర్మన్ బిఆర్ నాయుడు గుట్టగా ఉన్న చెత్తను తొలగించాలని ఆదేశించారు. ఆయన స్వయంగా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రెండవరోజే డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. చెత్తను తొలగించేందుకు గతంలో కాంట్రాక్టు ఇచ్చిన వారి పరిస్థితి, కాంట్రాక్టర్ల పరిస్థితిపై అధ్యయనం చేస్తున్నారు.



అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనా శక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.

-వి.జాన్సన్

# ప్రశ్నపత్రాల వ్యాపారం?


విద్యాసంవత్సరానికి సంబంధించి పరీక్షల తేదీలు ప్రభుత్వం ప్రకటించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో టెన్షన్ ప్రారంభమైంది. పరీక్షా విధానంలో మార్పులు, తప్పులు లేని ప్రశ్నపత్రాలు, ఇవ్వడంలో విఫలం, లీకులు సర్వసాధారణంగా జరుగుతుండడంతో న్యాయస్థానాలను ఆశ్రయించడం జరుగుతున్న విషయం అందరికి తెలిసిందే. ఈపరీక్ష, ఆ పరీక్ష అనికాదు చివరకు ఉద్యోగాల కోసంజరుపుతున్న పరీక్షల నిర్వహణలో సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారనే విమర్శలను తోసిపుచ్చలేం. ఈసారి కూడా పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందడం సహజం. తెలుగు రాష్ట్రాల్లో ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా కూడా కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉంది. ప్రధానంగా పదోతరగతి, ఇంటర్మీడియేట్ కొన్ని యూనివర్సిటీలు నిర్వహిస్తున్న డిగ్రీ కోర్సుల కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు సంబంధించిన విషయంలో కూడా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలుతీసుకొని పకడ్బందీగా నిర్వహించలేకపోతున్నది. ఎలాంటి తప్పులు జరగకుండా ప్రశ్నపత్రాలు రూపొందించి పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని ప్రతి యేడాది లాగానే ఈసారి కూడా పాతపాటే పాడుతున్నారు. అధికారంలో ఈపార్టీ ఆపార్టీ అనికాదు ఎవరున్నా లీకులు, తప్పులు, నిర్వహణలోపాలు దర్శనమిస్తూనే ఉన్నాయి. దీంతో ఎంతోమంది విద్యార్థులభవిష్యత్ అగమ్యగోచరంగా మారిపోతున్నది. ప్రశ్నపత్రాలు లీకు అయిన విషయం కొన్నిసందర్భాల్లోనే బయటపడుతుంది. ఇలా బయటపడిన సందర్భాల్లో ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో పరీక్షలు వాయిదా వేస్తున్నది. ఇందుకు గతంలో జరిగిన ఎన్నో కీలక పరీక్షలను ఉదహరించవచ్చు. అటు మెడిసిన్, ఇటు ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షల్లో జరుగుతున్న అవకతవకలు అన్నీఇన్నీకావు. చివరకు కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షలకు కూడా ఈ జిడ్డు అంటుకున్నది. బయటకు వచ్చినప్పుడు రద్దుచేసి తిరిగి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ లీకు గుట్టుచప్పుడుకాకుండా ఉంటే పరీక్షలు రద్దుచేసే ప్రసక్తేరాదు. రద్దయిన పరీక్షలకు తిరిగి హాజరు కావాల్సిన విద్యార్థుల పరిస్థితి ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలి. రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలకు తయారై రాయాల్సిన సమయానికి వాయిదా పడినా, రాసిన పరీక్షలను మళ్లీరాయమన్నా ఆ విద్యార్థులుఎంతటి నిరాశానిస్పృహలకు గురవుతారో పాలకులు ఆలోచించడం లేదు. ఇక ఈ ప్రశ్నపత్రాలు లీకై బయటపడకుండా ఉంటే ఈ ప్రశ్నపత్రాలు కొన్నవారు అందలమెక్కిపోతున్నారు. ప్రశ్నపత్రాల జవాబులు కంఠస్తం చేసిన ప్రబుద్ధులు ఎలాంటి కష్టం లేకుండా మేధావులుగా పైకి వెళ్లిపోతుంటే సంవత్సరం పొడువునా శ్రద్ధాశక్తులతో కష్టపడి చదివిన మెరికల్లాంటి విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా క్షుణ్ణంగా ఆలోచించాలి. అసలు ఇవి ఏ దశలో లీక్ అవుతున్నాయి? దీనికి బాధ్యులెవరు? ప్రశ్నపత్రాలు తయారు చేసేవారా? లేక వాటిని సరిచూసి సక్రమంగా ఉన్నాయా, లేదా అని నిర్ధారించేవారా? పరీక్షా కేంద్రాలకు చేర్చేవారా? చేరిన తర్వాత అది నిర్వహిస్తున్న అధికారులా? తదితర అంశాలు పరిశీలించాల్సి ఉంది. గతంలో ఒకసారి మెడికల్ ప్రశ్నపత్రాలను రూపొందించిన ప్రొఫెసరే లీక్కు బాధ్యుడు కాగా మరొకసారి ఎంసెట్ ప్రశ్నపత్రాలు ముద్రించిన ప్రింటింగ్ యజమాని బాధ్యుడైనట్లు దర్యాప్తులో తేలింది. ఆ ప్రింటింగ్ యజమానితనకు ప్రశ్నపత్రాల ముద్రణకు కాంట్రాక్టు విషయంలో సహాయపడినకొందరు అధికారులకు ఏమేరకు ప్రతిఫలంగా డబ్బు అందించారో కూడా అప్పట్లో అధికారులు కూపీ లాగగలిగారు. కానీ అవన్నీరికార్డులకే పరిమితమయ్యాయి. వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా ఉండగలుగుతున్నారు. రానురాను విద్యావ్యవస్థ ఎంతటి పతనావస్థకు దిగజారిపోతున్నదో ఈ పరీక్ష పత్రాల వ్యాపారాన్ని చూస్తే అర్థమవుతుంది. అంతెందుకు రెండేళ్ల క్రితం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్లో జరిగిన ప్రశ్నపత్రాల వ్యాపారంపై దర్యాప్తుఇంకా ఒక కొలిక్కివచ్చినట్టు కన్పించడం లేదు. ఇప్పటికే వంద మందికిపైగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఏదిఏమైనా చదివే జీవన్మరణ సమస్యగా రాత్రింబవళ్లు కృషిచేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్ ఆలోచిస్తే హృదయం ద్రవించక మానదు. నిత్య అధ్యయనంతో విజ్ఞానం ఆర్జించి పరిశోధనలతో మేధాసంపత్తిని పెంచుకోవాల్సిన విద్యావిధానండబ్బుతో కొనుక్కునేస్థాయికి దిగజారడం అత్యంత దురదృష్టకరం. ఇందులో ప్రైవేట్ విద్యాసంస్థలను, కోచింగ్ సెంటర్లను నిందించేకంటే విద్యను వ్యాపార వస్తువుగా మార్చి స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కల్పించిన పాలకులనే నిందించాలి. రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి ఆది నుంచి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సిలబస్లో లేని ప్రశ్నలు ప్రశ్నపత్రాల్లో పొందుపరిచి విద్యార్థుల విలువైన సమయానికి గండికొట్టకూడదు. ఇలాంటివి తరచుగా జరుగుతున్నాయి. కేవలం కొందరు అధికారులవల్ల ప్రభుత్వం అప్రతిష్టపాలవుతున్నది. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ఈసారి జరగబోయే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి. ప్రశ్నపత్రాల లీకేజీలు బయటపడి విద్యార్థుల నుంచి నిరసన జ్వాలలు ఎదురైనప్పుడు సంబంధిత విద్యాశాఖమంత్రులు రాజీనామాలు చేసిన సదర్భాలున్నాయి. కానీ ఈ పరీక్షల నిర్వహణలో కీలకపాత్ర వహించే అధికారులకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు కలగడం లేదు. అక్రమాలకు బాధ్యులైనవారిని ఉద్యోగాల నుంచి తొలగించడమేకాక క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేసివారిఫొటోలతోసహా విస్తృతంగా ప్రచారంద్వారా ప్రజలకుతెలియపరచాలి. ప్రభుత్వం అంత కఠినంగా వ్యవహరించకపోతే ఈ వ్యాపారానికి ఫుల్స్టాప్ పెట్టడం సాధ్యంకాదు.

ఆత్మ విశ్వాసంతో కృషి చేసే వ్యక్తి అందుకోలేని విజయాలు ఉండవు.



వినోబా భావే

నిజాలను మనం నిర్లక్ష్యం చేస్తే అవి రెట్టింపు శక్తితో ప్రతీకారం తీర్చుకుంటాయి.



విలియం రోజర్

# ప్రకృతి కాదు.. మానవ ద్రోహమే!

**భారత్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నాచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుంది. ముంబాయి నగరానికి అయితే ప్రతి వర్షాకాలంలోనూ వరద ముంపు తప్పడం లేదు. రోజుల తరబడి జీవనం స్తంభించిపోతున్నది. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్ల బారి నుంచి తీరప్రాంత ప్రజలు తప్పించుకోలేకపోతున్నారు. గత రెండు నెలలుగా బంగాళా ఖాతంలో అల్పపీడనమో, వాయుగుండమో, తుఫాన్లతో కురుస్తున్న వర్షాలతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల ప్రజలు వణికిపోతున్నారు. తుఫాన్ల కారణంగా వ్యవసాయం రంగానికి అపార నష్టం కలుగుతున్నది.**

దామెర్ల సాయిబాబ

తమలపాకుతో నువ్విట్లంటే తలుపు చెక్కతో నేనట్లంటా అన్నట్టుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు తప్పుపట్టాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మానవుడిమనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే హెచ్చరిస్తున్నా, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఒక్క భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యావరణ పరిరక్షణ ప్రశ్నార్థకంగామారుతున్నది. ముఖ్యంగా అడవులు తరిగి పోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. వాస్తవంగా భూమ్మీద ముప్పైశాతానికిపైగా అడవులు విస్తరించి ఉన్నాయి. ప్రపంచ జనాభాలో మూడోవంతు ప్రజలు వంట చెరుకు కోసం ఇప్పటికీ అడవుల మీదనే ఆధారపడుతున్నారు. అంతేకాదు అటవీ రంగంపై ప్రత్యక్షంగానో, పరోక్షం గానో ఉపాధి పొందుతున్నవారు భారీ ఎత్తునే ఉన్నారు. కోట్లాది వన్యప్రాణులకు అడవులు ఆవాసం కల్పిస్తున్నాయి. మానవాళికేకాదు సమస్త జీవకోటికి వివిధ రకాలుగా ఉప యుక్తమవుతున్న అటవీ సంపద అంతకంతకు తరిగిపోతున్నది. నాలుగేళ్ల నాటి ప్రపంచ అడవుల స్థితిగతుల నివేదిక ప్రకారం 1990-2020 మధ్య కాలంలో నూట నాలుగు కోట్ల ఎకరాలకుపైగా అడవులు కనుమరుగైనట్లు వెల్లడయింది. ఇక భారతదేశానికి సంబంధించి 2021 నివేదిక ప్రకారం దేశంలో దట్టమైన అరణ్యాలు కొంతమేరకు పెరిగినప్పటికీ మధ్యస్థసాంద్రమైన అడవులు క్షీణిస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలు పెట్టి కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాలు పంట పొలాలు జనావాసాలుగా మార్చడం ఇలా ఒక్కటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతున్నారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో పదేళ్లలో ఇండియా జనాభా నూట నలభైఐదు కోట్లకు చేరుకుంటుందని, అందుకు తగినట్లుగా దేశంలోని సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద అత్యంత వేగంగా హరించుకుపోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్లో రోజుకు దాదాపు మూడు వందల ముప్పై ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్య సమితి నివేదికలో స్పష్టం చేసింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు నదీ లోయ ప్రాజెక్టులకోసం యథేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. రోడ్ల అభివృద్ధికి సోపానాలు అయినా ఆ రహదారులే అడవులను అక్రమంగా నరికివేసి రవాణా చేసేందుకు స్మగ్లర్లకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేకపోతున్నాం. ఇందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతాకాదు. ఒక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్నివందల సంవత్సరాలు పడుతుంది. పర్యావరణానికి ప్రమాదకరంగా కొన్ని ప్లాస్టిక్ వస్తువులు నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్యం నియంత్రణ మాటలకే పరిమితమవుతుంది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకురెట్టింపు స్థాయిలో వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు, వదులుతున్న పొగ అన్నీకలిపి వాయుకాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూ ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదేపరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత ప్రపంచంలోని తీరప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదాలున్నాయని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో ఎన్నో రకాలుగా మనిషి ఆటలా డుకుంటుంటే అందుకు ప్రతీకగా ప్రకృతి తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకేసారి ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. అంతేకాదు వరదలు, తుఫాన్లతో పాటు భూకం పాలు లాంటి ఉపద్రవాలు తరచుగా మానవాళిపైదాడి చేస్తున్నాయి. యేటా దాదాపు ప్రపంచవ్యాప్తంగా మూడు వందల ఎనభైకిపైగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా యేటా లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు వదులుకుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో అనారోగ్యం పాలవుతున్నారు. ఆస్తుల నష్టాల గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటే ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణ, ఆస్తుల నష్టం కొంత మేరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్న కారణంగా విజృంభిస్తున్న ప్రకృతికి అడ్డుకట్టవేయలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుంచి మానవుడు బయటపడలేకపోతున్నాడు. మొన్నామధ్య చైనాలో ప్రకృతిసృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పవచ్చు. సాంకేతికంగా, ఆర్థికంగా, ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులుకూడా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు. వెయ్యిసంవత్సరాల చరిత్రలో ఎన్నడూలేని విధంగా చైనాలోని సెంట్రల్ వానన్ ప్రావెన్స్లో ఒకేరోజు ఏకంగా 457.5 మిల్లీమీటర్ల కుంభవృష్టి కురిసింది. ఎల్లోనది ఉగ్రరూపం దాల్చి ముంచెత్తింది. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. ఒక్క చైనాయేకాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నాచితక వానలకే దేశంలోని అనేకనగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. ముంబాయి నగరానికి అయితే ప్రతి వర్షాకాలంలోనూ వరదముంపు తప్పడంలేదు. రోజుల తరబడి జీవనం స్తంభించిపోతున్నది. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్ల బారినుంచి తీరప్రాంత ప్రజలు తప్పించుకోలేకపోతున్నారు. గత రెండు నెలలుగా బంగాళా ఖాతలంలో అల్పపీడనమో, వాయుగుండమో, తుఫాన్లతో కురుస్తున్న వర్షాలతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల ప్రజలు వణికిపోతున్నారు. తుఫాన్ల కారణంగా వ్యవసాయ రంగానికి అపారనష్టం కలుగుతున్నది. అన్నింటికంటే ముఖ్యంగా 1977లో సంభవించిన తుఫాన్ సిరిధాన్యాలతో తులతూగే దివిసీమను శవాల దిబ్బగామార్చేసింది. ఇప్పటికీ ఆ బీభత్సం గురించి కథలుకథలుగా చెప్పుకుంటారు. హుదూద్ తుఫాన్ విశాఖపట్టణాన్ని కుదిపి వేసింది. 1993లో మహారాష్ట్ర లాతూర్లో సంభవించిన భూ కంపం ఎన్నోకుటుంబాలను చిదిమేసింది. 2004లోసునామీ, ఇటీవల తరచుగా వస్తున్న భూకంపాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఉత్తరాఖండ్ పరిస్థితి అయితే అంచనాలకు అందదు. ఎప్పుడు ఏరూపంలో వరదలు, భూకంపాలు ముంచుకు వస్తాయో చెప్పలేని పరిస్థితి. ఇందుకు పాలకుల చర్యలే కొంతమేరకు కారణమనే విమర్శలను కొట్టివేయలేం. ఏదిఏమైనా ఈ ఉపద్రవాలను నియంత్రించి పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదు. •

ఒక్క మాట

# సాధన అంతరంగ శాంతి ప్రదాత!



పరిమి శ్యామలా దేవి

ధ్యాన శబ్దానికి శబ్ద రత్నాకరంలో చాంచల్యము లేకుండా భగవంతుణ్ణి మనసులో తలవడము అని అర్థం. ధ్యానం వాళ్ల భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుతాయి. ఒత్తిడిని తట్టుకునే శక్తినిచ్చే ధ్యానం ఓ మానసిక వ్యాయామం అని అంటారువైద్య నిపుణులు. శ్రీ కృష్ణ గీతలో ఆజ్ఞా చక్రంపై ధ్యానమంటే, అనేక ధ్యాన పుంగవులు హృదయ చక్రంపై నిలుపుతూ సాధన చేయమంటారు. ఏ విద్య అయినా ఒక సద్గురు సమ్ముఖంలో రాణిస్తుంది అంటారు !మానవజన్మ ఉత్కృష్టము! భగవత్ప్రసాదము! మనిషి మనస్సు, ఆత్మవరం! మేధోశక్తి మనిషిని పశువునుండి వేరు చేస్తుంది! "యాదృశీ భావనా యాధ్యాన శబ్దానికి శబ్ద రత్నాకరంలో చాంచల్యము లేకుండా భగవంతుణ్ణి మనసులోతలవడము అని అర్థం. ఈ ధ్యానాత్మక మనసును మనం ఎలా సృష్టించుకోగలం? కేవలం కళ్లు మూసుకుని ఒక ఆచారంగా ధ్యానం చేయడం ద్వారా మాత్రం కాదు. ఆనందంతో ధ్యానం చేయడం ద్వారా! "నీలో నీకు విశ్వాసం కుదిరితే నీకు భగవంతునిలో విశ్వాసం కుదురుతుంది అన్నారు వివేకానంద. నేటి కలియుగ ప్రపంచంలో మానవతా విలువలు అధమాతి అధమంగా దిగజారిపోతున్న సమాజంలో వీణ తీగలను చక్కగా సవరించుకో, కానీ తెగేదాకా బిగించితివో పరికరం పాడవును, గుర్తుంచుకో! ఇప్పటి స్థితిని సవరించే ఆధ్యాత్మిక ధ్యానప్రక్రియ తీగలు సవరించిన వీణ కావాలంటే, ధ్యానమును మించిన, స్పృహపరిధిని పెంచే ధ్యానము అందరిలోనూ, ప్రధానంగా ప్రపంచ విద్యార్థి, యువత వనరుల్లో ఆధ్యాత్మికత లక్ష్యం కావాలి! అంటే, నిరంతరంగా హృదయంలో ఉన్న దివ్యజ్యోతిని కాపాడుకోవాలి. ధ్యానంతో భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక స్థాయిలో ఉపయోగాలున్నాయి. ధ్యానం ప్రధాన ఉద్దేశాన్ని పరిశీలిస్తే,




స్పృహ పరిధిని మరింత పెంచుకోవడమే "మీరుశాస్త్రీయంగా పరిశీలించినా, మీ హృదయమొక ప్రయోగశాల. అంతర్గతంగా అనుభవించే సంతోషం, సంతృప్తి, నిశ్శబ్దం, ప్రశాంతతలే పశుత్వ లక్షణాల నుండి, మానవతాలక్షణాలు, అటుపైన నీధ్యాన తీవ్రత నీలో దివ్యత్వాన్ని సంతరింప జేస్తుంది అంటారు. కామం, క్రోధం, ఈర్ష్య, ఆవేశం, ద్వేషం, జుగుప్స, అహం, స్వార్థం, ప్రలోభం, ఈ ప్రతికూల భావోద్వేగాలుకావా మనిషి పతనానికి, ప్రపంచ వైరుధ్యాలకు పరికరాలు! అనుకూల భావాలు, సద్భావాలు, తోటివారిపై, పరిస్థితులపైసదవగాహన, సాధారణ, నిజాయితీని ప్రతిపాదించే జీవనసరళికి పరిణామ హేతువు ధ్యానమే అంటే అతిశయోక్తికాదు. 1957లోనే ప్రపంచశాంతికి దోహదకారి, సత్సంగం, ధ్యానంతో, ఏకమై ప్రజలు ప్రార్థించాలి. విశ్వప్రేమ హృదయాల్లో కలిగితే అంతకన్నా అంతర్యుద్ధాలకు, ద్వేషాల కుమిన్న మందు లేదు అనిలేఖ వ్రాసి, ఆమోదం పొందిన శాంతికపోతం సహజమార్గ స్థాపకుడు పూజ్య బాబూజీ, నేటి రాజయోగ ధ్యానప్రయోగకుడు, ధ్యాన భూషణుడు, ధ్యాన పద్మభూషణ్ బిరు దాంకితుడు, నేడు ప్రపంచధ్యాన దినోత్సవానికి ఆవిష్కరణకర్తలు! మనస్సు పై విజయసాధనకు ఆధ్యాత్మిక భావనాని కంతా నిజమైన పునాదినమ్మకం. శాంతి ఆనందానికి పునాది, ధ్యానం శాంతి వర్ధిల్లడానికి మనలో ఖాళీని సృజిస్తుంది. మనోనిగ్రహం, స్థితప్రజ్ఞ, కోరికల అదుపు, మాట పొదుపు, దానం, క్షమా, ఔదార్యం, సంకల్పబలం శ్రమ దీక్ష, ఇలా మానవత్వమున్న మనుష్యులుగా పరిణతిచెంది తమకూ, పుట్టుకనిచ్చిన వారికీ, సమాజానికీ, దేశానికీ ఉపయుక్తులు కాగలరు. శారదామాత, శ్రీరామకృష్ణ, వివేకానందా, కబీరు సంథ్, ఖలీల్జీబ్రాన్ ఇలాఎందరో మహానుభావులు ధ్యాననిరతులు. అందుకే ఈప్రపంచధ్యాన దినోత్సవ సందర్భాన అర్థమైన, అందుబాటులోకి వచ్చిన సాధన ధ్యానం. అది ఎంత చిన్నదయినా, చిటికెడు అనుకోండి, చేస్తూపొండి! ధ్యానం ఏకా గ్రతను, యోగమును, సమతౌల్యతను, సచీలాన్ని, ఆత్మ విశ్వాసం, బుద్ధికుశలాన్ని, వినమ్రతను, తపన, కృతజ్ఞత ఆనందోత్సాహాలను, జ్ఞాపకశక్తిని, ఎదుటివారికి సాయం అనే వైఖరిని పెంచిపోషిస్తుంది. ఈటానిక్నుసేవిస్తూ, మనస్సు నిర్మలదాయకంచేసే పరిణతి మంచి కోసమేగా! •

# గణితానికి గౌరవం.. విజ్ఞానానికి మార్గదర్శనం



మహేశ్వరం భాగ్యలక్ష్మి

ఈ విశాల విశ్వం అంతట అన్ని గణితీయంగానే సంభవిస్తాయి అని లైబినిడ్జ్ అనే గణిత శాస్త్రజ్ఞుడు అంటాడు. మానవుడు పసిబిడ్డగా ఈ భూమిపైకి వచ్చిన నాటి నుండి మరణం వరకు ప్రతిక్షణంలో, ప్రతి సందర్భంలో, గణితాన్ని ఉపయోగిస్తాడు. అందువలన గణితం మానవ జీవితంతో అవినాభావ సంబంధం కలిగి ఉంది. ఆటాడుకునే పిల్లవాని నుండి అంతరిక్ష యాత్రికుని వరకుగణితాన్ని ఉపయోగించకుండా ఉండలేరు. అసలు గణితం ఉపయోగించకుండా ఒక్క క్షణం కూడా ముందుకు సాగలేమంటే అతిశయోక్తి కాదేమో. గణితం అంతగా మానవ జీవితంతో పెనవేసుకుంది. అలాగే మానవ నాగరికతతో పాటు గణితం కూడా అభివృద్ధి చెందుతూ ఉంది. అందువలనే మానవ మనుగడకు గణితం అద్దం లాంటిది అని పేర్కొనడం జరిగింది. ఇంతటి ప్రాముఖ్యత కలిగినందు వలన గణితం ఆవశ్యకతను నేటి తరం నుండి ముందు తరాల వారికి వ్యాప్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి. ఆ కారణంగానే భారత ప్రభుత్వం డిసెంబర్ 22నుజాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించింది. గణితశాస్త్రం అనగానే భారతదేశంలో గుర్తుకు వచ్చే పేరు శ్రీనివాస రామానుజన్. అతని జన్మదినమైన డిసెంబర్ 22 ను, అతను గణితానికి చేసిన సేవలకు గుర్తుగా మనం జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నాం. గణిత దినోత్సవం నేటితరం విద్యార్థులలో గణితశాస్త్రం పట్ల ఆసక్తిని, శ్రద్ధను పెంపొందించాలి. గణితానికి ఉన్న ప్రాముఖ్యతను వివరించాలి. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రేరణ కల్పించాలి. గణిత శాస్త్రం ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు నిర్వహించాలి. అలాగే రామానుజన్ జీవిత చరిత్ర, ఆయన చేసిన అపూర్వ గణిత కృషిని గుర్తుచేసుకోవడం ఈ గణితశాస్త్ర దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబర్ 22న తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడులో జన్మించారు. ఇతనికి చిన్నప్పటి నుండి గణితంలో ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. తన 11వ యేటా రామానుజన్ గణిత శాస్త్రంపట్ల అద్భుత మైన దృష్టిని కనబరిచారు. సంఖ్యలపై రామానుజన్ గారికి సంపూర్ణ అవగాహన ఉంది. ఇతను ప్రధాన సంఖ్యలు, వింత చదరాలు, భిన్నాలు, వర్గమూలాలగూడు, పార్టిషన్ ఆఫ్నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రాల్స్పై పరిశోధన చేశాడు. ఆయన పేరుపై గల రామా నుజన్ సంఖ్య 1729 ఇందుకు ఒక ఉదాహరణ. ఫెలో ఆఫ్‌ది రాయల్స్ సొసైటీ, ఫెలో ఆఫ్ ట్రినిటీ కాలేజీ గౌరవం పొందిన మొదటి భారతీయుడు రామానుజన్ గారు. గణితంపై ఇతనికి ఉన్న పరిశోధనాశక్తి మాత్రం అమోఘం. అలాగే ఇండియన్ మేథమెటికల్ సొసైటీ అనే పత్రికలో ఇతని



రేపు శ్రీనివాస రామానుజన్ జయంతి

వ్యాసాలు అనేకం ప్రచురితమయ్యాయి. ఇక రామానుజన్ గారి చివరి దశలో మాక్ తీట ఫంక్షన్స్పై చేసిన పరిశోధన ప్రసిద్ధమైంది. శ్రీనివాస రామానుజన్ చివరగా 1920 ఏప్రిల్ 26న మరణించాడు. అతని జీవితకాలం 32 సంవత్సరాల 4 నెలల 4 రోజులు మాత్రమే. రామానుజన్ గారు గణిత శాస్త్రజ్ఞుడు అనేది ప్రదానం కాదు, ఆయన మానవ మేధస్సు ఎంత చేయగలదో నిరూ పించాడు. ఓ మహానది లాంటిది రామానుజన్ జీవితం. నది ఎలాగైతే ప్రవహించినంత మేర పరిసరాలని సస్యశ్యా మలం చేస్తుందో అలాగే రామానుజన్ వేసిన ప్రతి అడుగు గణిత శాస్త్రాన్ని ప్రకాశవంతం చేసింది. శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో ఒక గొప్ప మేధావి. ఆయన జీవితం నేటి విద్యార్థులకు అనేక స్ఫూర్తిదాయకమైన పాఠాలను అందిస్తుంది. శ్రీనివాస రామానుజన్ లాగా ప్రస్తుత విద్యార్థి లోకం గణితంపై గాఢమైన ఆసక్తి, అభిరుచిని చిన్ననాటి నుండి పెంపొందించుకోవాలి. స్వీయ అధ్యయనాన్ని అలవ రుచుకోవాలి. ఆత్మవిశ్వాసంతో ఎదురైన కష్టాలను అధిగ మించడంలో నిబద్ధతను ప్రదర్శించాలి. శ్రీనివాస రామాను జన్ సాధారణమైన గణితానికి భిన్నమైన పద్ధతులు ఆవిష్కరించాడు. అలాగే నేటి విద్యార్థులు కూడా సృజనాత్మకత, నూతన ఆలోచనపట్ల ఎలా ఓపికతో ఉండటం, తమమీద తమకు నమ్మకం కల్గిఉండటం అనేది అలవరుచుకో వాలి. శ్రీనివాస రామానుజన్ హార్డీ వంటి గొప్ప గణిత శాస్త్రజ్ఞుని సలహా, సహకారం పొందడంద్వారా గణితంలో గొప్ప స్థాయికి ఎదిగారు. అలాగే నేటి విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని వినియోగించుకుని జీవితంలో గొప్పగా ఎదగాలి. కృత్రిమ మేధస్సు (ఎఐ)యంత్ర అధ్యయనం ఈ శతాబ్దంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలు, వీటి మూలసూత్రాలు గణిత శాస్త్రంలో దాగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు గణిత శాస్త్రానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. భవిష్యత్తులో మేధస్సు (ఎఐ), యంత్ర అధ్యయన (ఎమ్ఎల్) యుగంలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండాలంటే గణిత విషయాలు అయిన ప్రాబబిలిటీ స్టాటిస్టిక్స్లో పటిమ, రేఖాగణితం, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్పై అవగాహన, డేటా మోడలింగ్, విశ్లేషణ సామర్థ్యం అవసరం. కృతిమ మేధస్సు, యంత్ర అధ్యయనం విద్యార్థుల భవిష్యత్తును అద్వితీయంగా చేస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి భవిష్యత్తును అందిపుచ్చుకోవటంలో విద్యార్థులు ముందుండాలి అంటే గణితం పై మక్కువను చిన్న నాటి నుండి పెంపొందించుకోవాలి. గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన స్ఫూర్తితో ప్రతి విద్యార్థి గణిత శాస్త్రంపట్లభయాన్ని వీడి ఆసక్తిని పెంపొందించుకుని భవిష్యత్తులో వచ్చే సవాళ్లను అధిగమించి జీవితాన్నిసుస్థిరం చేసుకోవాలి. •

# ప్రజావాక్కు



## నైతిక విద్య అవసరం

దేశంలో జువెనైల్ నేరాలు పెరిగిపోతున్నాయన్న పలు నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అనేక మంది యువత పలు నేరాల్లో నిందితులుగామారటం ఆందోళనకలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో, అమ్మాయిలపై అఘాయిత్యాలు చేయడంలో, సైబర్నేరాలు చేయడంలో వీరుముందుంటున్నారు. భారతదేశంలోని కొందరు మైనర్లు యువకులు హత్యలు, సామూహిక అత్యాచారం, దోపిడీలు, స్నాచింగ్లు మొదలైన క్రూరమైన నేరాలకు పాల్పడుతున్నారని ప్రస్తుత రికార్డులు రుజువు చేస్తున్నాయి. చిన్నారులు చేస్తున్న ఇలాంటి నేరపూరిత చర్యలు యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. పలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తల్లిదండ్రులు, పెరుగుతున్న విద్యా వ్యయం కారణంగా తమ పిల్లల అదనపు ఖర్చులను భరించలేకపోతున్నారు. ఇది చిన్నపిల్లలు తప్పుడు మార్గాన్ని ఎంచుకోవడానికి కొన్నిసార్లు నేరపూరిత కార్యకలాపాలకు దారి తీస్తుంది.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## కో ఎడ్యుకేషన్ సరైనది కాదు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా శ్రీ నారా లోకేష్ ఉపాధ్యాయ సంఘ నేతలతో, శాసనమండలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుతోచర్చించి వారిఅభిప్రాయాలకుఅత్యంత విలువ ఇవ్వడంచాలాసంతోషదాయకం. అయితే క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులసమస్యలను వారుప్రస్తావించడంలేదని అనిపిస్తూ ఉన్నది. హైస్కూల్ ప్లస్కు బదులుగా జూనియర్ కాలేజీలను కో ఎడ్యుకేషన్గా ప్రవేశపెట్టాలనేది నిర్ణయం సరైనది కాదు. ఇది చాలా వ్యయప్రయాసలతో కూడుకున్నది. కచ్చితంగా సత్ఫలితాలు ఇవ్వదు. ఇంటర్మీడియట్ కో ఎడ్యుకేషన్ పనికిరాదు. గ్రామాలలో అసలు పనికిరాదు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## యుద్ధాలు ఆగేదెన్నడు?

ప్రతి సమస్యకి ఒక పరిష్కారం ఉన్నట్టే యుద్ధం వెంబడి శాంతి ఉండాలి. అయితే ప్రపంచ రాజకీయాలు ఆధిపత్య భావజాలాలుగా మారుతున్నవేళ ఆవేదన, కోపం కలగడం సహజమే. సముద్రాల మీద ఆధిపత్యంతో రాజకీయాలు నడవడంఅందులో అల్పాదాయా దేశాలుపావులుగా మారడమే అతిపెద్ద విషాదం. శాంతికి కోసమై కట్టుబడాలి.

-భారత అవినాష్, జనగామ

## పుస్తకాలు తెరవాలి

చెరవాణుల ప్రవాహంలో పుస్తకాలు కొట్టుకుపోయాయి. జ్ఞానం తగ్గి అజ్ఞానం నేడు సమాజంలో పెరిగిపోతుంది. విలువలు ఆత్మీయుల అనుబంధాల ప్రేమల గురించి నాడు ఎన్నో నవలలు వచ్చాయి. అవి చదివి ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారు. పుస్తకాలు జ్ఞాన బాండాగారాలు. నాటి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారు తన జీవితంలో పుస్తకాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం మనకు తెలిసిందే. కాలాన్ని హరించే అనేక మార్గాల్లో చెరవానులుఒకటి. వీటివల్ల కంటి చూపు మందగిస్తుంది. బుద్ధిమాంద్యం కలుగుతుంది. కానీ పుస్తకాల వల్ల ఎటువంటి దుష్ప్రయోజనాలు ఉండవు. పుస్తక పఠనం వల్ల విజ్ఞాన సముపార్జనతోపాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది. ప్రభుత్వం ప్రతీ ఉరిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి. ప్రజలు చెరవాణులు మూసి పుస్తకాలు తెరవాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

## లిఫ్ట్ ఎస్కులేటర్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ మెట్రో రైలు నగర ప్రజలకు ఒక వర ప్రదాయిని. బ్లూ లైన్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో లిఫ్టులు ఎస్కలేటర్లు ఏర్పాటు చేయకపోవడం వలన వయోధికులు పిల్లలు స్త్రీలు చాలా ఇబ్బంది పడుతున్నారు ప్రక్కనే అనుబంధంగా ఉన్న గ్రీన్ లైన్ జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో విస్తృతంగా ఉన్న లిఫ్టులు ఎస్కలేటర్లు ఉపయోగించుకొని ఈ స్టేషన్లో రైలు సౌకర్యం పొందవలసి ఉంటున్నది ప్రస్తుతం పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో కేవలం రెండు ప్రదేశాలలో గల మెట్ల మార్గాల ద్వారా రాకపోకలు జరుగుతున్నవి పరేడ్ గ్రౌండ్ పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలుపుకొని రోడ్డు దాటి జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్ ద్వారా తిరిగి పరేడ్‌గ్రౌండ్ స్టేషన్లోనికి రావాల్సి ఉండటం వలన అధిక శ్రమ సమయం వృధా అవుతున్నది.

-దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

## ఒకే రకం సిలబస్ ఉండాలి

రాష్ట్రంలో రాష్ట్ర సిలబస్తో కొన్నిరకాల పాఠ్యపుస్తకాలు. కేంద్ర సిలబస్తో కొన్నిరకాల పాఠ్యపుస్తకాలు, రాష్ట్ర జాతీయ అంతర్జాతీయస్థాయిలో వివిధరకాల టెక్స్ట్ బుక్స్ ఉండడం వల్ల ప్రభుత్వ బడుల్లోకొంతప్రవేశాలు తగ్గుతున్నాయి. వివిధ రకాలపోటీ పరీక్షలకు చిన్నతనం నుంచే వివిధరకాల సిలబస్ పేరుతో రకరకాల స్కూల్స్లో జాయిన్ చేస్తున్నారు. అన్నిరకాల సిలబస్లను ఒకే గొడుగుకిందకు తీసుకువచ్చి పాఠ్య పుస్తకాలను సరళీకరించాలి.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పాస్టర్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు
- 1000 మంది పాస్టర్ దంపతులకు దుస్తులు పంపిణీ
- 23 ఏళ్లుగా పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న బూచేపల్లి
- క్రిస్మస్ గీతాలు ఆలపించిన బూచేపల్లి వెంకాయమ్మ
- క్రిస్మస్ కేక్ కట్‌చేసిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ
- ప్రత్యేక ప్రార్ధనలు చేసిన బిషప్, పాస్టర్లు




**దర్శి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

పాస్టర్ కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటామని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక తాలూకా క్లబ్ సమావేశం హాల్‌లో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పాస్టర్ దంపతుల సమేతంగా 1000 మందికి దుస్తులు పంపిణీ చేశారు. బిషప్ బి.శాంసన్ పాస్టర్లు గుంటూరి కృపానందం, జి.నరేంద్ర కుమార్, జి.ఏసుదాసులు ప్రత్యేక ప్రార్ధనలు చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ క్రీస్తు గీతాలు ఆలపించగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి అందించారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో పుట్టిన రోజులు జరుపుకుంటుంటారని కానీ ప్రపంచం మొత్తం కలిసి చేసుకునే పుట్టిన రోజే ఏసుక్రీస్తు పుట్టిన రోజు అని చెప్పారు. తమతమ తల్లిదండ్రులు బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డిలు ఎన్నో చర్చిలకు, ఎంతో మంది పాస్టర్లకు సాయం చేశారన్నారు. సాయం చేశారు కాబట్టే ఏసుక్రీస్తు తమ కుటుంబాన్ని ఎల్లవేళలా కాపాడుతూ మాకు మేలు చేస్తున్నారని చెప్పారు. మా అందరికి మీ దీవెనలు కావాలని కోరారు. నియోజకవర్గంలో తన తండ్రి నేర్చిన విధంగా 25 ఏళ్లుగా మీకు సేవలందించుకుంటున్నామని చెప్పారు. అప్పటి నుండి మీరంతా నా గెలుపులో భాగస్వాములుగా ఉండి నన్ను ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. సంపాదించిన దానిలో కొంత చర్చిలకు ఖర్చు చేయడం తమ తండ్రి మొదటి నుండి నేర్పించారన్నారు. ఏసుక్రీస్తు దీవెనలు మన కుటుంబాలందరికి ఉండి అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తన గెలుపుకు మీ అందరి సహకారంతో పాటు ఏసుక్రీస్తు ఆశీస్సులు కూడా ఉన్నాయని అన్నారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బూచేపల్లి సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచారంటే అందుకు పాస్టర్ల కృషి ఉందన్నారు. మొదటి నుంఇ తన భర్త కష్టపడి సంపాదించిన దాంట్లో అందరికి పంచడం అలవాటన్నారు. అలా దేవుని ఆశీస్సులతో అందరూ అభివృద్ధి చెందామని చెప్పారు. మనం తినడంతో పాటు బయట ఉండే పేదలకు కూడా కొంత అన్నం పెట్టాలని బూచేపల్లి సుబ్బారెడ్డి కోరుకున్నారన్నారు. బూచేపల్లి కుటుంబంపై నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రేమ ఉండబట్టే బూచేపల్లి కుటుంబాన్ని మూడు సార్లు ఎమ్మెల్యేగా దర్శిలో గెలిపించారన్నారు. ఎల్లప్పుడూ బూచేపల్లిసుబ్బారెడ్డి ఆశయాలు కొనసాగిస్తూ ఉంటామని వెంకాయమ్మ స్పష్టం చేశారు. ఎస్సీ సెల్ అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాస్టర్లకు అప్పటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతి నెల రూ.5వేలు గౌరవ వేతనంగా ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు పాస్టర్లకు గౌరవ వేతనం ఎందుకని హేళన చేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గౌరవ వేతనం ఇవ్వకుండా నిలిపివేశారన్నారు. దీంతో పాస్టర్ల జీవనాధారంపై అప్రభావం పడిందని చెప్పారు. మరలా ఎన్నికలు జరిగినప్పుడు గుర్తు పెట్టుకుని పాస్టర్ల జీవన బృతిపై వేటు వేసిన కూటమి ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో గ్రీనరీ అండ్ బ్యూటీఫికేషన్ డైరక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కేసరి రాంభూపాల్‌రెడ్డి, మారం ఇంద్రసేనారెడ్డి, జడ్పీటీసీలు తాతపూడి రత్నరాజు, నుసుం వెంకట నాగిరెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్ళూరి బాబురావు, వాణిజ్య విభాగం అధ్యక్షులు కొల్లా ఉదయ భాష్కర్, జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు బండి గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, గోళ్ళపాటి మోషే, మాజీ మండల కన్వీనర్లు కాకర్ల కృష్ణారెడ్డి, సూదిదేవర అంజయ్య, మాజీ జేసీఎస్ కన్వీనర్ గుంటు పోలయ్య, నాయకులు డగ్లస్, కేసనపల్లి నాగేశ్వరరావు, తప్పెట బాబురావు, వేమిరెడ్డి చెన్నారెడ్డి, మజ్నువలి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో అమాయక ప్రజలపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలి

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



**దర్శి, డిసెంబర్20, ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ దామోదర్‌ను శుక్రవారం దర్శి తెలుగుదేశం పార్టీఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీతో దర్శి నియోజకవర్గంలో శాంతి భద్రతలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ఆరు నెలల కాలంలో దర్శిలో ప్రశాంతతకు కృషి చేసిన పోలీసు యంత్రాంగానికి డాక్టర్ లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో డాక్టర్ లక్ష్మితో పాటు దర్శి టీడీపీనాయకులు దారం సుబ్బారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్వి రామయ్య ఉన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైసీపీ నేతల ఒత్తిడితో అమాయకులపై కేసులు బనాయించారని వెంటనే ఆ కేసులను తొలగించాలని కోరారు. అనేక ఎలక్షన్ బూత్‌ల వద్ద జరిగిన చిన్న చిన్న వివాదాల నేపథ్యంలో అమాయక ప్రజలపై కేసులు ఉన్నాయని అన్నారు. ఈ కేసులను బనాయించేందుకు పోలీసు శాఖపై ఒత్తిడి చేశారని, రాజకీయాలకు అతీతంగా అమాయక ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల కేసులు తొలగించాలని ఆమె కోరారు. కొందరు తెలుగుదేశం ముఖ్య నేతలపై కావాలనే కక్ష సాధింపుతో వైసీపీ నేతలు రౌడీ షీట్లు కూడా తెరిపించారని వెంటనే వాటన్నింటిని విచారించి పారదర్శకంగా రౌడీ షీట్‌లను తొలగించాలని కేసులను కూడా ఎత్తివేయాలని ఆమెవిజ్ఞప్తి చేశారు.ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు ఆమె వివరించారు.

## జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి




**సీఎస్‌పురం, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పులి రామచంద్రారెడ్డి, మితికేల వరుణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై ఐటీ వింగ్, వైఎస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో చెన్నై ఓఎంఆర్ రోడ్డులోని కారప్పాకంలో ఉన్న ఫాతిమా అనాధ శరణాలయంలో శనివారం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శరణాలయంలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం, బుక్స్, బెడ్ షిట్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కావున చెన్నైలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, జగన్‌మోహన్‌రెడ్డి, అభిమానులు, ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వలి వివాహ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**దర్శి, డిసెంబర్20, ప్రభాతవార్త**

దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం దర్శి పట్టణం కొత్తపాలెంలో జర్నలిస్టు షేక్ కాశీం వలి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులు షేక్ కాశీం వలి– షేక్ కరీష్మలను ఆశీర్వదించారు . వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమలో దర్శిలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## ఇదిగో సాక్ష్యం.. సంచలన రిపోర్టు

# చంద్రబాబు పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందా..? తగ్గుతుందా..?

**ఒంగోలు, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ప్రజల్లో అసంతృప్తి నెలకొందని గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ప్రజా వ్యతిరేకత మొదలైందని ఇప్పటికే ప్రతిపక్ష పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తుంది. ఈ నేపథ్యంలో ఆ విమర్శలకు బలం చేకూర్చే రీతిలో ప్రజా సమస్యల పరిష్కారం పేలంగా ఉందని విషయం తెరపైకి వచ్చింది.ఈ ఏడాది జూన్‌లో ప్రజావిజ్ఞప్తుల పరిష్కారానికి నవంబర్ నాటికి వచ్చే సరికి జరిగిన పరిష్కారాలకు ఏ మాత్రం సంబంధం లేదని దీంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అంటున్నారు.ఈ విధంగా పరిష్కారాలకు నోచుకోని వినతులు ఎక్కువగా రెవెన్యూ, పోలీసు, టౌన్ ప్లానింగ్‌తో పాటు మరికొన్ని శాఖలు ఉన్నాయని అంటున్నారు. జూన్ నెల విజ్ఞప్తుల పరిష్కారం చర్యలపై 69.9 శాతం మంతి సంతృప్తి వ్యక్తం చేయగా అది నవంబర్ నాటికి 35.22 శాతానికి పడిపోయిందని అంటున్నారు. అధికారుల చర్యలు మొక్కుబడిగానే ఉండటంతో ప్రజల్లోఅసంతృప్తి పెరిగిపోతుందని అంటున్నారు. జూన్ 15నుంచి నవంబర్ నెలాఖరు వరకు వచ్చిన వినతులు 1.69లక్షలు ఉండగా వీటిలో 1.39 లక్షలు పరిష్కరించినట్లు చెప్తున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్. కాని ఆ పరిష్కారమంతా మొక్కుబడిగా ఉండటంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగిందనేకామెంట్లు వినిపిస్తున్నాయని పలువురు చెప్తున్నారు. ఏడు నెలల్లో వచ్చిన ఫిర్యాదుల్లో 20వేల 702 ఆస్తులకు సంబంధించినవి కాగా, 16240ఫిర్యాదులు పోలీసుశాఖకు సంబంధించి నవి అంటున్నారు. భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదుల సంఖ్య 9577గా చెప్తున్నారు. ఇది నేరుగా చంద్రబాబు స్వీకరించిన ఫిర్యాదులు 6784 ఉన్నాయి. సీఎంఒ మెయిల్ ద్వారావచ్చినవి 741 అంటున్నారు. జూన్ నుంచి నవంబర్ నెల వరకు నెల వారీగా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజలు సంతృప్తి తగ్గుతూ వస్తుందని అంటున్నారు. ఈ వివరాలు నెలవారి చూస్తే జూన్69.96 శాతం,జులై 64.61 శాతం, ఆగష్టు 55.12 శాతం, సెప్టెంబర్ 49.49 శాతం, అక్టోబర్ 50.36 శాతం, నవంబర్ 35.22 శాతం చొప్పున ఉంది. ఇక శాఖల వారీగా పరిష్కార చర్యలు అసంతృప్తి విషయానికి వస్తే పోలీసు శాఖ 49.76 శాతం, రెవెన్యూ శాఖ 48.88 శాతం, మున్సిపల్ 43.94 శాతం, విద్యాశాఖ 41.12శాతం, పౌరసరఫరాల శాఖ 42.10 శాతం, పంచాయతీ 40.07శాతం, ఇంధనం 32.55శాతం, హౌసింగ్ 26.17శాతం, ఆరోగ్యశాఖ 26.07శాతం, వ్యవసాయం 25.71శాతం స్థానాల్లో ఉన్నట్లు సమాచారం.

# కూటమిలో ఎమ్మెల్సీల సందడి

- బరిలో.. వీళ్ళు
- ఈసారికి ఛాన్స్ వారికే

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్సీల సందడి ప్రారంభమైంది. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయింది. కనీసం ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. వచ్చే ఐదేళ్లపాటు ఎమ్మెల్సీగానే రాజ్యసభ పదవి గాని ఆ పార్టీకి దక్కే అవకాశం కనిపించలేదు. దీంతో కూటమి ఏకపక్షంగా వాటిని దక్కించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే మూడు రాజ్యసభ పదవులకు సంబంధించి కూటమి కైవసం చేసుకుంది. ఇప్పుడు అందరి దృష్టి ఎమ్మెల్సీలపై పడింది. వైసీపీకి చెందిన పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జయమంగళం వెంకటరమణ రాజీనామా చేశారు. వీటికి సంబంధించి మండలి చైర్మన్ మోషన్ రాజు వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అయితే వీటితో పాటు మార్చిలో మరికొన్ని స్థానాలు ఖాళీ కానున్నాయి. ఇలా ఒకే సారి 13 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా అవుతున్నట్లు స్పష్టమవుతుంది. వీటి భర్తీపై దృష్టి పెట్టారు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. పదవుల సర్దుబాటుపై దృష్టి సారించారు. ఈ 13 పదవుల విషయంలో అనేక సమీకరణలు తెరపైకి రానున్నాయి. మూడు పార్టీల మధ్య పొత్తు ఉన్న తరుణంలో ఎమ్మెల్సీ పదవుల పంపకం కత్తిమీద సాముగా మారనుంది. అయితే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మోపిదేవి వెంకటరమణ రాజ్యసభ పదవి సైతం వదులుకున్నారు. ఆయన ఎమ్మెల్సీ పదవి ఆశిస్తుండటంతో తొలి జాబితాలోనే ఆయన పేరు ఖరారయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర మంత్రి వర్గంలోకి నాగబాబును తీసుకోనున్నారు. ఆయనకు సైతం ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చే పరిస్థితి కనిపిస్తుంది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటీవల జనసేన పార్టీలోకి చేరారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి సరైన గౌరవం కల్పించాలనే ఆలోచనతో పవన్ కళ్యాణ్ ఉన్నట్లు సమాచారం. అదే జరిగితే మండలిలో జనసేన బలం మూడుకు చేరుకుంటుంది. మరో వైపు బీజేపీకి సైతం ఒక ఎమ్మెల్సీ పదవి ఇస్తారని టీడీపీ ముఖ్యులు చెప్తున్నారు. ప్రధానంగా ఎమ్మెల్సీ పదవుల ఆశావాహులు టీడీపీలోనే అధికంగా కనిపిస్తున్నారు. ముఖ్యంగా సీట్లు త్యాగం చేసిన నేతలు, సీనియర్లు పదవులు ఆశిస్తున్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, మాజీ మంత్రులు దేవినేని ఉమా, జవహర్, వంగవీటి రాధాకృష్ణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, గన్ని వీరాంజనేయులు, తిప్పయ్యస్వామి, ప్రభాకర్‌చౌదరి, కొమ్మలపాటి శ్రీధర్, బీద రవిచంద్ర, టీడీ జనార్ధన్, బుద్దా వెంకన్న, సుగుణమ్మ పేర్లు ముఖ్యంగా వినిసిస్తున్నాయి. అయితే జనసేనతో పాటు బీజేపీకి సర్దుబాటు చేయాల్సి ఉండటంతో ఎమ్మెల్సీల పదవులు ఎంపిక అంతా ఆషామాషి కాదని పలువురు విశ్లేషకులు అంటున్నారు.

# సమస్యల వలయంలో తంతి తపాలా ప్రధాన కార్యాలయం

- పనిచేయని పోస్టల్ ఏటీఎం
- పూర్తి స్థాయిలో సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు





**మార్కాపురం, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

చుట్టు పక్కల మండలాలకు ప్రధాన తంతి తపాలా కార్యాలయంగా ఉన్న మార్కాపురం హెడ్ పోస్టాఫీసు సమస్యలతో కూనరిల్లుతుంది. పట్టణ నడిబొడ్డున ఈ కార్యాలయం ఆవరణంలో పోస్టల్ ఏటీఎం కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. అయితే సుమారు ఆరు నెలల కాలం నుండి ఈ ఏటీఎం కేంద్రం పని చేయకపోవడంతో పోస్టల్ ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టల్ ఖాతాదారుల సౌకర్యార్థం ఏటీఎం కార్డులను మంజూరు చేసి ఉన్నారు. వాటి గడువు కూడా అయిపోయి ఉండటంతో అవి పని చేయక గత నాలుగు నెలల నుండి పెన్షన్ దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రధాన తపాలా కార్యాలయంలో మొత్తం 22 మంది సిబ్బంది ఉండవలసి ఉండగా కేవలం 11 మంది మాత్రమే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ విషయంలో అధికారులు దృష్టి సారించడం లేదని ఈ కారణంగా పని భారంతో సిబ్బంది ఇక్కట్లు పడుతున్నారని ఆ శాఖ సిబ్బంది అంటున్నారు. తపాలా కార్యాలయానికి అనుసంధానంగా ఆధార్ కేంద్రం ఉన్నప్పటికి ఆ కేంద్రం కూడా పరికరాల మరమ్మత్తుల కారణంగా గత కొన్ని రోజులుగా ఆధార్ కేంద్రం పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు ప్రధాన డివిజన్ కార్యాలయం అయినప్పటికి సమస్యలు తిష్ట వేయడంతో పోస్టల్ ఖాతాదారులకు సరైన సేవలు అందించలేకపోతున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు.




**ప్రధాన అధికారి వివరణ :**

నెలకొన్న సమస్యల విషయమై కార్యాలయ పోస్టల్ అధికారి ఇందిరాను ప్రభాతవార్త ప్రతినిధి వివరణ కోరగా, కార్యాలయంలో పరిష్కారానికి నోర్చుకోని సమస్యలు అనేకం ఉన్నా, రీజనల్ కార్యాలయానికి సమాచారం అందించి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఏటీఎం కార్డులు ప్రధాన రీజనల్ కార్యాలయం నుండి రావాల్సి ఉందని త్వరలో వస్తాయని భావిస్తున్నామన్నారు. ఆవరణ లోపల మరమ్మత్తులకు నోచుకోని ఉన్న పోస్టల్ ఏటీఎంను కేంద్ర కార్యాలయం నుండి ప్రత్యేక నిపుణులు వచ్చి రిపేరు చేయాల్సి ఉందని వారికి కూడా ఏటీఎం కేంద్ర మరమ్మత్తుల విషయంలో సమాచారం అందించి ఉన్నామని తెలిపారు. సిబ్బంది కొరత చాలా రోజుల నుండి ఉందని ఈ విషయం కూడా పోస్టల్ ఉన్నత అధికారులకు తెలియజేయడం జరిగిందని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఇందిరా వివరణ ఇచ్చారు.




## నూతన డీఎస్పీని కలిసిన ఎస్సై మాధవరావు

**హనుమంతునిపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

కనిగిరి నూతన డీఎస్పీగా మహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమంతునిపాడు ఎస్సై మాధవరావు కనిగిరి సబ్ డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ మహేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు



# సుందరయ్య కాలనీకి గుక్కెడు నీళ్ళ సరఫరా చేసి ఆదుకోండి

- ప్రాణాలు కాపాడండి అంటూ ఖాళీ బిందెలతో ధర్నా
- తాగునీటి కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సుందరయ్య కాలనీ మహిళలు ఆందోళన




**పెద్దదోర్నాల, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

సుందరయ్య కాలనీలో 4జీఎస్ఎల్ఆర్ నీళ్ల ట్యాంకులు ఉన్న ప్రయోజనం సున్నా.. నీళ్లు సరఫరా చేసే నీళ్ల ట్యాంకర్లు కూడా సక్రమంగా రాకపోవడంతో గుక్కెడు తాగునీటి కోసం అల్లాడిపోతున్నామని పెద్దదోర్నాల సుందరయ్య కాలనీ వాసులు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైటాయించి ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఒట్టిపోయిన నీళ్ల ట్యాంకులను పట్టించుకున్న నాధుడు లేడు. జలజీవన మిషన్ పథకం వేసిన రెండు బోర్లు కూడా పనిచేయడం లేదు. దీంతో కాలనీ వాసులు ఖాళీ బిందెలతో రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. పాలకులు మాత్రం ఎక్కడో కూర్చుండి మా ప్రభుత్వంలో డొకేలేదని బుకాయిస్తారు. క్షేత్రస్థాయిలో మాత్రం నీళ్లు లేక ఇలా కార్యాలయాలకు ప్రదక్షిణాలు చేయవలసి వస్తుందని మహిళలు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. ఎడవల్లి నుండి పైప్‌లైన్ ద్వారా వచ్చే నీటిని సుందరయ్య కాలనీకి అనుసంధానం చేయాలని వైకాపా ఎస్టీ నాయకుడు మాండ్ల వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ శాశ్విత పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెబుతూ ప్రస్తుతానికి యుద్ధ ప్రాతిపదికన తాత్కాలికంగా ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో సుందరయ్య కాలనీ వాసులు ధర్నా విరమించారు.

# నేడు జగనన్న జన్మదిన వేడుకల్లో పాల్గొనాలి



**కంభం రూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినంను పురస్కరించుకొని సందర్భంగా నేడు కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నిర్వహించే భారీ కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొనాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు కుందూరు నాగార్జునరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ గ్రామాలలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ముగించుకొని ఉదయం 10గంటలకు కందులాపురం సెంటర్లో జరిగే భారీ కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి పార్టీ శ్రేణులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# రిసార్ట్స్ ఆవిష్కరణకు భూమి పూజ



**మద్దిపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
మండల పరిధిలోని గుండ్లకమ్మ జలాశయం వద్ద రిసార్ట్స్ ఆవిష్కరణకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10గంటలకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ గుండ్లకమ్మ జలాశయం వద్ద రిసార్ట్స్‌ను స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో ఇక్కడ కాటేజీలు కట్టి అభివృద్ధి చేద్దామనుకుంటే ఆ తర్వాత వచ్చినటువంటి జగన్ ప్రభుత్వం వీటిని సర్వనాశనం చేశారని ఆయన అన్నారు. గుండ్లకమ్మ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తన సాయ శక్తుల కృషి చేస్తామని ఆయన చెప్పారు. శాసనసభ్యులు విజయకుమార్ మాట్లాడుతూ జిల్లా వాసి అయినటువంటి ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ సహకారంతో రాష్ట్రంలోనే అత్యున్నత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అనకాస్వాములు, మండల పార్టీ అధ్యక్షులు మండవ జయంతిబాబు, తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ ఎం.రామకృష్ణ, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, గడ్డం రవి, వేల్పుల నాగరాజు, మండలంలోని నాయకులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

### – ఎస్సై బి.శివరామయ్య



**మద్దిపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై బి.శివరామయ్య అన్నారు. శుక్రవారం నాడు స్థానిక పోలీసు శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్‌ధారణ మీద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బి.శివరామయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బుసక వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించని పక్షంలో జరిమానా విధించడం జరుగుతుందని అదే విధంగా స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న 50 మందికి జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ద్విచక్ర వాహనం యాక్సిడెంట్లు వలన ఎక్కువ మరణాలు సంభవిస్తున్న కారణంగా ఖచ్చితంగా వాహనదారుడు హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలపై ప్రయాణం చేయాలన్నారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను విధిగా తమ వెంట ఉంచుకోవాలని తనిఖీ అధికారులు ఎప్పుడు అడిగినా వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపించాలన్నారు. గతంలో ఉన్నటువంటి ఈ చలానాను వాహనదారులు చెల్లించాలని లేనియెడల వారి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. ఈ ర్యాలీ నందు స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్దిపాడు రానున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున



**మద్దిపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
మండల కేంద్రం మద్దిపాడులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 53వ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ మండవ అప్పారావు తెలిపారు. ముఖ్య అతిధిగా సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మాజీ మంత్రి వర్యులు డాక్టర్ మేరుగ నాగార్జున హాజరవుతున్నారని కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు వైఎస్ ఎంపీపీ సర్పంచ్‌లు అనుబంధ విభాగాల నాయకులు పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు అందరూ శనివారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని మండవ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆర్ఎంపీ వైద్యులు ఆంజనేయులు మృతి



**సంతనూతలపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
సంతనూతలపాడు కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు గుంటూరి ఆంజనేయులు 69 హైదరాబాద్ హాస్పిటల్‌లో ఊపిరితిత్తుల సమస్యలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం నాడు సంతనూతలపాడులో ఆంజనేయులకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆంజనేయులు తండ్రి అంజయ్య, ఆంజనేయులు కుమారుడు ఉమామహేశ్వరరావులు సంతనూతలపాడు గ్రామంలో సుదీర్ఘకాలం ప్రజలకు వైద్య సేవలు అందించారు. వారి ఇరువురు మృతి చెందారు. ఆంజనేయులు 30 సంవత్సరాలు పైగా వైద్య రంగంలో ప్రజలకు సేవలు అందించారు. పేద, బడుగు వర్గాలకు వారి కుటుంబం వైద్య సేవలందించారు. కరోనా కాలంలో ఆంజనేయులు కుమారుడు ఉమామహేశ్వరరావు మృతి చెందారు. కుమారుడు మృతితో ఆంజనేయులు డీలా పడ్డారు. ఆంజనేయులు మృతదేహానికి శుక్రవారం నాడు పలువురు ఘన నివాళులర్పించారు. ఆంజనేయులు మృతితో విషాధ ఛాయలు అలుముకున్నాయి.

## నూతన వధువును ఆశీర్వదించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో టీడీపీ నాయకులు నల్లగట్ల సుబ్బారావు కుమార్తె వెంకట నాగ తేజ వివాహ వేడుకల్లో భాగంగా నూతన వధువును శుక్రవారం నాడు సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, జరుగుమల్లి మండల టీడీపీ అధ్యక్షులు పి.రవి, సంతనూతలపాడు నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు రావులపలి వెంకట సురేష్‌బాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు సాదినేని శ్రీరామ్‌మూర్తి, టీడీపీ నాయకులు బాపట్ల ముసలయ్య, స్థానకాలు, చంద్రశేఖర్, తదితరులు నాగ తేజను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

# హెల్మెట్ మీకు మీ కుటుంబానికి రక్ష

### – డీఎస్పీ నాగరాజు



**మార్కాపురం, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, హెల్మెట్ మీకు మీ కుటుంబానికి రక్ష అని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు అన్నారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలన్నీ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో జరిగినవేనని అన్నారు. కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మోటారు బైక్ నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్‌బెల్టు ధరించాలని సూచించారు. హెల్మెట్ వాడకం విషయంలో న్యాయస్థానం కఠినమైన నిర్ణయం తీసుకుందని, నిర్ణయానికి కట్టుబడి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. సీఐ పి.సుబ్బారావు మాట్లాడుతూ మోటారు బైక్ ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ వినియోగించి ఉంటే 90 శాతం ప్రాణాలు నుండి కాపాడుకునే అవకాశం ఉందని అన్నారు. హెల్మెట్ వినియోగించకపోవడంతో తీవ్ర గాయంతో రక్తస్రావం జరిగి మరణించడం ప్రతినిత్యం మనం చూస్తున్నామని రహదారుల వెంట జరిగే ప్రమాదాల గురించి వివరించారు. ప్రధానంగా యువత ద్విచక్ర వాహనాలు నడుపుతూ త్రిబుల్ రైడింగ్ ద్వారా అతివేగంతో ప్రయాణాలు సాధిస్తున్నారని, జరగరానిది జరిగితే ఆ కుటుంబం పడే వేదన వర్ణణాతీతంగా ఉంటుందని అన్నారు. ఇటీవల కాలంలో పోలీసు శాఖ అనేక వీడియోలను దృశ్యరూపకాలలో సామాజిక మాధ్యమాలలో విడుదల చేయడం జరిగిందని, ఈ వీడియో చూసిన కొంత మార్పు వస్తుందని భావిస్తున్నామన్నారు. ప్రస్తుతం న్యాయస్థానం నుండి అందిన ఆదేశాల మేరకు హెల్మెట్ వాడకం తప్పనిసరి అయిందని ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని అన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం నేరంగా పరిగణించి అధిక ఫైన్ వేయడం జరుగుతుందని తెలిపారు. కొత్త సంవత్సర ఆగమణ వేళ యువత జోష్‌లో ఉంటుందని, ఆ వేగాన్ని అదుపు చేసేందుకు పోలీసు శాఖ కూడా రెడింతల జోష్‌లో ఉండి ఉంటుందన్న విషయాన్ని యువత మరువకూడదని సున్నితంగా మందలించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని పురవీధుల గుండా సాగించి ప్రజలలో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, రూరల్ ఎస్సై అంకమ్మరావు, ట్రాఫిక్ ఎస్సై అహరోన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కులం పేరుతో అధికారిణి దూషించిన ఇరువురిపై కేసు నమోదు



**మార్కాపురం, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక అధికారిగా పని చేస్తున్న శ్రీనివాసులను కులం పేరుతో దూషించిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. పట్టణానికి చెందిన గాలి వెంకటరామిరెడ్డి, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యంలు వీధులలో ఉన్న శ్రీనివాసులుపై దౌర్జన్యానికి దిగి, విధులకు ఆటంకం కలిగిస్తూ కులం పేరుతో దూషించినట్లు శ్రీనివాసులు డీఎస్పీకి ఫిర్యాదు చేయగా విచారించిన డీఎస్పీ ఆ ఇరువురిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ట్రూ ఆఫ్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



**సంతనూతలపాడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త**
సీపీఎం ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం కాలనీలో శుక్రవారం విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ విద్యుత్ బిల్లులను తగలబెట్టి సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు బంకా సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల బాదుడే బాదుడు పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నాయని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున ప్రచారం చేసిన నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక ఆయా విధానాలనే అమలు చేస్తూ ప్రజల మీద సుమారు 17 వేల కోట్ల రూపాయల భారం మోపి ప్రజల నెత్తిన బాదుతున్నారని విమర్శించారు. లోకేష్ బాబు పాదయాత్ర సందర్భంగా స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని ప్రచారం చేసి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆదాని స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని ఎద్దేవ చేశారు. ఆదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్‌లో జరిగిన అవినీతిని వెంటనే బయటకు తీయాలని, సెకీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన ధరల భారంతో సతమతమవుతున్న ప్రజలపై మరో వైపు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాలు మోపి నడ్డి విరుస్తున్నాయని ప్రజలు ఈ సందర్భంగా ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ట్రూ ఆప్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఆపాలని, సెకితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలనిడిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కే.కృష్ణారెడ్డి, నాయకులు షేక్ కాలేషా, షేక్ భాషా, షేక్ చోటో తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకుని మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

### – డీఆర్‌డీఏ పీడీ వసుంధర




**పెద్దదోర్నాల, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ వసుంధర కోరారు. పెద్దదోర్నాల మండలం వై.చెర్లోపల్లిలో శుక్రవారం స్వయం సహాయక సంఘాల మహిళ గ్రూపులకు మెగా రుణ వితరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీ వసుంధర మాట్లాడుతూ పొదుపు పాటించడంతో పాటు ప్రధానంగా మహిళలు అక్షరాస్యులు అయితే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందవచ్చన్నారు. డీజీఎం రవికుమార్ మాట్లాడుతూ బ్యాంకులు ద్వారా రుణాలు పొందిన పొదుపు మహిళలు తద్వారా జీవనోపాదులు పెంచుకుని అభివృద్ధి చెందడంతో పాటు తిరిగి బ్యాంకుకు రుణాలు చెల్లించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డీజీఎం రవికుమార్, డీఆర్ఎం శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ సాంబశివరావు, జిల్లా కోఆర్డినేటర్ ఎస్కే షాహీర్, బ్యాంకు లింకేజీ డీపీఎం సానిత, ఏపీఎం దర్శనం పోలయ్య, కృష్ణకుమారి, ఏరియా కోఆర్డినేటర్ డి.దానం, వై.చెర్లోపల్లి యూనియణ్ బ్యాంకు మేనేజర్ వర్మ, దోర్నాల బ్యాంకు మేనేజర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 20 పొదుపు గ్రూపులకు మూడు కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం చెక్కులు, లఘుపతి దిది 26 మందికి 26 లక్షలు పీఎం ఈజీపీ కింద నలుగురు లబ్దిదారులకు 8 లక్షల పీఎం ఎఫ్ఎం ఈ పథకం కింద 9 మందికి 12 లక్షల 50 వేల రూపాయలు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం రెండు బ్యాంకు ఖాతాదారుల పాయింట్లును ప్రారంబోత్సవం చేశారు.




# జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

**చిన్నగంజాం, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో డిసెంబర్ 22 నుండి 25 వరకు నిర్వహించనున్న 50వ ఆంధ్ర జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ స్టేట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరుపున పాల్గొనే బాలుర జట్టును శుక్రవారం ఎంపిక చేసినట్లు సీనియర్ కోచ్ మరపాల గిరిబాబు తెలిపారు. ఈఎంపిక కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పూర్ణచంద్రరరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, ట్రెజరర్ రమేష్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోచ్ మరపాల గిరిబాబు మాట్లాడుతూ చిన్నగంజాం మాగుంట జూనియర్ కాలేజీ ఆవరణలో డిసెంబర్ 16 నుండి 20వ తేదీ వరకు జరిగిన ప్రత్యేక శిక్షణా శిబిరంలో పాల్గొన్న క్రీడాకారుల నుంచి అత్యుత్తమ జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు (ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ పెట్రేన్) భోజన సదుపాయాలు, దుస్తులను అందించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్సై ఆట్ల స్వామిరెడ్డి, ముసలారెడ్డి, పలపట్ల పోలారెడ్డి, భోగిరెడ్డి నాగాంజనేయులు, భోగిరెడ్డి శివారెడ్డి, కోటా చక్రధర్ రెడ్డి, నిద్ర శ్రీనివాస్‌రెడ్డి, వాటంబాటి రాజేష్, పిట్టు బాలకృష్ణారెడ్డి, దేశం సుబ్బారెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

**జట్టు వివరాలు :**
ఎస్.మణిరెడ్డి, జి.రామకృష్ణ, జి.లక్ష్మణ్, జి.బాలాజి, ఏ.అశోక్, కే.సాయిరామ్, జి.మల్లిఖార్జునరకెడ్డి, ఎం.సోమేష్, కే.ఆకాష్, భావని శంకర్, డీవీ మాధవ్, ఏ.వెంకి, మేనేజర్ బాలకృష్ణారెడ్డి, కోచ్ మరపాల గిరిబాబు.



# పార్టీలో ఎటువంటి విభేదాలు లేవు

### – అంతా కలిసి ఐకమత్యంగా పని చేస్తున్నాం



**తాళ్లూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
టీడీపీ పార్టీలో ఎటువంటి విభేధాలు లేవు, అందరం కలిసికట్టుగా ఐక్యమత్యంతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్‌బాబు, రాష్ట్ర మైనార్టీ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ పెద్ద కాలేషా(బడే) అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, లలిత్ సాగర్‌ల ఆదేశాల మేరకు నడుచుకుంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నామని అన్నారు. టీడీపీలో అన్ని క్యాడర్లో ఉన్న ప్రజా ప్రతినిధులను, నాయకులను కలుపుకుంటూ వెళ్తున్నామని ఎక్కడ కూడా ఎటువంటి విభేధాలు లేవన్నారు. మండలంపై పూర్తి అవగాహన లేకుండా వార్తలు రాయడం తగదని అన్నారు. మానం రమేష్ బాబు మాట్లాడుతూ పార్టీలో ముందుగా క్షేత్ర స్థాయిలో అవగాహన ఉన్న తర్వాత మాత్రమే వార్తలు రాస్తే బాగుంటుందని, ఇష్టానురీతిగా ఒక పార్టీకి అనుకూలంగా వార్తలు ప్రచురించడం జర్నలిజం కాదని హితవు పలికారు. బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఒక పార్టీకి అనుబంధంగా ఉన్న పత్రికలో ఇష్టానురీతిగా వార్తలు రాయడం తగదని, నిజ నిజాలు తెలుసుకుని స్థానిక జర్నలిస్టులు సమాచారం ఇవ్వాలని అన్నారు.

# క్రీస్తు బోధనలు అనుసరణీయం



**మార్టూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపించిన యేసు క్రీస్తు బోధనలు నేటి యువత అనుసరించాలని వర్తక సంఘ అధ్యక్షులు గుంటుపల్లి సాంబశివరావు(జీఎస్ఆర్) అన్నారు. మార్టూలోని కూరగాయాల యార్డులో శ్రీ విఘ్నేశ్వర వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 8వ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజును ప్రపంచ వ్యాప్తంగా అతి పెద్ద పండుగగా జరుపుకుంటున్నారని ప్రపంచానికి దిశా నిర్ధేశం చేసిన దైవం కాబట్టే ప్రపంచం క్రీస్తు పూర్వం లేదా క్రీస్తు శకంగా రూపొందడం జరిగిందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్టూరు సీఐ మద్దినేని శేషగిరిరావు, వర్తక సంఘ ఉపాధ్యక్షులు పాలెపు శ్రీను, కన్నెగంటి శ్రీనివాసరావు, ఎం.లింగారావు, ఎస్ఎం రషీద్, డీసీబీ ప్రభుదాసు, గొట్టిపాటి వెంకటరావు, మాజీ అధ్యక్షులు దూళిపాళ్ళ వేణు, బొప్పూడి సంజీవరావు, గోపు ప్రసాద్, కే.రామారావు, మైలాచిన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన అద్దంకి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు



**బల్లికురవ, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను బల్లికురవ మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు క్లష్టర్ ఇన్‌చార్జీ మిలినీడి గోవిందరావును డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షులు కోయ పేరయ్య శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను నమ్మి గురుతర బాధ్యతను తనకు అప్పగించినందుకు రైతన్నల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా తన వంతు కృషి చేస్తానన్నారు. మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన వారిలో నక్కబుక్కలపాడు నీటి సంఘం అధ్యక్షుడు దర్శి రామస్వామి, అంబడిపూడి నీటి సంఘం అధ్యక్షులు దద్దాల విజయ్, మండల తెలుగు యువత అధ్యక్షుడు దూళిపాల హనుమంతరావు, తదితరులు ఉన్నారు.

# పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



**సీఎస్‌పురం, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని జడ్పీహెచ్ఎస్ సీఎస్‌పురం ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు జే.పోతురాజు అన్నారు. పాఠశాల పదో తరగతి 1994–95 బ్యాచ్ విద్యార్థులు సహకారంతో 84 మంది విద్యార్థులకు యూటీఎఫ్ టెస్టు పేపర్లు ఉచితంగా పంపిణీ చేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకటరామయ్య, ఎస్కే సాదుషా, పూర్వ విద్యార్థులు షేక్ షమ్మీ, కే.రమేష్, యూటీఎఫ్ నాయకులు జే.వెంకటరావు, హెచ్ రామాంజనేయులు, ఐ.కొండయ్య, ఎస్.తిరుపతయ్య, జి.వేమనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

### – డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి మాధురి



**తాళ్లూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎం.మాధురి అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం మండలం లోని తూర్పు గంగవరం, సోమర్పప్పాడు గ్రామాల్లో జరిగిన సదస్సులకు సర్పంచ్ చాట్ల నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల చెంతకే రెవెన్యూ యంత్రాంగాన్ని తీసుకొచ్చి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం తూర్పు గంగవరంలోని స్మశాన వాటికస్థలాన్ని పరిశీలించారు. తూర్పు గంగవరంలో 6, సోమవరప్పాడు 13 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కే.సంజీవరావు, మండల సర్వేయర్ యన్నాబత్తిన శ్రీనివాసరావు, వీఆర్వోలు శివారెడ్డి, రమణారెడ్డి, నాగూర్ బి, విలేజ్ సర్వేయర్‌లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 22 న క్రాస్ కంట్రీ జిల్లా జట్లు ఎంపిక పోటీలు

**చిన్నగంజాం, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
బాపట్ల జిలాల కాజీపాలెం కేసీఆర్, కేవీఆర్‌యాటిదిరేట్ కళాశాల ఆవరణలో డిసెంబరన 22న ఆదివారం ఉదయం 8గంటలకు జిల్లా క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ వివరాలు తెలియజేస్తూ అండర్ 20 బాలర విభాగం 8 కి.మీ అండర్–20 బాలికల విభాగం 6 కి.మీ, అండర్–18 బాలుర విభాగంలో 6 కి.మీ అండర్–18 బాలికల విభాగం 4 కి.మీ, అండర్ 16బాలుర, బాలికల విభాగంలో 2 కి.మీ క్రాస్ కంట్రీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 6గంటలకు క్రీడా ఆవరణ నందు రిపోర్టు చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## జాతీయ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా ర్యాలీ

**సంతనూతలపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**
జాతీయ వినియోగదారుల దినోత్సవం లో భాగంగా సంతనూతలపాడు హైస్కూలో ఆధ్వర్యంలో శుక్రవారం శుక్రవారం నాడు మండల కేంద్రమైన సంతనూతలపాడులో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలో వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డి.వెంకారెడ్డి, హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద, ఉపాధ్యాయురాలు మాధవిలత, పీడీ కే.మల్లికారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



## మన బాల భారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

### - ప్రత్యేక వేషధారణలో పండుగ స్ఫూర్తిని చాటిన బాల బాలికలు







**అద్దంకి రూరల్ డిసెంబరు 20 ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం లో ప్రవేటు విధ్యకు మూల నిఘంటువుగా అందరికి సుపరిచితుడైన ఒంటెద్దు అంజిరెడ్డి అకడమిక్ డైరెక్టర్ గా కొనసాగుతున్న పుట్టవారిపాలెం గ్రామ పంచాయితీ పరిదిలోని మన బాలభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ లో సెమీ క్రిస్మస్ వేడుకలను జరిపారు. మండల కేంద్రమైన సంతమాగులూరు లో దళితవాడలో ప్రముఖ ప్రార్ధనా మందిరంలో ప్రభువు వాఖ్య బోదకులు పులిచర్ల యానాదిరెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పాల్గొని ఆద్యంతం కార్యక్రమాన్ని సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ఈ సందర్బంగా విద్యార్దినీ విద్యార్దులు ప్రదర్శించిన ప్రత్యేక వేషదారణ నృత్యాలు కార్య క్రమంలో ప్రత్యేకంగా నిలచాయి. ప్రభువు వాఖ్య పరిచయ కర్త బోదకులు పులిచర్ల యానాదిరెడ్డి,పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి,కరస్పాండెంట్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లు, నిర్వహణ కమిటి సభ్యులు దుగ్గెంపూడి పవన్‌కుమార్‌లు విద్యార్దులు ,పాఠశాల బోదన ,బోదనేతర సిబ్బంది సమక్షంలో క్రిస్మస్ కేకును కట్ చేసి పంచుకుని వేడుకను ఆహ్లాద వాతావరణంలో జరిపారు.

## ఐజేయూ జాతీయ నాయకులు నరేంధ్రరెడ్డి

### ఇంట నవ దపంపతులను ఆశీర్వదించిన ఏపీయూడబ్ల్యుజే నాయకులు



**అద్దంకి రూరల్ డిసెంబరు 20 ప్రభాతవార్త**

ఐజేయూ జాతీయ ప్రదానకార్యదర్శి వై . నరేంధ్రరెడ్డి ఇంట నవ దపంపతులను ఏపీయూడబ్ల్యుజేనాయకులు ఆశీర్వదించారు. వై.నరేంధ్రరెడ్డి వినోద దంపతుల కుమారుడు కర్షక్‌రెడ్డి శ్రేయ దంపతులకు వివాహం ఈనెల 5న జరిగింది. నూతన దంపతులను ఏపీయూడబ్ల్యుజే నాయకులు శుక్రవారం హైదరాబాద్ అత్తాపూర్‌లోని వై.నరేంధ్రరెడ్డి ఇంటకి ఐజేయూ మరియు ఏపీయూడబ్ల్యుజే నాయకులు డి.సోమసుందర్, ఆలపాటి సురేష్‌కుమార్, ఐ.వీ.సుబ్బారావు, చందు జనార్ధన్ లు వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## మహత్మగాంధీ సూపర్ స్పెషాలిటీ వైధ్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం

### జన్మస్థలం సంపూర్ణ ఆరోగ్యంగా చూడాలన్నదే తమ లక్ష్యం అంటున్న కారసాని వెంకటకోటిరెడ్డి



**అద్దంకి రూరల్ డిసెంబరు 20 , ప్రభాతవార్త**

ప్రముఖ గుండె వైద్య నిపుణులు నరసరావుపేట లో ప్రముఖ వైద్యశాల మహత్మగాందీ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల అదినేత డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన సంతమాగులూరు ప్రజలు సంపూర్ణ ఆరోగ్య వంతగా ఉండాలనే లక్ష్యంతో గ్రామంలో నిరంతరం ఉచిత వైద్య శిభిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి సోదరులు కారసాని వెంకటకోటిరెడ్డి పేర్కొన్నారు.మహత్మగాందీ సూపర్ స్పెషాలిటీ వైద్య శాల వైద్య బృందం డాక్టర్లు సిబ్బంది తో శుక్రవారం డాక్టర్ కారసాని ఇంటివద్ద ప్రత్యేక వైద్యశిభిరం నిర్వహించారు. ఈ శిభిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

## వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి వుండాలి





**గిద్దలూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

వినియోగదారుల చట్టంపై విద్యార్థినీ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారులు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ వినియోగదారుల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు గిద్దలూరు పట్టణంలో జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీలచే శుక్రవారం ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో వినియోగదారులు తెలుసు కోవలసిన విషయాలపై ప్లకార్డులు మరియు స్లోగన్ల రూపంలో పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు వినియోగదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలని, ఎంఆర్పీ కన్నా అధిక ధర చెల్లించకూడదని కొనుగోలు సమయంలో నాణ్యత పరిమాణం ధర స్వచ్ఛత విషయంలో రాజీ పడకూడదని ఉండాలని అన్నారు. మోసం జరిగిన పక్షంలో ప్రశ్నించాలని అవసరమైతే వినియోగదారుల కమీషన్‌కు ఫిర్యాదు చేయాలని ఆ విధంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ విషయంలో నాణ్యతలేని వినియోగదారులను సైతం చైతన్యపరుస్తూ పర్యావరణహితమైన మరియు ప్రామాణిక చిహ్నం గల వస్తువుల కొనుగోలుకై వారిని ప్రోత్సహిస్తూ బాధ్యత కలిగిన వినియోగదారునిగా వ్యవహరించాలని వారు తెలిపారు. వినియోగదారుల చట్టంపై అవగాహన మరియు సంక్షేమం కొరకు పాటుపడుతామని తద్వారా దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములమవుతామని విద్యార్థుల చేత వారు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం అధ్యక్షులు వీరారెడ్డి, ఉపాధ్యక్షులు శివారెడ్డి, కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ డి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఔరంగాబాద్ సర్పంచ్ కళావతి మృతి



**కంభం రూరల్, డిసెంబర్ 20 ,ప్రభాతవార్త**

మండలంలోని ఔరంగాబాద్ గ్రామంలో సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్న వరికుట్ల కళావతి శుక్రవారం ఉదయం మృతిచెందారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఔరంగాబాద్ గ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించినట్లు వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు తెలిపారు.

## పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు తప్పిన పెను ప్రమాదం

### - భాష్యం యాజమాన్యానికి నోటీసులు జారీ

### - ఫిట్నెస్ లేని వాహనాలు నడిపితే చర్యలు





**సింగరాయకొండ,డిసెంబర్ 20,ప్రభాతవార్త**

స్థానిక భాష్యం పాఠశాలకు సంబంధించిన స్కూల్ బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకువెళ్లిన సంఘటన మండలంలో సంచలనం రేకెత్తించింది. ఈ ఘటన పాకల రోడ్డు లో శుక్రవారం ఉదయం జరిగింది.వివరాలు లోకి వెళితే పట్టణం లోని భాష్యం విద్యాసంస్థ కు చెందిన స్కూల్ బస్సు పాకల గ్రామం నుండి 13 మంది విద్యార్థులను ఎక్కించుకుని మార్గం మధ్యలో వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకు వెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.ఈ సంఘటన మండలంలో తీవ్ర చర్చకు దారితీసింది. తల్లిదండ్రులు సామాజిక వర్గాలు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించిన ఎంఈఓ కే.శ్రీనివాసులు సంబంధిత భాష్యం స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు...ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం వెంటనే పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాల్సి ఉంటుందని కాలం చెల్లిన వాహనాలు ఉపయోగించడం డ్రైవర్ అప్రమాణికత వంటి అంశాలు తెలిస్తూ తీసుకోవడం విద్యార్థుల భద్రతకు వాటా ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ఈ నోటీసులో స్కూల్ బస్సు నిర్వహణ ఫిట్నెస్ పత్రాలు,డ్రైవర్ లైసెన్స్ తదితర అంశాలకు సంబంధించిన పాఠశాల యజమాన్యం పూర్తి సమాచారం అందజేయవలసిందిగా ఆదేశించడం జరిగిందని తెలిపారు. మండల పరిధిలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఫిట్నెస్ లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## పరుగుపందెంలో సత్తాచాటిన ఎస్‌వికెపి విద్యార్థినీ స్వాతి



**కంభం రూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

ఒంగోలులోని ఈతముక్కల పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో జరిగిన పోటీల్లో భాగంగా పరుగుపందెంలో కంభం ఎస్‌వికెపి పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థినీ బి స్వాతి సత్తాచాటి విజేత నిలిచింది. 100మీటర్ల పరుగుపందెంలో కళాశాలలో ఈసిఈ విభాగం విద్యార్థినీ బి స్వాతి మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన విద్యార్థినీ స్వాతిని కళాశాల డైరెక్టర్ డా. పి జయరామిరెడ్డి, కళాశాలల ప్రిన్సిపల్ జంకె సాయిబాబా రెడ్డి, ఈసిఈ విభాగం అధ్యాపకులు షేక్ సాజిద్, పర్యవేక్షకురాలు ఉదయకాంతి, అధ్యాపకులు, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## ప్రజలకు నమ్మకం కలిగించలేని గ్రామసభలు



**హనుమంతునిపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టినటువంటి గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రజలకు నమ్మకం కలిగించలేకుండా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ గ్రామ పరిధిలో గ్రామ సభ జరిగితే మూడు అర్జీలు 10 అర్జీలు మాత్రమే రావడానికి ఈ సందర్భంగా వీరు గుర్తు చేశారు. చాలా గ్రామాల్లో భూమికి సంబంధించినటువంటి ఇళ్ల స్థలాలు సాగు భూములు పాస్ బుక్కులు హద్దులు స్మశాన సమస్యలు బాట సమస్యలు భూ ఆక్రమణలు రకరకాల ఫిర్యాదులు గత పది సంవత్సరాల కాలం నుండి అధికారులకు ఇవ్వడం జరిగిందని గ్రీవెన్స్ డే లు స్పందనాలు, రచ్చబండలు రకరకాల పేర్లతో ప్రజల దగ్గర స్వీకరించినటువంటి అర్జీలు పరిష్కారం కాకపోవడం వల్ల ప్రభుత్వాలు మీద అధికారుల మీద ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. కార్యాలయాల చుట్టూ పనులు పోగొట్టుకుని వేల రూపాయలు ఖర్చు పెట్టుకుని అనేక దఫాలుగా తిరిగితిరిగి వేసాగి ఈ అధికారులు పని చేయరు అని ఒక నిర్ధారణకు ప్రజలు వచ్చినటువంటి పరిస్థితి కనపడుతుందన్నారు. ఈ పరిస్థితుల నుండి బయట పడాలంటే ప్రజలకు పెట్టినటువంటి అర్జీలను నిస్వార్ధంగా నిజాయితీగా పరిష్కారం చేసి ప్రజల దగ్గర నమ్మకం కల్పించాలని అప్పుడు మాత్రమే ఈ సభలకు స్పందన ఉంటుందని తెలిపారు.

## తిమ్మారెడ్డిపల్లిలో రెవెన్యూ సదస్సు



**హనుమంతునిపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో తహశీల్దార్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 7 మంది వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన అర్జీలను పరిశీలించే విధంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ అన్నారు. మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, గ్రామ రెవెన్యూ అధికారి బాదుల్లా, గ్రామ సర్వే అధికారి లక్ష్మీ నారాయణ, దేవాదాయ శాఖ ఈఓ రాయల్ల శంకర్, గ్రామ సర్పంచ్ కూడలి అరుణ దశరధ, నీటి సంఘం అధ్యక్షులు కుందురు నారాయణరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## దేవాదాయ భూములు త్వరితగతిన పరిష్కరిస్తా - జేసీ గోపాల కృష్ణ



**సింగరాయకొండ, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాదాయ భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల్ కృష్ణ తెలిపారు. శుక్రవారం పాత సింగరాయకొండ అయ్యప్ప నగర్ లో రెవెన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తాసిల్దార్ టీ.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ గోపాల్ కృష్ణ దృష్టికి గ్రామంలోని ప్రధాన సమస్య అయిన పాత సింగరాయకొండ గ్రామంలోని 22(ఎ)కి సంబందించిన దేవాదాయ భూములు సమస్య లు పరిష్కరించాలని కోరారు. సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామంలోని వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవాదాయ భూముల సమస్యలును త్వరితగతిన పరిష్కారానికి మార్గం చూపిస్తామని గ్రామంలోని రైతులకు తెలియజేసారు.ఈ భూములకు సంబంధించి పూర్తి వివరాలు ఓ నివేదిక రూపంలో తయారు చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు.గ్రామం లో చెరువులు, డొంకలు,కాలువలు ఆక్రమణాలకు గురయ్యాయని ఆయన దృష్టికి తీసుకొని వెళ్లాగా ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామంలోని రైతులు వివిధ భూ సమస్యలపై 60 అర్జీలు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఈఓ, కృష్ణ వేణి,రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## నూతనవధువరులు ఆశీర్వదించిన మాజీమంత్రి శిద్దా



**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

ఒంగోలు శంకర్ నారాయణ కళ్యాణ మండపంలో జరిగిన ముక్తినూతలపాటి విజయకుమార్, రమావాణి దంపతుల కుమార్తె వెంకట సత్య సాయి ప్రసన్న తేజస్వీని, భీమశంకరం వివాహ రిసెప్షన్‌కి రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శ్రీ శిద్దా రాఘవరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాలికల కబడ్డీ జట్టుకు దుస్తులు బహుకరణ



**సింగరాయకొండ, డిసెంబర్ 20,ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్టుకు దుస్తులు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు దీ.జు.శీ ప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా కబడ్డీ జూనియర్ బాలికల జట్టుకు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ నల్లూరి సుబ్బారావు దుస్తులను బహకరించారు .ఎంపికైన క్రీడాకారిణులు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం లో డిసెంబర్ 22 నుండి డిసెంబర్ 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు ఎంపికైన జట్టు వివరాలు:వి.అర్చన,కె.భూమిక,కె.నందిని,కె.విజయలక్ష్మి, కె.త్రిగుణ,కె.సిపోరా, వి.ధనలక్ష్మి( పాకల)కె.నిరీష (కరేడు) కె.గాయత్రి (వేటపాలెం) డి.హాసన్ బీ (మార్కాపూర్) డి.జోష్ణప్రియ (వై.డి.పాడు ) ఎ.సాయి లత (చీమకుర్తి)

## అయ్యప్ప స్వామి పీఠంకు విశేష పూజలు





**దొనకొండ,డిసెంబర్ 20, ప్రభాతవార్త**

దొనకొండ అడ్డ రోడ్డులొ వేంచేసియున్న విజయ ఆంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములు భక్త బృందం ఈరోజు స్వామివారికి గత 60 రోజుల నుండి విశేష పూజలు నిర్వహిస్తూ అయ్యప్ప పీఠం ఈ రోజున తొలగించు సందర్భంగా స్వామివారికి అభిషేకములు పూల అలంకరణ భక్తి గీతాలతో భజన కార్యక్రమం స్వాములు పాల్గొని కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు బాల రంగయ్య వెంకటేశ్వర రెడ్డి శ్రీనివాసరెడ్డి శ్రీను వెంకటేశ్వర్లు గురుస్వాముల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ మధ్యాహ్నం స్వాములకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అలాగే అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో చుట్టూ ఉన్న గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాలు తీసుకొని ఆనందించారు ఈ సంవత్సరం ప్రత్యేకంగా అయ్యప్ప స్వామి మహోత్సవ విగ్రహం భక్తులను ఎంతో ఆనందింపజేసింది స్వామివారిని విజయ ఆంజనేయస్వామి అయ్యప్ప భక్త బృందం తీసుకురావడం జరిగింది ఈ కార్యక్రమం మండలంలోని గ్రామ ప్రజలందరికీ యొక్క ఆదర అభిమానాలతోటి ప్రతి సంవత్సరం ఇలాగే కొనసాగిస్తామని గురు స్వాములు కొనియాడారు మాకు ఆలయ ధర్మకర్త సిరిగిరెడ్డి బాలి రెడ్డి ఏ లోటుపాట్లు లేకుండా అన్ని మాకు సహకరిస్తూ ప్రతి సంవత్సరం కూడా ఈ రెండు నెలలు దొనకొండ మండలంలో చుట్టూ గ్రామాల నుంచి వచ్చిన స్వాములు అందరికీ సద్ది కార్యక్రమం ఏర్పాటు చేయుచున్నారు.

## అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటించాలి




**కురిచేడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

మండలంలోని ప్రతి అధికారి వారి పరిధిలో గల ప్రజాప్రతినిధులతో సమన్వయంతో మెలగాలని కురిచేడు ఎంపీడీఓ బి.సతీష్ బాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆర్.వస్త్రాం నాయక్, మండల విద్యాశాఖ తరుపున నివేదికను తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్‌బాబు జలజీవన్ మిషన్ గురించి వివరించారు. మండల వైద్యశాఖాధికారి ప్రవీణ్ కురిచేడులో గల వైద్య సదుపాయలు గురించి వివరించాఉ. కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్‌తదితర పరీక్షలు ఈసీజీ లాంటి పరీక్షలు కురిచేడులో అందుబాటులో ఉన్నాయని వివరించారు. అనంతరం వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, విద్యుత్ శాఖల అధికారులు నివేదికలు సమర్పించారు. ఆర్టీసీ అధికారిణి మాట్లాడుతూ మండలంలో రహదారులకు ఇరువైపులా చిల్లచెట్లు బాగా పెరిగినట్లు, దీంతో టర్నింగ్ పాయింట్ల వద్ద ఎదురొచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. నాయుడుపాలెం ఎంపీటీసీ మాట్లాడుతూ నాయుడుపాలెనికి గతంలో ఆర్టీసీ బస్సు నైట్‌హాల్ట్ ఉండేదని, ప్రస్తుతం ఆ సౌకర్యాన్ని తొలగించాలని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి మాట్లాడుతూ అధికారులు వారి వారి శాఖల నివేదికలు సమర్పిస్తున్నారే తప్ప గతంలో సభ దృష్టికి వచ్చిన సమస్యలు ఏమిటి, అవి ఎంత వరకు పరిష్కారం అయ్యాయి అనే అంశాలను ప్రస్తావించడం లేదని తెలిపారు. ఇప్పట్నుంచి అయిన అధికారులందరూ ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపి తదుపరి సమావేశంలో ఎంత మేరకు సమస్యలు పరిష్కారం అయ్యాయో నివేదికలు ఇవ్వాలని కోరారు. చివరిగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు వారి వారి పరిధిలో ప్రజలకు బాధ్యులుగా ఉంటారని, అందుచేత అధికారులందరూ వారిని గౌరవిస్తూ వారితో సమన్వయంతో మెలగాలని సమావేశంలో మాట్లాడేటప్పుడు ఏకవచనంతో ప్రజాప్రతినిధులను సంభోదించరాదని, సమావేశానికి గైర్హాజరైన వివిధ శాఖల అధికారులకు నోటీసులు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీస సభ్యులు, పలువురు గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం




**కురిచేడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం పొందవచ్చని తహశీల్దార్ రజని కుమారి తెలిపారు. మండల కేంద్రమైన కురిచేడులో శుక్రవారం నాడు గ్రామ రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురిచేడు గ్రామ పరిధిలో గల రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే సరైన సమస్యలకు వెంటనే పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కొన్ని మ్యుటేషన్లు, ఆన్‌లైన్ పక్రియలు అక్కడిక్కడే చేయడం జరిగింది. మిగిలిన అర్జీ దారులకు రసీదులు ఇచ్చి వీలైనంత త్వరగా ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కురిచేడు సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో కే.నాగరాజు, వీఆర్వోలు సరోజిని, వెంకటేశ్వర్లు, శేషగిరి, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్‌క్లాస్ విద్యార్థులకు మోడల్ పేపర్స్ బహుకరణ



**సింగరాయకొండ, డిసెంబర్ 20,ప్రభాతవార్త**

మండలంలోని ఊళ్లపాలెం గ్రామములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 80మంది విద్యార్థులకు పదవ తరగతి పరీక్ష మోడల్ పేపర్ పుస్తకాలను పంపిణి చేశారు.శుక్రవారం పాఠశాల ఆవరణలో ప్రగతి నర్సింగ్ హోమ్ ప్రముఖ వైద్యులు డాక్టర్ బద్వేలి హరిబాబు సహకారం తో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కంప్యూటర్ యుగంలో ఈ యొక్క పుస్తకం విద్యార్థులకు బాగా ఉపయోగం పడుతోందని, విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించ గలరని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి ఎస్ కె వి ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్,టి రామ్మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి, కోటపాటి నారాయణ, లీజుజు ప్రతాపరెడ్డి , వల్లభుని ఆనంద్ కుమార్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దళిత ఉద్యోగిపై కుల వివక్షత తగదు...

### - మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య



**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

దళిత ఉద్యోగిపై కుల వివక్షత తగదని.. కోర్టు ఉత్తర్వులను కలెక్టర్ అమలు చేయాలని.. ఉద్యోగంలో చేర్చుకోవాలని.. మీడియాతో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య అన్నారు. దళిత ఉద్యోగిపై జిల్లా ఉన్నతాధికారులకు కుల వివక్షత తగదని, కోర్టు ఉత్తర్వులను అమలు చేసి ఉద్యోగంలో చేర్చుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య డిమాండ్ చేశారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేయడంతో జిల్లా కలెక్టర్ తాత్సారం చేయడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుందన్నారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ భవన్లో బాధితునితో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు వివరాలు తెలియజేశారు. కరవాది అనీల్ అనే దళిత యువకుడు ఈ ఏడాది మార్చి 16వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాలో సైకాలజిస్ట్ పోస్టుకు డిఎస్సి ద్వారా ఉద్యోగంలో చేరారు. అప్పటి నుండి విధులు నిర్వర్తిస్తున్నారు. గత నెల 13వ తేదీ నుండి సెలవు పెట్టుకున్నారు. సెలవులో ఉన్న సమయంలో అకారణంగా మరుసటి రోజు 14వ తేదీన ఉద్యోగం నుండి టెర్మినేట్ చేసినట్లు తెలియజేశారు. అకారణంగా తీసివేతపై కోర్టును సంప్రదించారు. విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆర్డర్ ఇచ్చింది. కాని జిల్లా కలెక్టర్, వైద్యాధికారులు ఆర్డర్ను అమలు చేయకుండా తాత్సారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. న్యాయబద్ధంగా రావాల్సిన ఉద్యోగాన్ని దళిత యువకుడు కరవాది అనీల్కు కేటాయించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ దృష్టికి జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ దృష్టికి అంతేకాకుండా మానవ హక్కుల సంఘం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే వరకూ న్యాయపొరాటం చేస్తామని బిల్లా చెన్నయ్య హెచ్చరించారు.

# భూ సంబంధిత సమస్యలు

## – సత్వర పరిష్కారం దిశగా చర్యలు

## – అద్దంకి రెవెన్యూ సదస్సులో మంత్రి గొట్టిపాటి

**అద్దంకి , డిసెంబరు 20 , ప్రభాతవార్త**




గత ప్రభుత్వ అధికార దుర్వినియోగం, అస్తవ్యస్థ పాలనతో ఏర్పడ్డ భూ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లా అద్దంకిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అత్యధిక శాతం ప్రజల నుంచి భూ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తులు రావడంతో వాటిని శాశ్వత ప్రాతిపదికన వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులతో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది, భూ సంబంధిత సమస్యలను పరిష్కరించి, అర్హులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

### ప్రతి అర్జీకి పరిష్కారం చూపించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశం

### – మంత్రి గొట్టిపాటి



భారీగా తరలి వచ్చిన ప్రజల నుంచి అర్జీల స్వీకరణఅనంతరం సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులు, విఆర్ఒలతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమావేశం నిర్వహించారు. మొత్తం ఎన్ని వినతులు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని నమోదు చేసి, వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకూ అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సమస్యలతో పాటు, విద్యుత్, ఇతర శాఖలకు సంబ ంధించిన వినతుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని చెప్పారు. విధి నర్వహణలో ఏమైనా సమస్యలు వుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

### రూ.1.26 కోట్ల సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి

**అద్దంకి , డిసెంబరు 20 ,ప్రభాతవార్త**



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.1,26,71,093 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను 111మందికి లబ్దిదారులకు మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. అదే విధంగా రు.29,80,000విలువైన ఎల్ఒసిలను ఆరుగురు అర్హులకు అందించారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇప్పటి వరకు అద్దంకి నియోజకవర్గంలో సుమారు రు. 3,68,74,641, సిఎంఆర్ఎఫ్ నిధులను బాధితులకు అందించినట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయంలో సామాన్యులకు వైద్యం అందని ద్రాక్షగానే వున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### రూ. 2.60 కోట్ల సిఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాళ్ళు – మంత్రి గొట్టిపాటి

**అద్దంకి , డిసెంబరు 20 , ప్రభాతవార్త**

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద సామాజిక బాధ్యతగా అద్దంకి నియోజకవర్గ పరిధిలో విద్యుత్‌శాఖకు చెందిన సుమారు రు.2.60 కోట్లతో, 11 కమ్యూనిటీ హాళ్ళను, కళాశాల భోజనశాలను నిర్మిస్తున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ఎస్.సి.బిసి, మైనార్టీ కాలనీలలో ఎక్కువగా ఈ కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా గత ప్రభుత్వ హయంలో మధ్యలోనే నిలిచిపోయిన కొన్ని నిర్మాణాలను పూర్తిచేస్తామని, మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

**జె.పంగులూరను , డిసెంబరు 20 , ప్రభాతవార్త**



జె.పంగులూరు మండలం, జాగర్లమూడి వారిపాలెంలో తెదేపా సీనియర్ నేత తెలగతోటి రాధాకృష్ణ ఆనారోగ్యంతో బాధపడుతుండటంతో శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ వారి నివాసానికి వెళ్ళి రాధకృష్ణను పరామర్శించి ఆరోగ్య విషయమై వాకాబు చేశారు. అదే విధంగా జాగర్లమూడి వారిపాలెం మాజీ సర్పంచ్ జాగర్లమూడి వాయునందన రావు, ఆలాగే ధూళిపాళ్ళ సుబ్బారావులను మంత్రి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ

**అద్దంకి , డిసెంబరు 20 , ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో విశ్రాంత ఎంఆర్ఒ తాతా బాలసుబ్రమణ్యం ఆర్థిక సౌజన్యంతో పసుమర్తిపాలెంలోని డాక్టర్ క్లవ్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో 50మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ఎజి షేక్ మహ్మద్ రఫీ, డాక్టర్ యు.దేవపాలన, విద్వాన్ జ్యోతిచంద్రమౌళి, అంజాద్ బాషా, ఎజిపి రమేష్‌బాబు, ఫాదర్ యేసుబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీ కృష్ణ, కాకార్ల వెంకటేశ్వర్లు, కొల్లా భువనేశ్వరి, పువ్వాడ రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం దాత బాలసుబ్రమణ్యం గారిని రోటరీ వారు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు, క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ మహిళలకు చీరలు పంపిణీ చేసినందుకు ఫాదర్ యేసుబాబు రోటరీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

## అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి

**అద్దంకి , డిసెంబరు 20 , ప్రభాతవార్త**




డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే పదవికి రాజీనామ చేయాలని ఎపి.ఎస్.సి.ఎస్.టి.బి.సి . అండ్ మైనార్టీస్ ఐక్యవేదిక డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం బంగ్లారోడ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అంబేద్కర్ ఫోటోలు, పట్టుకుని నినాదాలు చేస్తు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగము ద్వారా కల్పించిన హక్కుతో మంత్రి పదవి అలంకరించిన అమిత్ షా ఆ పదవిలో వుండే హక్కు కోల్పోయాడు, వెంటనే రాజీనామ చేయాలని, భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు అంకం నాగరాజు, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, తాళ్లూరి బాబురావు, నక్క కాంతారావు, మందా జోసఫ్, జగన్నాథం, యోహను, జ్యోతి రోశయ్య, మోటూరి సుదర్శన్, ప్రభాకరరావు, హనుమంతరావు, సయ్యద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

### – ఎస్సై శ్రీరామ్

**కనిగిరి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



ద్విచక్ర వాహనాలు నడిపే వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై టి.శ్రీరామ్ అన్నారు. శుక్రవారం కనిగిరి పోలీసు స్టేషన్ ఆవరణలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్‌ధరించకపోవడం వల్ల కలిగే నష్టాలను మరియు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వల్ల కలిగే పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. హెల్మెట్ ధరించని వారిపై జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్‌రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బయోమెట్రిక్‌పై అవగాహన

**బల్లికురవ, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బయోమెట్రిక్, విధానంపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుసుమకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో సమయపాలనకు ప్రథమ ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. అదే విధంగా ప్రస్తుతం జరుగుతున్న సర్వేల మీద ప్రధానంగా రివ్యూ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అందరూ పంచాయతీ కార్యదర్శులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్నుపల్లిలో రెవెన్యూ సదస్సు

**బల్లికురవ, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



ప్రజలకు జీవనాధారమైన భూమికి భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తహశీల్దార్ రవి నాయక్ అన్నారు. మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని ఇనాం భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపటమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. హద్దులు రీ సర్వేలోని లోపాలను శాశ్వతంగా పరిష్కరించడం రెవెన్యూ సదస్సుల లక్ష్యమన్నారు. రైతుల నుండి అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. భూములలో హద్దుల తేడాలు, రీ సర్వేలోని లోపాలు, తదితర అంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన అర్జీలను స్వీకరించారు. సదస్సులోనే కొన్ని సమస్యలకు పరిష్కారం చూపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రహర్ష, ఆర్ఐ పోతురాజు, సర్పంచ్ శివపార్వతి హరిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆళ్ల చంద్రమౌళి, స్థానిక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

## – నియోజకవర్గంలో పది వేల మందికి ఉపాధి
## – యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు
## – చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధి
## – ప్రముఖ హెచ్‌ఆర్‌కో కంపెనీతో ఒప్పందం
## – రూ.12వేల నుంచి 60 వేలు జీతం
## – కంపెనీ ప్రతినిధుల భేటీలో ఎమ్మెల్యే ఏలూరి

**మార్టూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



చదువుకున్న యువత ప్రతి ఒక్కరికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు పేర్కొన్నారు. శుక్రవారం యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే ఏలూరి ఏర్పాటు చేసిన గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ప్రముఖ కంపెనీ హెచ్‌ఆర్ అండ్ కో కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పర్చూరు నియోజకవర్గంలో పది వేల మందికి ఉపాధి కల్పించడమే తన లక్ష్యమన్నారు. ఇందుకోసం క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ఎంప్లాయిమెంట్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఎంప్లాయిమెంట్ సెల్ ద్వారా నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు వారి అర్హతలను బట్టి వివిధ కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి గ్రామాలకి ఈ ఎంప్లాయిమెంట్ సెల్ యొక్క ఎగ్జిక్యూటీవ్ వచ్చి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరికి వారి అర్హతలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను అందించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క మండలం చొప్పున ప్రతి వారం నియోజకవర్గంలోని ఆరు మండలాలలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు నెలల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్హతను బట్టి రూ.12వేల నుంచి రూ.60వేలు వరకు వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈభేటీలో హెచ్‌ఆర్ కో కంపెనీ ప్రతినిధులు హర్షరెడ్డి, కార్తీక్, ప్రత్తిపాటిలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సేవ చేసే భాగ్యం దక్కడం మాకు దేవుడు ఇచ్చిన వరం

### – దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

**దర్శి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



విద్యార్థులకు సేవ చేసే భాగ్యం దక్కడం మాకు దేవుడు ఇచ్చిన వరం అని దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దర్శి మండలం శివరాజ్‌నగర్ వద్ద నున్న మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్ వన్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మా నాన్న విద్య పట్ల ఉన్న మక్కువ కారణంగా గత 24 సంవత్సరాల నుండి విద్యార్థులకు ఆన్‌ఇన్‌వన్ మెటీరియల్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆయన నేర్పిన ఆశయాలను కొనసాగిస్తూ నేడు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దర్శి మండలంలో అన్ని స్కూళ్లల్లో 800 మందికి బుక్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మోడల్ స్కూల్ విద్యార్థులకు ఏ అవసరం ఉన్న మేము సహాయ సహకారాలు అందించడానికి సిద్దంగా ఉన్నామని అన్నారు. ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నుండి మోడల్ స్కూల్‌కి ఎటువంటి నిధులు కావాలన్నా మంజూరు చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వార్డు కౌన్సిలర్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీజీఆర్‌ఎఫ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో చీమకుర్తిలో విద్యుత్ అదాలత్

**దర్శి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

ఈనెల 21న చీమకుర్తిలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న పి.శ్రీనివాసులు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, ఆపరేషన్ దర్శి వారు ఒక ప్రకటనలో తెలిపారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ ఫోరమ్(సీజీఆర్‌ఎఫ్) విజయవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు చీమకుర్తి పట్టణం స్థానిక మున్సిపల్ ఆఫీస్ నందలి కౌన్సిల్ హాల్ నందు ఉదయం 10.30గంటల నుండి 1.30గంటల వరకు జరుగుతుందని, ఈ కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ చైర్ పర్సన్ జస్టిస్ ఎన్.విక్టర్ ఇమ్మానియేలు అలాగే ఇతర ఫోరం సభ్యులు, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, ఒంగోలు కే.వెంకటేశ్వర్లు, విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. కావున దర్శి డివిజన్ పరిధిలోని చీమకుర్తి, పొదిలి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను వ్రాత పూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్, పూర్తి అడ్రస్, సెల్ నెంబర్‌తో అర్జీ సమర్పించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. విద్యుత్ అంతరాయం, హెచ్చు తగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లులు సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర అన్ని సమస్యలు ఈ యొక్క సమావేశంలో పరిష్కరిస్తారని కావున విద్యుత్ వినియోగదారులు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని పి.శ్రీనివాసులు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, ఆపరేషన్ దర్శి వారు తెలియజేశారు.

## డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పీసీపల్లి ఎస్సై

**పీసీపల్లి(కనిగిరి), డిసెంబర్ 20, ప్రభాతవార్త**



సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా కనిగిరికి బదిలీపై వచ్చిన నూతన డీఎస్పీ ఎం.మహేశ్వరరావును శుక్రవారం పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. కనిగిరి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీకి ఎస్సై బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నేర నియంత్రణ చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాల కట్టడి సైబర్ నేరాలపై అవగాహన ఇతర అంశాలను నిర్వహించాల్సిన అంశాల పట్ల పలు సూచనలు ఎస్సైకి తెలియజేశారు.

## మహ్మద్ దమ్ బిర్యాన్ని పాయింట్‌ను ప్రారంభించిన తహశీల్దార్ శ్రావణ్ కుమార్

**దర్శి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



దర్శిలోని పొదిలి రోడ్డులో గల మమహ్మద్ దమ్ బిర్యాని పాయింట్‌ను నూతనంగా ఏర్పాటు చేయడంతో దీనిని శుక్రవారం దర్శి తహశీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి ఫుడ్‌ని అందించాలని మంచి నాణ్యమైన భోజనాన్ని క్వాలిటితో కూడిన ఫుడ్‌ని అందించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ వైస్ ఎంపీపీ మారం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు కనిగిరి వాసవి, వనిత క్లబ్‌లకు అవార్డులు అందజేత

**కనిగిరి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**




2024వ సంవత్సరానికి ఇటీవల మధురైలో జరిగిన ఐకాన్‌లో సూపర్‌బెస్ట్ రీజియన్ చైర్ పర్సన్, బెస్ట్ రీజియన్ సెక్రటరీ, బెస్ట్ క్లబ్‌లుగా వాసవి కుటుంబ సురక్ష పథకం క్లబ్ కనిగిరి, వనిత క్లబ్, వనిత క్లబ్ పామూరు రీజియన్–2లో బెస్ట్‌గా ఇంటర్నేషనల్‌లో 5 అవార్డులు సాధించారు. ఈ ఏడాది జనవరి నుండి డిసెంబర్ వరకు చేసిన వివిధ సేవా కార్యక్రమాలకు అవార్డులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం రీజియన్ చైర్ పర్సన్ వీఎన్3 స్టార్ కేసీజీ ఎఫ్ మునగా ఉమా శివలక్ష్మీ అవార్డులను అందరికి అందజేశారు. ఈ కార్యక్రమానికి కనగిరి ఐఈసీ ఆఫీసర్ వెలుగూరి చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ ఇన్‌ఛార్జీలు గోనుగుంట్ల రామ అనిల్, బచ్చు వెంగళరావు గుప్తా, రీజియన్ సెక్రటరీ రాచర్ల నరేష్ కుమార్, జోన్ చైర్ పర్సన్ అద్దంకి సుబ్రహ్మణ్యం, ప్రెసిడెంట్స్ తటవర్తి ధనలక్ష్మీ, తాళ్ళూరి అన్నపూర్ణ, వనమా వెంకటేశ్వరరావు, కోట సురేష్, కనమర్లపూడి లక్ష్మీమోహన్, పైడిమర్రి సుబ్బయ్య, అచ్యుత లక్ష్మీ కుమారి, చలువాది వాసవి, వనమా లోకేష్ గుప్తా, వాసవి క్లబ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజియన్‌లోని సీనియర్‌లైన ఆఫీసర్స్‌కి సన్మానం చేశారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు

**కనిగిరి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను, మాచవరం సభ ప్రాంగణాన్ని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరగనున్న సేవా కార్యక్రమాలపై చర్చించుకున్నారు. 4వేల మంది మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం దిగ్విజయంగా అందరి సహకారంతో జరుపుకోవాలని నాయకులందరూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కటికల వెంకటరత్నం, గోవర్ధన్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గొబ్బెల శ్రీను, ఏడుకొండలురెడ్డి, రసూల్,ఏటీఆర్, ఆవుల భాస్కర్‌రెడ్డి, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల విఆర్వోల సంఘం అధ్యక్షుడిగా రంగయ్య

**రాచర్ల, డిసెంబర్ 20 ప్రభాతవార్త**



మండల విఆర్వోల సంఘం నూతన అధ్యక్షుడిగా యడవల్లి విఆర్వో శ్రీరామ్ రంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండల విఆర్వోల కార్యాలయంలో విఆర్ఓల సంఘం ఎన్నికల ప్రక్రియ చేపట్టగా విఆర్వోలు అందరూ రంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాచర్ల –2 (కాల్వపల్లి) విఆర్వో పులుగుజ్జు డానియల్, ప్రధాన కార్యదర్శిగా ఆకవీడు –1 విఆర్వో అన్నపురెడ్డి శివారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా చోళ్ళవీడు విఆర్వో దార్ల యోనా, కోశాధికారిగా సోమిదేవిపల్లి విఆర్వో భూపని రజితలను ఎన్నుకున్నట్లు వారితోపాటు మరికొందరు కార్యవర్గసభ్యులను కూడా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు రంగయ్య మాట్లాడుతూ విఆర్వోల సమస్యల పరిష్కారానికి అందరం కలిసి పనిచేద్దామని, అందరి సహకారంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. పెద్ద, చిన్నా అనే తేడా లేకుండా కలిసి మన హక్కుల సాధనకు సమస్యల పరిష్కారానికి కృషిచేద్దామని అందుకు అందరూ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. తనపై నమ్మకంతో అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన విఆర్వోలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు మండల విఆర్వోలు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ట విఆర్వో ఏ మాచర్ల, పాలకవీడు విఆర్వో బి కిశోర్ కుమార్, అనుములపల్లి విఆర్వో ఈర్ల వెంకటేశ్వర్లు, చిన్నగానిపల్లె విఆర్వో రాజారపు శివపార్వతి, సత్యవోలు విఆర్వో కె లక్ష్మీ పాల్గొన్నారు.

## లబ్దిదారులు వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలి

**కొమరోలు, డిసెంబర్ 20 ప్రభాతవార్త**



మండంలో లే అవుట్లలో స్థలాలు పొందిన లబ్దిదారులు వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని మండల ఎంపిడిఓ మస్తాన్ వలి తెలిపారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె పంచాయితీ ఎస్సీ కాలనీ లే అవుట్లను హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు . ఈ సందర్భంగా స్థలాలు పొందిన లబ్దిదారులతో వారు మాట్లాడుతూ బిఎల్, ఆర్ఎల్ గృమాలను త్వరగా పూర్తి చేసుకొని బిల్లులు పొందాలని తెలిపారు. ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టిన వారికి బిల్లులు పొందే అవకాశం ఉంటుందని లబ్దిదారులు ఈ విషయాన్ని గుర్తుంచుకొని సాధ్యమైనంతవరకు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.లబ్దిదారులకు ఇంటి నిర్మాణాల విషయంలో పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది.హౌసింగ్‌శాఖ సిబ్బంది, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎస్‌ఏ –1 పరీక్షలు


**రాచర్ల, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



మండలంలో నిర్వహించిన ఎస్‌ఏ–1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాశాఖాధికారులు వి గిరిధర్ శర్మ, ఏ శివకోటేశ్వరరావులు తెలిపారు. మండల కేంద్రమైన రాచర్ల ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న గణితం పరీక్షను శుక్రవారం వారు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ బాగా జరిగిందని ప్రశాంతంగా ముగిశాయని అన్నారు. ఈనెల 11వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించవలసి ఉండగా 16వ తేదీ జరగవలసిన గణితం పరీక్ష అనివార్య కారణాల వలన వాయిదా పడి 20వ తేదీకి మార్చడం జరిగిందని వారు తెలిపారు. వాస్తవంగా 11 నుండి 19వ తేదీలోపుగా పరీక్షలు పూర్తయ్యాయని 16వ తేదీ పరీక్ష వాయిదా వలన 20న నిర్వహించామని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి క్వశ్చన్ పేపర్ పాఠశాలలకు పంపిణీ చేశామని అనంతరం పరీక్షలు ప్రారంభించి ప్రశాంతంగా ముగించారని వారు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

## వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులుగా కొల్లా ఉదయ్‌భాస్కర్

**దర్శి, డిసెంబర్ 20, ప్రభాతవార్త**



దర్శి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు కొల్లా ఉదయ్ భాస్కర్‌కి వైసీపీ పార్టీలో అరుదైన గౌరవం దక్కింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాసానుసారం వైసీపీ జిల్లా అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించడం జరిగింది. అందులో భాగంగానే దర్శి పట్టణానికి చెందిన కొల్లా ఉదయ్ భాస్కర్‌కి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులుగా నియమించారు. ఈ పదవి రావడానికి సహకరించిన దర్శి ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకి కొల్లా ఉదయ్‌భాస్కర్ ప్రత్యేకమైన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య విభాగంలోని సమస్యలపై పని చేస్తానన్నారు. అనంతరం ఉదయ్ భాస్కర్‌కి,పలు వైసీపీ నాయకులు ఆర్యవైశ్య సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

**మద్దిపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త**

విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో మండలంలోని దొడ్డవరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు దొడ్డవరం గ్రామానికి చెందిన మోరబోయిన పాపారావు(30) వృత్తిరీత్యా కరెంటు పనులు చేస్తుంటారు. శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో తన పొలంలోకి నీరు పెట్టేందుకు చెరువు గట్టున ఉన్న మోటారును రిపేరు చేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో పాపారావు చెరువులో పడి మృతి చెందాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. భార్య ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు.

21-12Pg5.qxd:21-12Pg5.qxd 01/01/01 8:27 AM Page 1



# దేశంలో పెరుగుతున్న మందిర్ మసీదు వివాదాలు

## ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన



**పూణె, డిసెంబరు 20:** దేశంలో పెరుగుతున్న మందిర్ మసీదు వివాదాలపై రాష్ట్రీయస్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేసారు. ఆయోధ్య రామ్‌మందిరం నిర్మాణం తర్వాత కొందరు ప్రత్యేక వ్యక్తులు తాము హిందువులకు నాయకులుగా చెలామణి అవుతున్నట్లు భావిస్తున్నారని చురకలు వేసారు. ఇండియా విశ్వగురు అన్న థీమ్‌తో జరిగిన సదస్సులో కీలక ప్రసంగం చేస్తూ సమ్మిళిత సమాజంగా దేశం కొనసాగాలని, ప్రపంచం ఒక సమ్మిళిత సమాజంగాను, సామరస్య వాతావరణంలోను కొనసాగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ తన ప్రసంగంలో క్రిస్‌మస్‌ను కూడా ప్రస్తావించారు. రామకృష్ణ మిషన్‌లో కూడా క్రిస్మస్‌ను వేడుకగా జరుపుతారని, హిందువులం కావడం వల్లనే సర్వమత సమానత్వంతో మనం ఈ పండుగలు జరుపుతామని భగవత్ పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా సామరస్య వాతావరణంలో మనం జీవిస్తున్నామని, ప్రపంచానికి ఇదే సందేశం మనం పంపించగలిగితే భారత్ ఒక మోడల్‌గా మారుతుందన్నారు. రామమందిరం నిర్మాణం తర్వాత కొందరు వ్యక్తులు తాము హిందువులకు నాయకులుగా మారగలమని భావిస్తున్నారని, ఇలాంటి మరికొన్ని వివాదాలనే ఇపుడు తెరపైకి తెస్తున్నారన్నారు. హిందువులకు ఉన్న ప్రగాఢ విశ్వాసం కోసం రామమందిరాలు నిర్మించామని మోహన భగవత్ పునరుద్ఘాటించారు. ప్రతిరోజూ ఒక కొత్త వివాదం తెరపైకి వస్తోందని, ఇలాంటివాటిని మనం ఎలా అనుమతించగలమని, ఇకపై ఎంత మాత్రం కొనసాగకూడదని, భారతప్రజానీకం సర్వమత సమానత్వంతో జీవిస్తామన్న భావన పెంపొందాలన్నారు. ఇటీవలికాలంలో అనేక చోట్లనుంచి మసీదులు సర్వేచాలయని, మసీదుల కింద దేవాలయాలున్నాయన్న వాదనలతో కోర్టులకు న్యాయం కోసం దాఖలవుతున్న పిటిషన్లను కూడా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ ప్రస్తావించారు. బయటినుంచి వచ్చిన కొన్ని గ్రూపులు వారి పాతకాలం బూజుపట్టిన విధానాలు కొనసాగించాలని కోరుకుంటున్నాయని ఇది ఎంతమాత్రం కొనసాగకూడదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం ప్రకారం దేశం నడుస్తుందని ఈక్రమంలో ప్రజలు తమ ప్రతినిధులను ఎంపికచేసుకుంటారన్నారు. ఆధిపత్యం నియంతృత్వధోరణుల కాలం చెల్లిందని, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ ఇలాంటి విధానాలతోనే వెళ్లిపోయారన్నారు. గోవధ నిషేధాన్ని ఆనాటి బహదూర్‌షా జఫర్ అమలు చేసినా ఔరంగజేబు కొనసాగించారన్నారు. మైనార్టీలు, మెజార్టీలు సమస్య కాదని అందరూ ఒకటేనని అన్నారు. ఈదేశంలో ఎవరికి నచ్చినవారు వారి దేవుళ్లను కొలుస్తారని, ఆరాధించుకోవచ్చని అన్నారు. చట్టాలను గౌరవిస్తూ మత సామరస్యాన్ని కొనసాగించాలని సూచించారు.



# ప్రధాని మోడీతో మంచి స్నేహానుబంధం

## రష్యా అధ్యక్షుడు పుతిన్

**మాస్కో, డిసెంబరు 20:** భారత ప్రధాని నరేంద్ర మోడీతో తనకు మంచి అనుబంధం ఉందని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ప్రపంచ నేతల్లో తనకున్న స్నేహితుల్లో ఆయనొకరని తెలిపారు. వార్షిక విలేకరుల సమావేశంలో భాగంగా అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. ఈ సందర్భంగా ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ప్రపంచనేతలోలన ఎవరితో నాలుగు మాటలు పంచుకుంటూ కప్ టీ షేర్ చేసుకోవాలనుకుంటున్నారని పుతిన్‌కు ప్రశ్న ఎదురైంది. దానికి బదులిస్తూ తన మిత్రుల పేర్లు తెలియజేశారు. 'జర్మనీ మాజీ ఛాన్సలర్ హెల్ముట్ కోల్ , ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు జాక్వెస్ చిరాక్, ఇటలీమాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీతో నాకు మంచి అనుబంధం ఉంది. అలాగే ఆసియాలో భారత ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నాకు మిత్రులు' అని వెల్లడించారు. బ్రిక్స్ గ్రూప్ గురించి పశ్చిమదేశాలు వ్యక్తం చేస్తోన్న ఆందోళనను ఉద్దేశించి ఓ సందర్భంలో భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ చేసిన వ్యాఖ్యను పుతిన్ ప్రస్తావించారు. 'బ్రిక్స్ పశ్చిమదేశాలను వ్యతిరేకించే గ్రూప్ కాదు. అలా అని వాళ్ల గ్రూప్ కూడా కాదు. అది మంచి వ్యాఖ్య. అది ఏ దేశానికి వ్యతిరేకంగా పనిచేయడం లేదు. సభ్యదేశాల ప్రయోజనం కోసం మాత్రమే పనిచేస్తోంది'అనిపుతిన్ అన్నారు. ఆ గ్రూప్‌లో బ్రెజిల్, చైనా, దక్షిణాఫ్రికా, రష్యా, ఇండియా సభ్యదేశాలు. పుతిన్ సందర్భం వచ్చినప్పుడల్లా ప్రధాని మోడీతో ఉన్న స్నేహం, భారత్ అనుసరిస్తోన్న విధానాలను ప్రశంసిస్తుంటారు. ఈ యేడాది రెండుసార్లు మోడీ రష్యాకు వెళ్లారు. ఈ అక్టోబరులో బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న ఆయన దౌత్యం, చర్చలకు భారత్ మద్దతిస్తుందని, యుద్ధానికి కాదని పునరుద్ఘాటించారు. ఇదిలా ఉంటే భారత్ పంపిన ఆహ్వానం మేరకు పుతిన్ కూడా త్వరలో మన దేశంలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించి 2025 ప్రారంభంలో తేదీలు ఖరారు చేస్తామని క్రెమ్లిన్ వెల్లడించింది. ప్రతియేటా ఒకసారి సమావేశం కావాలని ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారని, ఇందులో భాగంగా ఈసారి పుతిన్ భారత్‌కు రానున్నారని తెలిపింది.

# రష్యా దాడులతో ఉక్రెయిన్ ఉక్కిరిబిక్కిరి

**కీవ్, డిసెంబరు 20:** రష్యా అధ్యక్షుడు పుతిన్ వార్షిక విలేకరుల సమావేశం ముగిసిన 24 గంటల్లోనే ఉక్రెయిన్‌పై భారీగా క్షిపణి, సైబర్ దాడులు జరిగాయి. ముఖ్యంగా కీవ్ ఆధీనంలోని ప్రభుత్వ రిజిస్ట్రీలనే హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ డిప్యూటీ ప్రధాని ఓలాహ్ స్టెఫలిష్నా వెల్లడించారు. ఈ దాడుల కారణంగా చాలా సేవలను నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. ఈ రిజిస్ట్రీల్లో ప్రజల జనన మరణాలు, పెళ్లిళ్లు, ఆస్తులకు సంబంధించిన కీలక వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. 'ఇటీవల కాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో బయటి నుంచి సైబర్ దాడి జరిగింది. దీంతో జస్టిస్ శాఖ ఆధీనంలోని ఏకీకృత రిజిస్ట్రీలను మూసివేసి.. సేవలను సస్పెండ్ చేశాం. వీటిని పునరుద్ధరించడానికి కనీసం రెండు వారాల సమయం పడుతుంది. ఆయా కార్యాలయాల్లో మాత్రం ఈ సేవలు అందుతాయి. దేశాన్ని ఇబ్బంది పెట్టడానికే రష్యా ఇలా చేసింది' అని స్టెఫలిష్నా పేర్కొన్నారు.



**అమెరికా క్షిపణులు ప్రయోగించినందుకు ప్రతీకారం : రష్యా:** జెలెన్‌స్కీ సొంత ఊరు క్రైవీ రిహ్‌పై మాస్కో గురిపెట్టింది. ఇక్కడి రెండంతస్తుల భవనంపై క్షిపణి దాడి చేసింది. అదే సమయంలో రాజధాని కీవ్‌పై మరోదాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ బుధవారం కీవ్ దళాలు చేసిన దాడికి ఇది ప్రతిస్పందన అని పేర్కొంది. అమెరికా తయారీ ఎటిఎసిఎం క్షిపణులు ఆరు, బ్రిటన్ తయారీ స్ట్రామ్ షాడో మిసైల్స్ నాలుగు రోస్టోవ్ ప్రాంతంపై ప్రయోగించినట్లు వెల్లడించింది. దీనికి ప్రతిగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది.

**దౌత్య ఆస్తుల వాపస్‌కు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంపన అధికారం చేపట్టగానే తమ దౌత్య భవనాలను తిరిగి ఇచ్చేలా ఒత్తిడి తెచ్చేందుకు రష్యా సిద్ధమవుతోందని ఆ దేశ డిప్యూటీ విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో పలు ఆస్తులను వాషింగ్టన్ స్వాధీనం చేసుకుంది.

ముఖ్యంగా 2016 ట్రంప్ ఎన్నిక వేళ రష్యా జోక్యం ఉందన్న ఆరోపణలపై పలు భవనాలను అమెరికా స్వాధీనం చేసు కుంది. న్యూయార్క్, మేరీల్యాండ్‌లోని దౌత్య వేత్తల విడిది ఇళ్లే వంటివి వీటిల్లో ఉన్నాయి. శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటెల్ దౌత్య భవనాలు కూడా అమెరికా స్వాధీనం చేసుకుంది.

# యుద్ధకాలంనాటి సమస్యలన్నీ పరిష్కరించండి

## పాక్ ప్రధాని షరీఫ్‌తో బంగ్లా కేర్‌టేకర్ చీఫ్ యూనస్



**కైరో, డిసెంబరు 20:** పాకిస్తాన్‌తో తమ దేశానికి ఉన్న 1971నాటి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని బంగ్లాదేశ్ కేర్‌టేకర్ ప్రధాని మహ్మద్ యూనస్ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు స్పష్టం చేసారు. ఒకప్పుడు ఒకే దేశంగా ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లు 1971యుద్ధంతో బంగ్లా ప్రత్యేక దేశంగా విడిపోయింది. అప్పటినుంచి భారత్‌తో సత్సంబంధాలు నెరపుతున్న బంగ్లాదేశ్ హటాత్తుగా విద్యార్థి రిజర్వేషన్ల ఉద్యమంతో ఇపుడు హసీనా ప్రభుత్వాన్ని గద్దెదించి పాకిస్తాన్‌కు చేరువ అయ్యేందుకు తహతహలాడుతోంది. ఈక్రమంలోనే పాక్ ప్రధానితో భేటీ అయిన యూనస్ ఆనాటినుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. బంగ్లాదేశ్ ఇపుడు భారత్‌తో సంబంధాలను కొనసాగించలేని స్థితిలో ఉంది. గత ఏడాది ఆగస్టులో కొనసాగిన విద్యార్థి విప్లవం హసీనాను గద్దెదించడం, ఆ పై ఎక్కడో ఆశ్రయం పొందుతున్న యూనస్‌కు బాధ్యతలు అప్పగించడం వంటివి జరిగిన సంగతి తెలిసిందే ఈజిప్టులో జరిగిన ఒక సదస్సులో పాక్‌ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో యూనస్ భేటీ అయ్యారు. 1971నాటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఈసమస్యలు పదేపదే మళ్లీ ఎదురవుతున్నాయని యూనస్ షరీఫ్‌కు చెప్పారు. మరింతముందుకు వెళ్లేందుకు వీలుగా ముందు ఆ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాక్ ప్రధాని షరీఫ్ కూడా యూనస్‌తో అత్యంత సామరస్యపూర్వకమైన చర్చలు జరిగాయని వెల్లడించారు. రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక బహుపాక్షిక సహకారం మరింత పెంచుకోవాలన్న నిర్ణయంతో ఉన్నట్లు సోషల్‌మీడియా ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. వాణిజ్యం, క్రీడలు, సాంస్కృతిక బృందాలను పంపించుకోవడం వంటి వాటితో రెండువైపులా సంబంధాలు పెంచాలని భావిస్తున్నట్లు యూనస్ కార్యాలయం ప్రకటించింది. గత నెలలోనే మొట్టమొదటి కార్గోనౌక పాకిస్థాన్‌నుంచి బంగ్లాదేశ్‌కు విజయవంతంగా వెళ్లింది. చిట్టగాంగ్ ఓడరేవులో కంటైనర్లను అన్‌లోడ్ చేసింది. ఎనిమిదిముస్లింమెజార్టీ జనాభా ఉన్న దేశాలు డి-8 దేశాల కూటమిగా ఆవిర్భవించాయి. ఈ దేశాలమధ్య ఆర్థికపరస్పర సహకారం కోసం ఈకూటమి ప్రారంభం అయింది. సార్క్‌దేశాలతోకూడా తమ సంబంధాలను పునరుద్ధరించుకోవాలనుకుం టున్నట్లు యూనస్ తెలిపారు. పాకిస్థాన్ ఇండియాలమధ్య పెద్ద ఎత్తున వాగ్వాదాల వల్లనే తమ సంబంధాలు నిలిచిపోయాయన్నారు. వెంటనే సార్క్ నేతలతో సమావేశం నిర్వహించాలని, కనీసం ఒక ఫోటో సెషన్‌గా జరిగినా అది శక్తివంతమైన సందేశం ప్రజల్లోకి వెళ్లినట్లవుతుందని యూనస్ అన్నారు.

# సంభాల్ ఎంపిపై రూ.1.91కోట్ల విద్యుత్ జరిమానా

## తండ్రి పైనా మరో కేసు నమోదు



**సంభాల్, డిసెంబరు 20:** యుపిలోని సంభాల్ విద్యుత్‌శాఖ అధికారులు లోక్‌సభ ఎంపి జియా ఉర్ రెహమాన్‌పై 1.91 కోట్ల జరిమానా విధించారు. అంతేకాకుండా ఆయన నివాసానికి విద్యుత్‌కనెక్షన్‌ను కూడా కట్‌చేసారు. అక్రమంగా చట్టవిరుద్ధంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డారని ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. ముందురోజే సమాజ్‌వాది ఎంపిపై విద్యుత్‌చట్టం 135 పరిధిలో ఆయనపై కేసు నమోదుచేసారు. ఆయన తండ్రి మామ్లుకుర్ రెహమాన్ బార్క్‌పైనా విద్యుత్ అధికారులు కేసులు నమోదు చేసారు. దీపాసారాయ్ ప్రాంతంలో ఆయన నివాసంలో విద్యుత్ అధికారులు తనిఖీలు చేస్తుండగా వారిని బెదిరించారని కేసులు నమోదయ్యాయి. సంభాల్‌లో శుక్రవారం కూడా విద్యుత్ తనిఖీలు కొనసాగాయి. ఎంపిపై ప్రత్యేకించి 1.91 కోట్లు జరిమానా విధించారు. ఆయన నివాసానికి విద్యుత్ కనెక్షన్‌ను కూడా కట్ చేసినట్లు సంభాల్ ఎస్‌ఇ వినోద్‌కుమార్ తెలిపారు. మీటర్‌ను బైపాస్‌చేసి విద్యుత్ వినియోగిస్తున్నారని తనిఖీల్లో ఈ విషయం బయటపడిందన్నారు. సంభాల్ మసీదు సర్వే ఉద్రిక్తతలపరంగా పోలీసులు నమోదు చేసిన కేసుల్లో జియావుర్ రహమాన్‌పైనా కూడా ఒక కేసు ఉంది. కోట్‌గర్వి ప్రాంంలో జమా మసీదును సర్వేచేస్తున్న సమయంలో చెలరేగిన హింసకు సంబంధించి ఈ కేసులు నమోదయ్యాయి. ఆనాటి ఘర్షణల్లో నలుగురు చనిపోయిన సంగతి తెలిసిందే. సంభాల్ ఎస్పీ కృష్ణకుమార్ బిష్ణోయ్ మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ శాఖకు చెందిన సంతోష్ త్రిపాఠిని ఈప్రాంతంలో విద్యుత్ తనిఖీలు చేయాలని ఆదేశించారని, ఎంపి నివాసం తనిఖీ సమయంలో రెహమాన్ తండ్రి మామ్లుకుర్ రెహమాన్ బార్క్ ఇంజనీర్లు అజయ్‌కుమార్ శర్మ, వికె గంగాల్‌లను దూషించారని, విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈ సంఘటన మొత్తం విడియో రికార్డింగ్ జరిగిందని తెలిపారు. నఖాసా పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసారు. బార్క్ తోపాటు మరో ఇద్దరు వాసిమ్, సల్మాన్‌లపై కేసులు నమోదయ్యాయి. రెండు రోజుల తర్వాత ఎంపి నివాసంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేసారు. గడచిన ఆరునెలల్లో మీటర్లు జీరో యూనిట్ వినియోగాన్ని చూపిస్తున్నట్లు అనుమానం రావడంతో వాటిపై తనిఖీలు చేసారన్నారు. 16.48 కిలోవాట్ లోడ్ ఉన్నట్లు గుర్తించారు. రెండు మీటర్లను ల్యాబ్‌కు పంపించామని, ఎంఆర్‌ఐ పరీక్షలో ఈ మీటర్లను ట్యాంపరింగ్ చేసారన్నారు. తనిఖీల్లో తమను ఎంపి తండ్రి బెదిరించారని అన్నారు.

# నా మనవడిని నాకు అప్పగించండి: సుప్రీంను ఆశ్రయించిన అతుల్ తల్లి

**న్యూఢిల్లీ, డిసెంబరు 20:** తన ఆత్మహత్యకు గల కారణాలను వివరిస్తూ 40 పేజీల లేఖరాసి మరీ ఆత్మహత్యచేసుకున్న బెంగళూరు టెక్కీ తల్లి ఇపుడు తన మనవడికోసం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నాలుగేళ్ల తన మనవడి బాగోగులు తానే చూసుకుంటానని చెపుతూ అంజుమోడీ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుచేసింది. ఇప్పటికీ తన మనవడి ఆచూకీ తనకు తెలియనీయడంలేదని సుభాష్‌తో విడాకులు తీసుకున్న భార్య నికితా సింఘానియా కానీ ఆమె కుటుంబసభ్యులు కాని ఎవ్వరూ చెప్పడంలేదని ఆమె వాపోయింది. అయితే మాజీ భార్యతోపాటు అత్త బావమరిదిలను కూడా అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. ఫరీదాబాద్ బోర్డింగ్ స్కూలులో చేర్పించామని నికితా పోలీసులకు తెలిపింది. ఆమె మామ సుశీల్ సింఘానియావద్ద ఉన్నాడని చెప్పిన సింఘానియా వాస్తవం కాదని తేలింది. సుశీల్ ఈమె చెప్పిన వివరాలను తిరస్కరించారు. బాలుడి వివరాలు తనకు తెలియవని వివరించారు. జస్టిస్ బివినాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన బెంచ్ యుపి, హర్యానా, కర్ణాటక ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసి





స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. వచ్చే జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. ఈకేసులో ఇప్పటికే అనేకమందిని అరెస్టు చేసారు. నిఖితా సింఘానియాతోపాటు ఆమె తల్లి నిషా సింఘానియా, సోదరుడు అనురాగ్ సింఘానియాలను ఈనెల 16వ తేదీ కర్ణాటక పోలీసులు అరెస్టు చేసారు. స్యూసైడ్‌నోట్, విడియోలు ఆధారంగా వీరిని అరెస్టుచేసారు. వారు ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. ఇపుడు అతుల్ తల్లి అంజుమోడి దాఖలు చేసిన పిటిషన్ మేరకు సింఘానియా కుటుంబం బాలుడి వివరాలు తెలియకుండా చేస్తోందని ఆరోపించారు. సుభాష్ తండ్రి పవన్‌కుమార్ కూడా బాలుడు తమ కస్టడీలోనే ఉండాలని డిమాండ్ చేసారు. ఈలోపు నికిత కుటుంబం ముందస్తు బెయిల్‌కోసం చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. 69 ఏళ్ల తనకు ఆరోగ్యపరిస్థితి సక్రమంగా లేదని, తనపై ఆరోపణలు భూతద్దంలో పెద్దవిచేసి చూపిస్తున్నారని న్యాయవాది మనిష్ తివారి వాదించారు. జస్టిస్ అశుతోష్ శ్రీవాస్తవ సుశీల్ ముందస్తు బెయిల్ మంజూరుచేస్తూ కఠినమైన షరతులు విధించారు.

రూ.50 వేల పూచికత్తుతోపాటు పోలీస్ విచారణకు అందుబాటులో ఉండాలని, పాస్‌పోర్టునున అందచేయాలని ఆదేశించింది. సుభాష్ కుటుంబం తన వాదనల్లో నికితా ఆమె కుటుంబసభ్యులు తప్పుడు కేసులతో వేధించారని, సొమ్ములు దండుకున్నారని ఆరోపించారు. సుభాష్ తండ్రి పవన్‌కుమార్, సోదరుడు వికాస్ కుమార్‌లు మాట్లాడుతూ తమకు న్యాయం జరిగేంతవరకూ తమ బిడ్డ అస్తికలను కూడా నిమజ్జనం చేయమని ప్రకటించారు. తమపై నమోదుచేసిన తప్పుడు కేసులన్నీ విత్‌డ్రా అయ్యేంతవరకూ తమకు న్యాయం జరగదని, మా పోరాటం కొనసాగుతుందని బికాస కుమార్ అన్నారు. ఇపుడు ఆబాలుడి భద్రతపై కుటుంబం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# రెండు ట్రక్కులు ఢీ: 11 మంది మృతి

## సుమారు 40 మందికిపైగా తీవ్ర గాయాలు

**జైపూర్, డిసెంబరు 20:** నగరంలోని ఒక పెట్రోలు పంపు బయట రెండు ట్రక్కులు ఢీకొన్న ప్రమాదంలో 11 మంది చనిపోగా మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. అజ్మీర్ రోడ్డులోని పెట్రోలు పంపువద్ద ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం సంభవించింది. సిఎన్‌జి ట్యాంకర్ పెట్రోలు పంపు వద్ద పార్క్ చేసి ఉండగా మరోట్రక్కు వచ్చిన ఢీకొనడంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఫైర్ అధికారుల వివ రాలప్రకారం 40 మందికిపైగా తీవ్ర గాయాల పాలయ్యారని, వీరిలో 28 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. ముందు మంటలను అదుపులోకి తెచ్చి పరిస్థితిని సాధారణ స్థితికి తెస్తున్నట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. బాధితులందరినీ ఆసుపత్రులకు తరలించారు. 300 మీటర్ల పరిధిలో ఉన్న వాహనాలకు కూడా ఈ మంటలు వ్యాపించాయి. ఇవన్నీ కూడా పూర్తిగా కాలిపోయాయి. అనేకమంది డ్రైవర్లకు కూడా కాలిన గాయాలతో ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో కొందరిపరిస్థితి విషమంగా ఉంది. ఎగిసిపడిన మంటలతోపాటు దట్టమైన నల్లటిపొగ ఆ ప్రాంతం మొత్తం చుట్టుముట్టింది. స్థానికుల కథనం ప్రకారం ఈ పేలుడు సుమారు పది కిలో మీటర్లవరకూ విస్తరించిందని వెనువెంటనే మరికొన్ని పేలుళ్ల శబ్దాలు కూడా వినిపించాయని, వీటిలో ఎక్కువ ఇంధన ట్రక్కులే ఉన్నట్లు తెలిపారు. కాగా ఢీకొన్న ట్రక్కుతోపాటు మిగిలిన ట్యాంకర్లలో కూడా రసాయనాలు నింపి ఉన్నట్లు ఎస్‌హెచ్‌ఒ మనిష్‌గుప్తా వెల్లడించారు. ఈ



ప్రమాదంలో దగ్ధం అయిన వాహనాల సంఖ్య ఇప్పటికీ ఇదమిద్ధంగా తెలియడంలేదని భాంక్రోటా ఎస్‌హెచ్‌ఒ తెలిపారు. రాజస్థాన్‌ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ, ప్రధానిమోడీలు వెంటనే స్పందించారు. పిఎం తన సహాయనిధినుంచి రెండులక్షలరూపాయలు మృతుల కుటుంబాలకు, గాయపడినవారికి 50 వేల వంతున పరిహారంప్రకటించారు. ప్రమాదం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తంచేసిన ప్రధాని క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మకూడా ప్రమాదంపట్ల సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ ఆసుపత్రుల్లోని బాధితులను పరామర్శించారు. స్థానిక యంత్రాంగం అత్యవసర సర్వీసులన్నింటినీ ఈ ప్రమాదం కోసమే వినియోగించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రితో మాట్లాడి పరిస్థితిపై ఆరాతీసారు.

# అల్లుడిపై మామ యాసిడ్ దాడి



**థాణె, డిసెంబరు 20:** హనీమూన్‌కు ఎక్కడికి వెళ్లాలనే అంశంపై కొత్త అల్లుడితో గొడవ పడ్డ ఒక మామ తీవ్రస్థాయిలో స్పందించాడు. అల్లుడి ఇంటివద్ద కాపుకాచి యాసిడ్ దాడి చేసాడు. మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో జరిగిన ఈ ఘటనలో అల్లుడు ఆసుపత్రిలో చేరగా మామ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అసలేం జరిగిందంటే థాణె జిల్లా కల్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న జకీగులామ్‌ముర్తజా ఖోటాల్(65) ఇటీవల తన కుమార్తెను ఇబాద్ అతీక్ ఫాల్కే(29)కి ఇచ్చి వివాహం చేసాడు. హనీమూన్‌వెళ్లేవిషయమై మామా అల్లుళ్లమధ్య వివాదం రేగింది. కాశ్మీర్‌కు వెళతామని ఫాల్కే చెప్పగా వద్దు విదేశాల్లోని ఆధ్యాత్మిక ప్రాంతాలకు వెళ్లాలని ఖోటాల్ సూచించాడు. ఈ విషయమై ఇద్దరిమధ్య మాటామాటా పెరిగింది. ఘర్షణ పెద్దదవుతుండటంతో ఇంట్లోవాళ్లు జోక్యం చేసుకున్నారు. దీనితో ఖోటాల్ తాత్కాలికంగా వెనక్కి తగ్గాడు. అయితే ఖోటాల్‌కు అల్లుడిపై కోపం మాత్రం తగ్గలేదు. సాయంత్రం యాసిడ్ ను సంపాదించి అల్లుడి ఇంటి దగ్గర కాపుకాచాడు. తన కారులో కూర్చుని అల్లుడు వచ్చే వరకూ ఎదురు చూసాడు. ఆఫీసునుంచి ఇంటికి చేరుకున్న ఫాల్కే రోడ్డుపక్కన తన స్కూటర్‌ను పార్క్‌చేసి ఇంట్లోకి వెళుతుండగా ఖోటాల్ సడెన్‌గా ఎదురువచ్చి యాసిడ్ చల్లిపారిపోయాడు. చుట్టు పక్కలవాళ్లు ఫాల్కేను ఆసుపత్రికి తర లించారు. ఈ ఘటనపై ఫాల్కే కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఖోటాల్ కోసం గాలిస్తున్నారు.

# క్రిప్టో కరెన్సీని దోచేస్తున్న ఉత్తర కొరియా హ్యాకర్లు

## సగానికి పైగా వీరే మాయం చేశారని వెల్లడించిన చైనాలసిస్ పరిశోధన గణాంకాలు



**ప్యాంగ్యాంగ్, డిసెంబరు 20:** ఉత్తర కొరియాకు చెందిన హ్యాకర్లు క్రిప్టో కరెన్సీని దోచేస్తున్నారు. ఈ యేడాది మొత్తం 2.2 బిలియన్ డాలర్ల క్రిప్టోలు దొంగతనానికి గురికాగా, వీటిల్లో సగానికి పైగా ఉత్తరకొరియాకు చెందినవారే మాయం చేసినట్లు చైనాలసిస్ అనే సంస్థ పరిశోధన గణాంకాలు చెబుతున్నాయి. ప్యాంగ్‌యాంగ్‌కు చేరిన మొత్తం 1.3 బిలియన్ డాలర్లు ఉంటుందని ఇది పేర్కొంది. చాలామంది రిమోట్ ఐటి ఉద్యోగుల ముసుగులో క్రిప్టో, ఇతర టెక్నాలజీ సంస్థల్లోకి చొరబడుతున్నట్లు వెల్లడించింది. ఇక గతేడాదితో పోలిస్తే క్రిప్టోల చోరీ 21 శాతం వృద్ధి చెందింది. కానీ 2021,22 మధ్యకాలంలో జరిగిన చోరీలతో పోలిస్తే మాత్రం కొంత తక్కువగానే ఉంది. క్రిప్టో ప్లాట్‌ఫాంలపై వినియోగదారులు వాడే ప్రైవేటు కీలోని లోపాల కారణంగానే ఇది చోటు చేసుకుంది. ముఖ్యంగా కేంద్రీకృత ఎక్స్ఛేంజీలు భారీ మొత్తంలో నిధులను నిర్వహిస్తుండటంతో వీటిపై ప్రైవేట్ కీలు ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. ఈ యేడాది జపాన్‌లోని ఎక్స్ఛేంజీ బిఎంఎం బిట్‌కాయిన్‌లో జరిగిన 300 మిలియన్ డాలర్ల విలువైన హ్యాకింగ్ అతి తీవ్రమైంది. ఒక భారత్‌లోని మరో క్రిప్టో ఎక్స్ఛేంజీలో 253 మిలియన్ డాలర్ల విలువైన సొమ్మును దారి మళ్లించారు. ఉత్తరకొరియా ఈ రకమైన దొంగతనాలకు అడ్డాగా మారిందని అమెరికా ప్రభుత్వం పేర్కొంది. ఈ యేడాది అమెరికాలోని 14 మంది ఉత్తరకొరియా వాసులు అమెరికా కంపెనీల నుంచి నిధులను ప్యాంగ్ యాంగ్‌లో ఆయుధ కొనుగోళ్లకు మళ్లించినట్లు సెయింట్ లూయిస్ న్యాయ స్థానం తేల్చింది. ఈ క్రిప్టో స్కాంలకు సంబంధించి ఎవరైనా సమాచారం ఇస్తే 5 మిలియన్ డాలర్లు నజరానా ఇస్తానని అమెరికా ప్రభుత్వం ఇటీవలె ప్రకటిం చింది. ఓ వైపు అమెరికాలో ట్రంప్ రాకతో బిట్‌కాయిన్ ధర లక్ష డాలర్లు దాటేసిన ఈ నివేదిక ఆందోళనకరంగా మారింది. అమెరికాలో క్రిప్టో అనుకూల చట్టాలు వస్తాయని బలంగా ప్రచారం జరుగుతోంది. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ చైర్మన్‌గా పాల్ అట్కిన్‌కు ట్రంప్ బాధ్యతలు అప్పగించడం వంటివి కలిసొచ్చాయి.

## రాయ్‌గఢ్‌లో బస్సు ప్రమాదం: ఐదుగురు మృతి, 27 మందికి గాయాలు



**రాయ్‌గఢ్, డిసెంబరు 20:** మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ హైవేపై ప్రయాణీకులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి బోల్తాపడటంతో ఐదుగురు స్పాట్‌లోనే చనిపోగా మరో 27 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటుబస్సు స్టీరింగ్ అదుపు తప్పడంతో ఒక్కసారిగా బస్సు బోల్తా పడింది. మృతుల్లో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. జాదవ్‌కుటుంబానికి చెందిన వారు పూణెలోనిలోహేగాంవ్ నుంచి మహద్‌లోని బిర్‌వాడికి పెళ్లికి వెళుతున్నారు. మృతులను సంగీతా జాదవ్, గౌరవ్ దరాడే, శిల్పా పవార్, వందనా జాదవ్, మరొక గుర్తుతెలీని పురుషుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాయ్‌గడ్ ఎస్పీ సోమ్‌నాథ్ ఘార్గే మాట్లాడుతూ ఉదయం తొమ్మిదిన్నర గంటలకు పర్పుల్‌ట్రావెల్స్ ప్రైవేటు బస్సు ఈ ప్రమాదానికి లోనయిందని, తమ్హిని ఘాట్ ప్రాంతంలో జరిగిన ఈప్రమాదంలో 27 మందికి గాయాలయ్యాయని వారిని మాన్‌గాంవ్ గ్రామీణ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదుచేసామని, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే ఈప్రమాదంజరిగినట్లు భావిస్తున్నామని చెప్పారు.

21-12Pg6exHMNWJQE.qxd:21-12Pg6exHMNWJQE.qxd 01/01/01 9:22 AM Page 1



# 1.14% మందికి ప్రాథమిక స్థాయిలో క్యాన్సర్

**విజయవాడ డిసెంబర్ 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటికి క్యాన్సర్ వ్యాధులను గుర్తించే సర్వే నిర్వహిస్తోంది. దాదాపు ప్రతి కుటుంబసభ్యుని స్క్రీనింగ్ టెస్ట్ చేస్తోంది. ఆధునీక పద్ధతుల్లోను వ్యాధి నిర్ధారణ చర్యలు తీసుకుంది. ఒక వేళ వ్యాధిని గుర్తిస్తే వెంటనే చికిత్స చర్యలు చేనట్టింది. ఈ క్రమంలో క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సర్వేలో ఇప్పటివరకు 1.14% అనుమానిత కేసులు బయటపడ్డాయి. గత నెల 14 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 30.27 లక్షల మందిని పరీక్షించగా వారిలో 34653 మందిలో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రంలో 18 ఏళ్ల దాటిన వారు 4 కోట్ల మంది ఉన్నారు. వీరిలో మహిళలు 2 కోట్ల మంది. 18 ఏళ్ల దాటిన యువతులకు రొమ్ముక్యాన్సర్ స్వీయపరీక్షపై అవగాహన కల్పిస్తున్నారు. 30 ఏళ్లదాటిన మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. మలివిడత పరీక్షల్లో పీహెచ్‌సీ వైద్యులు క్యాన్సర్ కేసులను గుర్తిస్తారు. రాష్ట్రంలో ఏటా 73 వేల కొత్త క్యాన్సర్ కేసులు, 40 వేల వరకు మరణాలు సంభవిస్తున్నాయి. దేశంలో ఇలా ఇంటింటి సర్వేతో క్యాన్సర్ లక్షణాలు గుర్తిస్తున్న మొదటి రాష్ట్ర ఏపీనే కావడం గమనార్హం. జీవనశైలి వ్యాధుల సర్వే- 3 క్రింద ప్రతి ఒంటికీ ఏఎన్ఎం సీహెచ్ఓవలు వెళ్లి వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన ప్రశ్నావళి ద్వారా బీపీ, మధుమేహం, కిడ్నీ , టీబీ కుష్ఠ, ఇతర వ్యాధుల వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వేలో క్యాన్సర్ లక్షణాలు కలిగినవారిని ఇంటివద్దే పరీక్షిస్తున్నారు. అత్యధికంగా మహిళల్లో గర్భాశయ ముఖద్వారా ఓరల్ బ్రెస్ట్ క్యాన్సర్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ కేసులు ఆందోళన కలిగిస్తున్నందున 18 ఏళ్ల దాటిన మహిళల్లో ఓరల్ బ్రెస్ట్ సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఎలా గుర్తించాలన్న దానిపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. టార్చిలైట్ ద్వారా నోటి లోపల భాగాన్ని పరిశీలిస్తున్నారు. ఈ పరీక్షను పురుషులకూ చేస్తున్నారు. సేకరించిన వివరాల అధారంగా మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ పరీక్షను పీహెసీల్లో చేస్తున్నారు. రొమ్ము చర్మం రంగు మారిందా? రొమ్ముల పరిమాణంలో ఏవైనా తోడాలున్నాయి? కణితులు ఉన్నాయా? లేవా అని పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రెండుసార్లుజీవనశైలి వ్యాధులపై సర్వే చేశారు. ఈసారి అదనంగా క్యాన్సర్ పరీక్షలను చేర్చారు.

వైద్యులకు విశాఖలోని హోమీబాబా క్యాన్సర్ నిపుణులు శిక్షణ ఇచ్చారు. వీరి దగ్గర శిక్షణ పొందినవారు మిగిలినవారికి శిక్షణ ఇచ్చారు. పట్టణాలు, గ్రామాల్లో కలిపి 15 వేల బృందాలు పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్నాయి. ఈ పరీక్షలు ఇంటికి వచ్చి చేస్తున్నందున ఎవ్వరు వ్యతిరేకించవద్దని స్క్రీనింగ్ చేయించుకోవాలని ప్రభుత్వం కోరుతుంది.




'జాతీయస్థాయిలో ప్రఖ్యాత శిఖర్ పురస్కార అవార్డును అందుకుంటున్న కార్తీక్ అమరనేని

# జాతీయస్థాయిలో ప్రఖ్యాత శిఖర్ పురస్కార అవార్డు

## చైతన్య కార్తీక్‌కు ప్రదానం

**విజయవాడ,డిసెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి::** దేశంలోనే ప్రఖ్యాత అడ్మిషన్స్ ఆరో సంస్థ ఆధ్వర్యంలో ఐఐటి, ఎన్ఐటి సీట్ల సాధనలో ముందుండే ప్రఖ్యాత విద్యాసంస్థలకు ఇచ్చే ప్రైడ్ అవార్డుకు నందిగామ చైతన్య ఐఐటి అకాడమీ ఎంపికైంది. విజయవాడలో అత్యంత భారీ స్థాయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కార్తీక్ అమరనేని , శాంతి ప్రత్యూషలకు శాసనసభ్యుడు గద్దె రామ్మోహన్ గారి చేతుల మీదుగా అవార్డు అందుజేసారు. ఈ సందర్భంగా సంస్థ వారు మాట్లాడుతూ నందిగామ లోనే కాకుండా రాష్ట్రస్థాయిలోనే ఎన్ఐటి ఐఐటి సీట్ల సాధనలో చైతన్య ఐఐటి అకాడమీ ముందువరుసలో ఉందని, ఎన్నో గణాంకాల ఆధారంగా చైతన్య ఐఐటి అకాడమీని ఈ అవార్డుకు ఎంపిక చేసామని తెలియజేశారు. అవార్డు గ్రహీత కార్తీక్ అమరనేని మాట్లాడుతూ గ్రామీణ స్థాయి అయిన నందిగామలో ఐఐటి, ఎన్ఐటి, నీట్ సీట్ల సాధన కొరకు ప్రారంభించబడిన చైతన్య ఐఐటి నీట్ అకాడమీ ఈ ప్రఖ్యాత అవార్డుని గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉందని దీనికి ప్రధాన కారణం విద్యార్థుల తల్లిదండ్రులు తనపై పెట్టుకున్న నమ్మకం వారి పూర్తి సహాయ సహకారాలే కారణమని అలాగే విద్యార్థుల కఠోర శ్రమ అధ్యాపక బృందం యొక్క సమిష్టి కృషి ఫలితమే ఈ అవార్డు అని అన్నారు. ఈ అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందని రాబోయే రోజుల్లో ఇంతకన్నా మెరుగైన ర్యాంకులు సాధించి మన విద్యార్థులను దేశంలోనే టాప్ పొజిషన్ లో నిలబెట్టడమే ప్రధాన లక్ష్యం అని, దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహం మరింత కావాలని కోరారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తూ గత తొమ్మిది సంవత్సరాలుగా దేశంలోనే ప్రతి ఎన్ఐటీల్లో నందిగామ చైతన్య విద్యార్థులు ఉండే విధంగా చేస్తూ వచ్చామని రాబోయే రోజుల్లో ప్రతి ఐఐటీలో నందిగామ చైతన్య విద్యార్థి ఉండే విధంగా ప్రయత్నం చేస్తున్నామని దీనికి విద్యార్థులు తల్లిదండ్రుల సహాయ సహకారాలు కోరుతున్నామని ఆయన అన్నారు. మట్టిలో మాణిక్యాల వెలికితీస్తూ గ్రామీణ విద్యార్థులను జాతీయస్థాయిలో నిలబెట్టడమే తమ ఆకాంక్ష, ఐఐటి, ఎన్ఐటీ సీట్ల సాధనే మా ప్రధాన లక్ష్యమని తెలియజేశారు.

# సిఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పరిశ్రమలు

## - మహిళలు ఆర్థికంగా ఎదగాలి: సిఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి



కుప్పం మండలం వానగుట్టపల్లిలో మహిళలనుద్దేశించి ప్రసంగిస్తున్న భువనేశ్వరి

**కుప్పం, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడుపై నమ్మకం తోనే రాష్ట్రాన్ని పారిశ్రామికవేత్తలు, పరిశ్రమలు వస్తున్నాయని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా శుక్రవారం కుప్పం మండలం వానగుట్టపల్లి, గుండ్లమడుగు, అడవిబూదుగూరు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించి మహిళలు, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలనుద్దేశించి ఆమె ప్రసగ్గఇంచారు. గత వైఎస్సార్సీ పాలనలో రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలు పారిపోయేలా చేశారన్నారు. నేడు సిఎం చంద్రబాబును చూసి ఫుడ్‌ప్రాసెసింగ్, ఇతర పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ రాక్షస పాలనలో అభివృద్ధి ముప్పై ఏళ్ల వెనక్కు వెళ్లిందన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేసి తమ జేబులు నింపుకుని అప్పుల ఊబిలో నెట్టేశారని పేర్కొన్నారు. కనీసం గ్రామాలకు ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రజలకు హామీ ఇస్తే వాటిని తప్పక అమలు చేసే నైజం సిఎం చంద్రబాబుది అని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం చంద్రబాబు కల అని ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నదే ఆయన కోరిక అని తెలిపారు. రాష్ట్రంలో పేదల నోటినుంచి ఆకలి అనే పదం వినబడకూడదనే అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో కరువు అనే మాట ఉండరాదని విజన్ 2047 లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. గత వైఎస్సార్సీ పాలనలో రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడి చేశారన్నారు. మహిళలకు సైతం గంజాయి అలవాటు చేయించి మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన సంఘటనలు వైఎస్సార్సీ పాలనలో చోటు చేసుకున్నాయన్నారు.

రాష్ట్రంలో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు సిఎం చంద్రబాబు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఇందులో హోంమంత్రి అనిత, మంత్రి లోకేష్ సభ్యులుగా ఉన్నారని రాష్ట్రంలో గంజాయిని తప్పక నిర్మూలిస్తారని పేర్కొన్నారు. మహిళలు ఎవరికీ భయపడొద్దు.. ఆర్థికంగా ఎదగండి : మహిళలు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని తమ కుటుంబాల సంతోషం కోసం తమ కాళ్లపై తాము నిలబడాలని నారా భువనేశ్వరి సూచించారు. ప్రభుత్వం పది రూపాయలు ఇస్తే దాన్ని వంద రూపాయలు చేసే దిశగా ఆలోచించి పైకి రావాలని పేర్కొన్నారు.

# భవానీల దీక్ష విరమణకు ఇంద్రకీలాద్రి సిద్ధం



అశోక గజపతిరాజుకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, డిసెంబర్ 20, ప్రభాత'వార్త' :** భవానీ మాలలు విరమణలకోసం దుర్గమ్మవారి ఆలయానికి వచ్చే భక్తజనానికి మెరుగైన సౌకర్యాల కల్పించామని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఒ కెఎస్ రామారావు తెలిపారు. శుక్రవారం భవానీ దీక్షల విరమణలకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర దేవదాయ శాఖ కమీషనర్ ఎస్ సత్యనారాయణతో కలిసి భవానీ దీక్షలకు చేసిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇరుముడి పాయింట్లు, కేశఖండనశాల, క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నప్రసాద వితరణ తదితర ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఇఒ మాట్లాడుతూ కనకదుర్గానగర్‌లోని కౌంటర్లతో పాటు రైల్వేస్టేషన్, బస్టాండ్లలో 3 షిఫ్టుల్లో ప్రసాదాల కౌంటర్లు పనిచేస్తాయని భక్తులకు కావాల్సినన్ని ప్రసాదాలు అందాబాటులో వుంచుతామని వివరించారు. అధికారులు, సిబ్బంది అందరూ కమాండ్ కంట్రోల్‌రూం నుండి వచ్చే సమాచారం మేరకు చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం దుర్గమ్మ ఆలయం యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. దర్శనాల క్యూలైన్లు, మంచినీటి పంపిణీ, మాలవిరమణలకు సంబంధించిన ఏర్పాట్లు, కేశఖండనశాలలు, చెప్పుల స్టాండ్‌లు, క్లోక్‌రూంలు, ఫస్ట్‌ఎయిడ్, రవాణా సౌకర్యాలు, ప్రసాదాల కౌంటర్లు, పూజావి ధానాలు, పార్కింగ్, అత్యవసర ఫోన్ నెంబర్లు, స్నానాల ఏర్పాట్లు అన్ని పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు సమాచా రం అందించడానికి ప్రతిచోట సూచిక బోర్డులు ఏర్పాటు చేసామ న్నారు. కార్యక్రమంలో డిప్యూటి ఇఒ ఎం రత్నరాజు, ఆలయ ఇంజనీరింగ్, వైదిక కమిటీ, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దుర్గమ్మవారికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించిన అనంతరం 21వ తేదీన భక్తులను దుర్గమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని ఇఒ తెలిపారు. ఈనెల 21 నుండి 25 వరకు జరిగే భవానీ దీక్షల విరమణలకు సంబంధించిన ఏర్పాట్లనీ పకడ్బందీగా చేస్తున్నామన్నారు. 22 వ తేదీ నుండి ఉదయం 3 గంటల నుండి రాత్రి 11గంటల వరకు దుర్గమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని క్యూలైన్లు ఉచితమేనని, టికెట్లన్నీ రద్దు చేశామన్నారు. అంతరాలయ దర్శనంతో పాటు ఆర్జిత సేవలన్నింటిని నిలిపివేస్తా మన్నారు. దుర్గమ్మ వారిని శుక్రవారం మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక గజపతిరాజు దర్శించు కున్నారు. ఆయనకు దుర్గ మ్మ ప్రసాదం, శేష వస్త్రం, జ్ఞాపికలను అందిం చారు. వేద పండితులు వేదాశీర్వ చనాలు పలికారు. దుర్గ మ్మ వారికి విజయ వాడకు చెందిన వేమూరి వేంకట విశ్వనాథ్ బృందం శుక్ర వారం భక్తిసంగీత నీరాజ నాలర్పించి భక్తుల మన్ననలందుకున్నారు. వాతాపి గణపతి, కామాక్షి సరస్వతి, మరకతవల్లీ, సుందరీ నీ దివ్య రూపం, మాతంగి, మహాలక్ష్మి కరుణ వంటి భక్తి గీతాలను హృద్యంగా ఆలపించి నీరాజనాలర్పించారు.

# సంచలన కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ కోర్టు

## - న్యాయశాఖ మంత్రి ఎండి ఫరూక్, హోం మంత్రి అనిత వంగలపూడి



హాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరు పై ముఖ్య అధికారులతో మంత్రులు

**విజయవాడ,డిసెంబరు 20,ప్రభాత వార్తప్రతి నిధి:** పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టిపోలీస్, న్యాయశాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఫాస్ట్ ట్రాక్, ప్రత్యేక కోర్టులపై న్యాయశాఖ మంత్రి ఎండీ ఫరూక్, హోం మంత్రి అనిత వంగలపూడి స్పష్టం చేసారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరు పై ముఖ్య అధికారులతో మంత్రులు సమీక్ష చేశారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న వివిధ రకాల కోర్టు కేసుల పరిష్కారంపై న్యాయశాఖ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర న్యాయ, మైనారిటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు ఫరూక్, అనిత మాట్లాడారు. కేసుల తీవ్రతను బట్టి, ఏ ఉద్దేశ్యంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టులు పనిచేస్తున్నాయో అందుకు అనుగుణంగా ఆయా కోర్టుల్లోని కేసులు ఎక్కువ కాలం కొనసాగకుండా వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేటట్లుగా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అవసరమైతే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశానుసారం సమన్వయం తో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా సంచలన కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయ పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ కోర్టు, ప్రత్యేక కోర్టులు మరింత వేగంగా పనిచేయాలని సూచించడం జరిగింది. సమీక్ష సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి జి ప్రతిభా దేవి, హోం శాఖ కార్యదర్శి తదితర ముఖ్యమైన అధికార బృందం పాల్గొన్నారు. విజయవాడలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 23వ తేదీన ప్రభుత్వం తేనేటి విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. లబ్బీపేట ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్ లో సోమవారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

**తవణంపల్లి, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొనడంతో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని అరగొండ-చిత్తూరు రహదారిలోని ముత్తరపల్లి వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని మైనగుండ్లపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి కుమారుడు హర్ష(17), ముత్తరపల్లి అరుంధతి వాడకు చెందిన సాయితేజ(18)లు చిత్తూరు సీతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరిద్దరు శుక్రవారం ఉదయం మోటర్ సైకిల్‌పై కళాశాలకు ఉదయం 10 గంటలకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ముత్తరపల్లి వద్ద ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను వేగంగా వెళ్ళి బలంగా ఢీకొన్నారు. దీంతో వీరిద్దరు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు తవణంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు సంఘటనా స్థలంలో కన్నీరుమున్నీరుగా విలపించారు.

# పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు ప్రభుత్వానికి రెండు కళ్లు

## మంత్రి వాసంశెట్టి సుభాష్

**విజయవాడ, డిసెంబర్ 20,ప్రభాతవార్తప్ర తినిధి:** కర్మాగారాలలో భద్రతా చర్యలతో పాటు కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్ మరియు వైద్య బీమా సేవల శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం ఫ్యాక్టరీస్ మరియు బాయిలర్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రివర్యులు దిశా నిర్దేశం చేస్తూ.. సదరు శాఖల్లో ఒకే చోట ఏళ్ళ తరబడి పనిచేస్తున్న అధికారులతో పాటు అవినీతి ఆరోపణలు ఎదురుకొంటున్న అధికారులను గుర్తించి లిస్ట్ తయారు చేయాలని ఆదేశించారు. వారిని వీలైనంత త్వరగా బదిలీ చేసే చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రానికి కర్మాగారాల యాజమాన్యాలు మరియు కార్మికులు రెండు కళ్ళు అని, ఫ్యాక్టరీలలో భద్రత సరిగ్గా అమలు అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇకపై ప్రతి మూడు నెలలకొకసారి రివ్యూ మీటింగ్ కండక్ట్ చేస్తానని, తనిఖీలలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని మంత్రి సుభాష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి. చంద్రశేఖర వర్మ, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్, ఉమామహేశ్వరావు మరియు జిల్లా, రీజినల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఇంధన పొదుపులో రాష్ట్రానిదే ప్రథమ స్థానం




ఇంధన పరిరక్షణ అవార్డులు అందుకున్నవారు

**విజయవాడ ,డిసెంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంధన పొదుపు మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని లేకపోతే భవిష్యత్ తరాలకు అంధకారమేనని ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, ఇంధన శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా విజయవాడ పట్టణంలోని ఓ హోటల్ లో శుక్రవారం రాష్ట్ర ఇంధన పరిరక్షణ అవార్డు గ్రహీతలకు అవార్డుల ప్రధానోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎనర్జీ శాఖ జాయింట్ సెక్రటరీ, ఏపీఎస్ఈసీఎం సీఈవో బి.ఏ.వి.పి. కుమార రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె. విజయానంద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మన రాష్ట్రం ఇంధన పొదుపులో ప్రథమ బహుమతి సాధించడం గర్వకారణమన్నారు. వరుసగా మూడో ఏడాది కూడా మన రాష్ట్రం అవార్డు సాధించడంలో అందరి సహకారం, సమన్వయం ఎంతో ఉందన్నారు. ఇలాగే మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గతేడాది జాతీయ స్థాయిలో 83 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచామని, ఈ ఏడాది 87 పాయింట్లు సాధించి మరోసారి మొదటి స్థానం కైవసం చేసుకున్నామని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ వివరించారు. మనం ఒక యూనిట్ ఇంధనం ఆదా చేస్తే ఒక యూనిట్ ఉత్పత్తి చేసినట్టే అని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ అన్నారు. ఇంధన పొదుపుతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇంధన పొదుపుపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదాహరణకు ఇంటి పై భాగంగా కూల్ సర్ఫేస్ పెయింట్ వేస్తే ఇంట్లో వేడి వాతావరణం తగ్గి మార్పు కనిపిస్తుందని తెలిపారు. కర్బన ఉద్గారాల తగ్గింపులో మనందరం భాగస్వాములమవుదామని పిలుపునిచ్చారు. రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తుందని, విజన్2047 లో భాగంగా 5060 శాతం గ్రీన్ ఎనర్జీ రాష్ట్రంగా మనం ముందుకు వెళ్లాలని దిశానిర్ధేశం చేశారు. కరెంట్ ఆదా చేద్దాం.. భావి తరాలకు భరోసానిద్దామని స్పషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ అన్నారు.

# జీసస్ ప్రభోదించిన ప్రేమ, దయ అందరూ అలవర్చుకోవాలి

## - నిర్మలా కళాశాల సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్

**మంగళగిరి,డిసెంబర్ 20,ప్రభాతవార్త :** ఏసుక్రీస్తు ప్రభోదించిన ప్రేమ, దయ, కరుణ అందరూ అలవర్చుకోవాలని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి పరిధిలోని ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాల్లో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి రాకను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతం మంత్రి మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి, అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, సిస్టర్స్ నన్ను కలసినప్పుడు నాకు చిన్నప్పటి పాఠశాల రోజులు గుర్తుకువచ్చాయన్నారు. 2019నుంచి మంగళగిరి లో నా ప్రయాణాన్ని ప్రారంభించాను. అప్పటి ఎన్నికల్లో ఓటమి చెందాను, ఓటమి నుండే పాఠాలు నేర్చుకున్నా, వైఫల్యం విజయానికి సోపానం అందుకు నేనే ఉదాహరణ, దేవుడు ప్రతి ఒక్కరికి శక్తినిస్తాడు, మన గురించి కూడా సమాజం గురించి ఆలోచించాలన్నారు. వందేళ్ళ స్వాతంత్ర భారత్ దిశగా పయనిస్తున్న సమయంలో 2047నాటికి ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. నిర్మల ఫార్మసీ కళాశాల్లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఆద్యంతం అహ్లాదభరిత వాతావరణంలో కొనసాగాయి. కళాశాల ఆవరణలోనికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు నిర్వాహకులు, విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ప్రార్ధనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.




విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అకడమిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల నిర్వాహకులు మంత్రి లోకేష్‌కు దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో ఫాదర్, ఆంధ్ర లయోల కాలేజి వైఈఎస్-జే ఫౌండర్ డైరెక్టర్ బాల బొల్లినేని, రెవ. సిస్టర్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ యు. శౌరీలు, రెవ. సిస్టర్ కళాశాల కరస్పాండెంట్ జి. నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీకి ఆడారి ఆనంద్ కుమార్ రాజీనామా

**విశాఖపట్నం, డిసెంబర్ 20,ప్రభాతవార్త :** వైకాపాకు ఆడారి ఆనంద్ కుమార్ రాజీనామావైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి విశాఖపట్నంకు చెందిన ఆడారి ఆనంద్ కుమార్ తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి శుక్రవారం పంపించారు.

విశాఖ డైరీ అభివృద్ధి కొరకు పూర్తిస్థాయి సమయాన్ని కేటాయించేందుకు ఆడారి ఆనంద్ కుమార్ వైకాపాకు రాజీనామా చేసినట్లు తెలిసింది. ఇదే రీతిలో డైరెక్టర్లుగా కొనసాగుతున్న 9 మంది వైఎస్సార్ పార్టీకి రాజీనామా చేశారు. వీరిలో 1. శరగడం వరాహ వెంకట శంకర్రావు 2. పిల్లా రమా కుమారి 3. శీరంరెడ్డి సూర్యనారాయణ 4. కోళ్ల కాటమయ్య 5. దాడి పవన్ కుమార్ 6. ఆరంగి రమణబాబు 7. చిటికెల రాజకుమారి 8. రెడ్డి రామకృష్ణ 9. సుందరపు ఈశ్వర్ పరదేశి గంగాధర్ లు ఉన్నారు. వీరంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి రాజీనామా పాత్రలు పంపించారు.

# జైలు నుంచి తిరిగి వచ్చిన లగచర్ల రైతులకు బిఆర్ఎస్ నేతల పరామర్శ

## ఫోన్‌లో రైతులు పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

దుద్యాల, డిసెంబరు 20, ప్రభాతవార్త: భూమి కోసం.. భుక్తి కోసం.. జీవనం కోసం అడవులను నమ్ముకుని జీవనం సాగించే గిరిజనుల జోలికి వస్తే ఎంతకైన తెగిస్తామని బీఆర్ఎస్ నాయకుడు నర్సింహానాయక్, గిరిజన సంఘాల నాయకులు రాజేందర్ నాయక్, జైపాల్ నాయక్‌లు అన్నా రు. శుక్రవారం మండల పరిధిలోని రోటిబండ తండా, పులిచర్లకుంట తండా, లగచర్ల గ్రామాలకు చెందిన రైతులు లగచర్ల ఘటనలో నిందుతులుగా 37 రోజులు జైలు శిక్షను అనుభవించి బెయిల్ పై విడుదలైన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ భూముల కోసం పోరాటం చేస్తున్న రైతులను అక్రమంగా అన్యాయంగా అరెస్టు చేసి జైలు పాలు చేశారని అన్నారు. ముఖ్యమంత్రికి ఓట్లు వేసినందుకు గిరిజనులపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. అరెస్టు చేసిన రైతులను పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన 37 మందిలో 10 మంది వారి పొలాల్లో పనుల్లో ఉన్నారని, వారిని కూడ అరెస్టు చేయడం విడ్డురంగా ఉందన్నారు. కోడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సైతం రెతులను ఫోన్లో మాట్లాడి పరామర్శించారు.

21-12P􏰀g7exHMNWJQE.qxd:21-12P􏰀g7exHMNWJQE.qxd 01/01/01 9:19 AM Page 1



# వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలి


వజ్రోత్సవాల మినీయేచర్ పైలాన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉపకులపతితో కలిసి ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణలో పురోగతి సాధించాలి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
### వర్సిటీలో ప్రారంభమైన వజ్రోత్సవాలు
### విశ్వవిద్యాలయం దేశానికి దిక్సూచిగా మారాలి
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్ (అత్తాపూర్) డిసెంబరు 20, ప్రభాతవార్త :** 2047 నాటికి వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలని విశ్వవిద్యాలయం కులపతి, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. భాగస్వాముల అందరితో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణలో పురోగతి సాధించాలని సూచించారు. రాజేంద్రనగర్‌లో రెండు రోజులపాటు జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. రాజేంద్రనగర్ లోని పిజెటిఎయు క్రీడా మైదానంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనల్ని ప్రారంభించి వివిధ స్టాళ్లను పరిశీలిం చారు. తర్వాత ఆడిటోరియంలో వజ్రోత్సవాల మీనియేచర్ పైలాన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పిజెటిఎయు ఉపకులపతి అల్దాస్ జానయ్యతో కలిసి ప్రారంభించారు. కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ గుర్తింపు పత్రాలను అందజేశారు. ఆ తర్వాత గవర్నర్ ప్రసం గిస్తూ 60 యేళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవ సాయ అభివృద్ధికి అనుపమ సేవల్ని అందించిందన్నారు. సోనా మసూరి, తెలంగాణ సోనా వంటి వంగడాలు రూపొందించిందన్నారు. భారతీయ స్టేట్ బ్యాంక్ సహ యంతో విశ్వవిద్యాలయం త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించడం అభినంద నీయమన్నారు.

అనంతరం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కిసాన్ మేళా లోను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ విశ్వవిద్యాలయం భవిష్య త్తులో దేశానికి దిక్సూచిగా మారాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా డిమాండ్ ఉన్న పంటలు, మన నేల స్వభావానికి తగ్గట్లుగా అనువైన పంటలు, అందుకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలను రైతులకు అందించాలని విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకి ఆయన సూచించారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని ఉపయోగించుకుని పరిశోధన, విస్తరణ విద్యల్లో ముందుకెళ్లాలని రానున్న రోజుల్లో వ్యవ సాయ విశ్వవిద్యాలయం మొదటి 10 ర్యాంకుల్లో నిలిచేలా శాస్త్రవేత్తలు పనిచేయాలని అన్నారు.అనంతరం ఈ కిసాన్ మేళా వేదికపై పలువురు రైతులకు అవార్డులను బహూకరించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎపిసి రఘు నందన్‌రావు, కమిషనర్ బి. గోపి, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్ రాజు, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి. రాజి రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, పద్మశ్రీ గ్రహీతలు చింతల వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వర రావు, విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు రఘువర్ధన్‌రెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జమిలి జెపిసిలో తెలంగాణ నుంచి ఎంపి లక్ష్మణ్‌కు స్థానం



**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తీసుకురావాల నుకుంటున్న వన్ నేషన్..వన్ ఎలక్షన్ బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంట్ కమిటీలో తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులు డా.లక్ష్మణ్‌కు స్థానం లభిం చింది. ఏపి నుంచి వైసిపి ఎంపి విజయ సాయిరెడ్డి అవకాశం లభించింది. లోక్ సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది ఉంటారని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయంలో మార్పులు చేస్తూ తాజాగా విడుదల చేసిన బులెటిన్‌లో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఉంటారని ప్రకటించింది. పెరిగిన జెపిసి సభ్యుల జాబితాలో తెలంగాణ నుంచి డాక్టర్ లక్ష్మణ్‌కు స్థానం దక్కింది. లోక్ సభ నుంచి కొత్తగా బిజెపి నుంచి వైజయంత్ పండా(ఒడిశా), సంజయ్ జైశ్వాల్(బిహార్), బోటేలాల్ (యూపి ఎస్సీ), అనిల్ యశ్వంత్ దేశాయ్ (మహారాష్ట్ర, శివసేనయుబిటి), శాంభవి(ఎల్జేపి రాంవిలాస్ బీహార్), కె.రాధాకృష్ణన్ (కేరళ సిపిఎం)లు ఉన్నారు. దీంతో జెపిసిలో బిజెపి సభ్యుల సంఖ్య 12కు చేరింది. అటు రాజ్యసభ నుంచి ఘ్యాన్‌శ్యామ్ తివారీ, భుభానేశ్వర్ కలిత, కె.లక్ష్మణ్, కవిత పటిదార్, సంజయ్‌కుమార్‌జా, రణదీప్‌సింగ్ సుర్జేవాల, ముకుల్ బాలకృష్ణ వాస్నిక్, సాకేతో గోఖలే, పి.విల్సన్, సంజయ్‌సింగ్, మానస్ రంజన్ మంగరాజ్, వి.విజయ సాయిరెడ్డి ఉన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్‌టియు టిఎస్ అభ్యర్థులకే టిజిసిజిటిఎ మద్దతు

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే యేడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ మద్ధతును పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థులకు ప్రకటించింది తెలంగాణ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం(టీజీసీజీటీఏ). మద్ధతు సంబంధించిన లేఖ టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి శుక్రవారం పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డికి అందజేశారు. మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్- ఖమ్మం- నల్గొండ ఎమ్మెల్సీకి పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డికి, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి తమ సంపూర్ణ మద్ధతును తెలుపుతున్నట్టు సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో పీఆర్‌టీయూ టీఎస్ అధికారిక అభ్యర్థులుగా కొనసాగుతున్న శ్రీపాల్‌రెడ్డి, మహేదర్‌రెడ్డిలకి మద్ధతు ఇవ్వాలని సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసిందని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎంపి వి.హనుమంతరావు

## అమిత్‌షాకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు, అరెస్టులు

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 20, ప్రభాతవార్త:** బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, పలు ప్రజా సంఘాలు శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీసభ్యుడు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో అనేకమంది కార్యకర్తలు నిరసన తెలియజేశారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములునాయక్, ఫిషరీస్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రోహిన్‌రెడ్డి, జగదీష్, శ్రీకాంత్‌గౌడ్, మహేశ్వర్ రాజ్, దళిత నాయకులు రాజుఉస్తాద్, కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు అరెస్టు**

ఇదిలా ఉండగా మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో అనేక మంది మహిళలు పెద్ద ఎత్తున నిరసన తెలిపి నాంపల్లిలోని బిజెపి కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళుతుండగా పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేశారు. సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనేక మంది నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చిత్రపటాన్ని చేబూని ఆయన విగ్రహాం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు.

**బిజెవైఎం కార్యకర్తలు నిరసన ప్రదర్శన**

ఇదిలా ఉండగా బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో అనేక మంది కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహాం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు.

## బిల్లులపై చర్చ లేకుండానే శాసనమండలి వాయిదా

### ఇ-కార్ రేస్ అంశంపై చర్చకు పట్టుబట్టిన బిఆర్ఎస్
### అనుమతించని ప్రభుత్వం.. మూడుసార్లు వాయిదా వేసిన ఛైర్మన్ గుత్తా

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో శాసన మండలి సమావేశాల సందర్భంగా ఇప్పటికే నాలుగు బిల్లులను ఆమోదించిన నేపథ్యంలో మరో మూడు బిల్లులను శుక్రవారం సభలో ప్రవేశ పెట్టాల్సి ఉండగా.. బిఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసనతో బిల్లులను ఆమోదించకుండానే సభ శనివారానికి వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగానే.. జీహెచ్‌ఎంసీ సవరణ బిల్లు, పురపాలక సంఘాల సవరణ బిల్లుతోపాటు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. బిల్లులను ప్రవేశ పెట్టకముందే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీ రామా రావుపై ఏసీబీ నమోదు చేసిన ఇ-కార్ రేస్ కేసుపై చర్చించాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. ప్లకార్డులతో వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టారు. ఈ దశలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కలగజేసుకొని బీఏసీలో ప్రస్తావించని అంశాన్ని ఎలా చర్చిస్తారని.. ఇదే అంశాన్ని బీఏసీలో బీఆర్ఎస్ ఎందుకు ప్రస్తావించ లేదని.. ఇప్పుడు ఆ అంశంపై చర్చించాలని పట్టు బట్టడం సభ సమయాన్ని వృధా చేయడమేనని అన్నారు. సభలో బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన విరమిం చకపోవడంతో సభను 15 నిమిషాలు పాటు వాయిదా వేస్తున్నట్టు ఛైర్మన్ ప్రకించారు. అనంతరం సభను తిరిగి ప్రారంభించిన తరువాత కూడా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఈ సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకొని బిఏసిలో ప్రస్తావించని అంశంపై చర్చకు పట్టుబట్టడం సరైంది కాదన్నారు. సభను సజావుగా సాగించేందుకు బీఆర్ఎస్ సహకరించాలని మంత్రి పొన్నం కోరారు. అయినప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనను విరమించకుండా తమ నిరసనను కొనసాగించారు. దీంతో సభను టీ విరామానికి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అనంతరం మధ్యాహ్నం మరోసారి సభను ప్రారంభించిన జీహెచ్‌ఎంసీ సవరణ బిల్లును ప్రవేశ పెట్టాలని మంత్రి శ్రీధర్‌బాబును ఛైర్మన్ ఆదేశించారు. బిల్లు ప్రవేశ పెట్టకముందు మరోసారి బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్లుతో తమ నిరసనను కొనసాగించారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

## కెటిఆర్‌లో పరాకాష్టకు చేరిన అహంకారం

### ఇ-కార్ రేసింగ్ స్కాంలో అక్రమాలపై ఆధారాలున్నాయి
### బిఆర్ఎస్ నేతల దోపిడీతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నది: మహేశ్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటిఆర్ లో అహంకారం పరాకాష్టకు చేరిందనీ, ఆయనపై నమోదైన కేసు సక్రమేనని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మహేష్ గౌడ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అక్రమాలు జరిగినట్టు పలు ఆధారా లున్నాయని ఆయన అన్నారు. కడిగిన ముత్య మంటూ కేటీఆర్ తనకు తానే సర్టిఫికేట్ ఇచ్చు కోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌పై చట్టపరంగా కేసు నమోదు అయినందున ఈవిషయంపై అసెంబ్లీలో కాక కోర్టులో తేల్చుకోవాలని బొమ్మ మహేష్‌కుమార్ సూచించారు. ఫార్ములా ఈ కారు రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని..ప్రభుత్వం పంపిన ఆధారాలపై గవర్నర్ న్యాయసలహా తీసుకొని కేసుకు అనుమతించాక ఇది అక్రమ కేసు ఎలా అవుతుందని? ప్రశ్నించారు. ఆధారాలు కనిపిస్తున్నా అక్రమాలకు పాల్పడలేదని కేటీఆర్ బుకాయించడం విడ్డూరంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరి కాంగ్రెస్ అక్రమంగా కేసులు బనాయించట్లేదని మహేష్ గౌడ్ తెలిపారు. హెచ్‌ఎమ్‌డీఏ భాగస్వామ్యం కాకున్నా, దాని ఖాతా నుండి ఆర్థిక అనుమతులు లేకుండానే రూ.54.88 కోట్లు చెల్లించేలా కేటీఆర్ ఒత్తిడి తెచ్చారని అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు ఎలా చేస్తారని? హద్దుల్లేని కేటీఆర్ అక్రమాలతో అధికారులు బలిపశువులుగా మారారని ఆవేదన వెలిబుచ్చారు. నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో విదేశాల నిధులు బదిలీ చేయడంతో హెచ్‌ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా పన్ను చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. ఈ కార్ రేసింగ్ కి సంబంధించి నిబంధనలను కాదని మూడేళ్లలో రూ.600 కోట్లు చెల్లించేలా ఒప్పందం కేటీఆర్ అనుమతితోనే జరిగిందని టీపీసీసీ చీఫ్ వెల్లడించారు. బిఆర్ఎస్ నేతల దోపిడీతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిందని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. నిబంధనలను అతిక్రమించి ప్రజలను ఇబ్బంది పెట్టడం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజిని పెంచడమని? నిలదీశారు.

## కాళేశ్వరం నుంచి అప్పులు తప్ప నీళ్లు రాలేదు

### డిజైన్ లోపాలతో కుంగిన మేడిగడ్డ
### కాళేశ్వరం విచారణ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పిసి ఘోష్ ఎదుట కోదండరామ్ హాజరు

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** కాళేశ్వరం నుంచి అప్పులు తప్ప నీళ్లు రాలేదని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. శుక్రవారం కాళేశ్వరం విచారణ కమిషన్ ఛైర్మన్ పిసి ఘోష్ ఎదుట హాజరై వాదనలు వినిపించిన టిజెఎస్ అధినేత, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్, టిజెఎస్ నేతలు అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం విచారణ అనంతరం ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్‌కు ఇప్పటికే ఒక అఫిడవిట్ దాఖలు చేసాను, అందులో లోపాలను వివరిస్తూ వాగ్మూలం ఇచ్చానని ఆయన తెలిపారు. అఫిడవిట్‌కు అనుబంధంగా మరొక లేఖను రాశాను, కాళేశ్వరం డిజైన్‌లో అనేక లోపాలు ఉన్నాయని ఆయన వివరించారు. తెలంగాణ మలిదశ ఉద్యమం కంటే ముందే గోదావరి జలాలపై చాలా అధ్యయనం చేశాం. ప్రాణహిత చేవెళ్లను అనేకమంది ఇంజినీర్లు ఆలోచించి డిజైన్ చేసారని ఆయన తెలిపారు. తెలంగాణకు తక్కువ ఖర్చుతో నీళ్లను ఇవ్వడానికి రూపొందించింది ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు. కాళేశ్వరం ప్రాజెక్టును ఇంజినీర్లు వ్యతిరేకించారని ఆయన గుర్తుచేశారు. తుమ్మిడిహట్టి దగ్గర నిర్మాణం చేయాలనే డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని నమ్ముతున్నాను. కాళేశ్వరం పనికిరాదని నిపుణులు కూడా చెప్తున్నారని ఆయన అన్నారు.ఫార్ములా-వన్ రేస్ అంశంలో కేటీఆర్ పై చర్యలు తీసుకోవడం తప్పేం కాదన్న కోదండరాం అన్నారు. తాను కొత్త కారు కొనడంపై వస్తున్న విమర్శలపై కోదండరామ్ స్పందించినారు.

## ఏప్రిల్ 13న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

### 23న నోటిఫికేషన్ జారీ, జనవరి 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలతోపాటు 7 నుంచి 10వ తరగత వరకు మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం నిర్వహించే మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్-2025ను ఏప్రిల్ 13న నిర్వహించనున్నారు. నోటిఫికేషన్‌ను ఈ నెల 23న జారీ చేయనున్నారు. మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు అడిషనల్ డైరెక్టర్ శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 3 నుంచి 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షల నిర్వహణ కేంద్రాలను జిల్లాల్లోని మోడల్ స్కూల్స్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఓసీ అభ్యర్థులకు ఫీజు రూ. 200 కాగా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, ఈడబ్ల్యూఎస్ వారికి రూ. 125గా నిర్ణయించినట్టు షెడ్యూల్‌లో ప్రకటించారు.

## 23న మ్యూజిక్ టీచర్ల సర్టిఫికేషన్ వెరిఫికేషన్

### అభ్యర్థుల అదనపు జాబితా విడుదల

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో మ్యూజిక్ టీచర్ల నియామకం కోసం నిర్వహించిన పరీక్షల్లో భాగంగా ఈనెల 23 న మ్యూజిక్ టీచర్ల సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌ను గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు కొనసాగించనుంది. ఇందుకోసం అభ్యర్థుల అదనపు జాబితాను విడుదల చేయనున్నట్టు ట్రిబ్ ఛైర్మన్ బడుగు సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో మ్యూజిక్ టీచర్ల భర్తీ ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం అభ్యర్థుల అదనపు జాబితా విడుదల చేసి .. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 23న నిర్వహిస్తున్నామని ట్రిబ్ ఛైర్మన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మ్యూజిక్ టీచర్ల పోస్టుల భర్తీ కోసం మాసాబ్ ట్యాంక్ లో ఉన్న డిఎస్ఎస్ భవన్‌లో సర్టిఫికేషన్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో హాజరుకావాలని ప్రకటనలో తెలిపారు.

## 'ధరణి'లో కెసిఆర్ మింగిన రూ.20 లక్షల కోట్లు ఎందుకు కక్కించరు?

### సిబిఐతో విచారణకు కాంగ్రెస్ వెనుకంజకు కారణమేమి?
### లక్కీభాస్కర్ స్టోరీతో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ను కడిగేసిన బిజెపిఎల్‌పి లీడర్ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ధరణిలో కెసిఆర్ అక్రమంగా మింగిన రూ.20 లక్షల కోట్లు కక్కించి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని రాహుల్‌గాంధీ వరంగల్, ఖమ్మం బహిరంగసభల వేదికలపై ప్రకటిచారని అధికారంలో ఉండి ఇప్పుడు ఎందుకు కక్కించడంలేదని బిజెపి ఎల్పి లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిలదీశారు. ఇటీవల తాను చూసిన లక్కీభాస్కర్ సినిమాలోని 'చాక్లెట్' సన్నివేశం అందులో హీరో వైఖరిని మార్చినట్లు మీలో ఏదైనా స్వార్థప్రయోజనం గూడుకట్టుకొందా అని ఆయన నిలదీశారు. రాష్ట్రంలో ధరణి కుంభకోణం అంటు న్నారు ఇంకా ఎన్నో స్కామ్‌లు జరిగాయని భట్టి విక్ర మార్క అంటు న్నారు, మరి వాటిని సిబిఐతో విచారణకు ఎందుకు ఆదేశించడంలేదంటూ మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ధరణి పోర్టల్ వల్లే బిఆర్ఎస్ ఓడిపోయిందని పార్ట్- బిలో ఉన్న 18లక్షల 40వేల ఎకాలు పరిష్కారం జరుగాలంటే లాండ్ టైటిలింగ్ యాక్ట్ ఆచర ణలో పెట్టాలని ఆయన అన్నారు. ధరణి అతిపెద్ద కుంభకోణమని దానివెనుక ఎవరు ఉన్నా వదిలి పెట్టమని రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి అంటు న్నారేకానీ ఎందుకు చర్యలు తీసు కోవడం లేదు దీని వెనుక ఏమైన బ్లాక్‌మెయిల్ దందా ఉందా అని ఆయన ప్రశ్నిం చారు. అసైన్ భూములు లాక్కొన్న గులాబి లీడర్లు ఎవరో కాంగ్రెస్ఇప్పటికి వరకు చెప్పలేదు. కెసిఆర్ పేదల భూములు లాక్కొన్నారని అసైన్డ్ భూములు కొల్లగొట్టారని ఆరోపించారు వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. ల్యాండ్ ట్రిబ్యునల్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ఆయన అడిగారు. సిట్ ఏమైన వేస్తారా అన్యాయానికి గురైన రైతుల వివరాలు ఎందుకు బయటపెట్టడంలేదని ప్రశ్నించారు. ఇందులో ఎంత మందికి న్యాయం చేశారని మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని అడిగారు. ఆయన మాట్లాడుతుంటూ బిఆర్ఎస్‌సభ్యులు పదేపదే అడ్డుపడుతుండటంతో ఏలేటి ఆగ్రహం వ్యక్తంచేశారు చోటాభాయ్ భడేభాయ్ అంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేయడంతో సభను ఆర్డర్ పెట్టాలని కోరారు. బిఆర్ఎస్ నినాదాలు ఎంతకు ఆపకపోవడంతో సభను పదినిమిషాలు సభను స్పీకర్ గడ్డం ప్రసాద్ వాయిదా వేశారు.


ఆటో డ్రైవర్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

## చలో అసెంబ్లీ ప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్ల అరెస్టు

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 20, ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం 'చలో అసెంబ్లీ' ప్రదర్శనకు బయలుదేరిన వందలాది మంది ఆటో డ్రైవర్లను శుక్రవారం హిమాయత్‌నగర్‌లో పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఎఐటియుసి భవన్ నుంచి చలో అసెంబ్లీ ప్రదర్శనకు వెళుతుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భగా పోలీసులు, ఆటో డ్రైవర్ల మధ్య వాగ్వివాదం తొక్కిసలాట జరిగింది. కొంత మంది డ్రైవర్లు రోడ్డు పైన పడుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు బి.వెంకటేశం, నజీర్, వి.మారయ్య, రాంకిషన్, ఎ.సత్తిరెడ్డి, వి.ప్రవీణ్, బిక్షపతియాదవ్, ఎస్.అశోక్, జంగయ్య తదితరులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లుకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# భూభారతి కాదు.. భూహారతి

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభ ఆమోదించిన చట్టం భూ భారతి కాదు భూ హారతి అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతల భూ కబ్జాలకు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు మంగళ హారతి పట్టనుందని విమర్శిం చారు. ఈ మేరకు అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత మీడియా పాయింట్ వద్ద పలువురు ఎమ్మెల్యేలతో కలిసి పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడారు. రైతు, కౌలు రైతు కొట్లాడాలి. కొత్త దుకాణాలు మొదలై భూ భారతితో అవినీతి విచ్చలవిడి అవుతుంది.. కేసీఆర్ తెచ్చిన బ్రహ్మాండమైన చట్టాన్ని నీరు గార్చారు. భూభారతితో రైతుల గుండె దడ మొదలైంది.ఈ చట్టాన్ని బీఆర్ఎస్ తిరస్కరిస్తోంది. రైతులతో కలిసి భూ భారతిపై పోరాటం చేస్తామని పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

**హామీలు మరిపించడానికి కెటిఆర్‌పై తప్పడు కేసు : ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి**

ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్‌రెడ్డి ఆరోపించారు. తమ నాయకులపై తప్పుడు కేసులు పెట్టేందుకు ఎన్నో ఎంక్వయిరీలు చేయించారని, అయినా కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదని విమర్శిం చారు. కేటీఆర్‌పై ఒక చిల్లర కేసు పెట్టారని, తప్పు చేసినట్లయితే శాసన సభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈమేరకు పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, వెధవ వేషాలు వేసినా ప్రజా క్షేత్రంలో, శాసనసభలో నిలదీస్తామనిజగదీష్ రెడ్డి అన్నారు.మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయలేక తమ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కుటుంబం చేస్తున్న అవినీతి బయటపడకుండా ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు.



**అసెంబ్లీ మీడియా పాయింట్**

**మా శాసన సభ్యులకు చెప్పులు చూపించారు : మాజీమంత్రి తలసాని**

సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇచ్చిన హామీలపై చర్చ పెట్టాలి అని కోరాం. మా సీనియర్ నాయ కుడు కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఫార్ములా వన్‌పై చర్చ జరగాలని అన్నాం. మా దళిత శాసనసభ సభ్యులకు చెప్పులు చూపిం చారు. సభ రికార్డులు బయట పెట్టాలన్నారు.

**స్పీకర్ పట్ల వీధిరౌడీల్లా వ్యవహరిస్తున్నారు : పరిగి ఎమ్మెల్యే రామ్మోహాన్‌రెడ్డి**

తెలంగాణ శాసన సభలో దళితుడైన స్పీకర్ పట్ల బి.ఆర్.ఎస్ పార్టీ నేతలు వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఏదో విధంగా సభ నుండి బయటకి రావాలని చూస్తున్నారన్నారు.

**శాసనసభ చరిత్రలో చీకటిరోజు : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**

బీఆర్ఎస్ నేతలు దళిత స్పీకర్ పట్ల అవమానంగా ప్రవర్తించారని ఈరోజు శాసనసభ చరిత్రలో చీకటి రోజు అని నరేకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బిఆర్ఎస్ నేతల వికృతి చేష్టలు చూస్తుంటే తాగి వచ్చారా అని అనిపి స్తుందన్నారు. కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి దళిత వర్గాలపై అహంకారపూరితంగా ఉన్నాయి. మరో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ హారీష్ రావు అందరినీ ఉసిగొల్పి దళితుడైన స్పీకర్ పట్ల చులకన భావంతో ప్రవర్తించారు.రాజ్యాంగం రచించిన అంబేద్కర్‌ని , దళిత స్పీకర్ పట్ల తప్పుగా ప్రవరించినందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హారీష్‌రావు, కౌశిక్‌రెడ్డిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రైతుల నుంచి దోచుకున్న లెక్కలు బయట పడతాయని సభలో ఈరకంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు.

**కెటిఆర్ అరెస్టయితే విధ్వంసం సృష్టించే కుట్ర : ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్**

కేటీఆర్ అరెస్ట్ అయితే ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయాలని,దాడులకు పాల్పడాలని పథకం



రచిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు. కేటీఆర్ ఆత్మ, బినామీ అయిన తేలుకుంట్ల శ్రీధర్ ఈకుట్రలు చేస్తున్నారని నియోజకవర్గానికి కోటి రూపాయలు పంపించి దాడులు చేయించాలని చూస్తున్నారని వీరిపట్ల కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# టెస్ట్ క్రికెట్‌లో వికెట్ల స్పెషలిస్టులు




## టాప్ 10లో బుమ్రా, అశ్విన్, జడేజా



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది మరో పది రోజుల్లో ముగియనుంది. క్రికెట్, ఫ్యాన్స్‌కి ఈ సంవత్సరం అద్భుతమైన ఎంటర్‌టైన్‌మెంట్ అందించింది. ముఖ్యంగా ఏడాది చివరిలో జరుగుతున్న కొన్ని సిరీస్‌లు అభిమానులకు అసలైన టెస్ట్ మ్యాచ్‌ల మజాను పరిచయం చేస్తున్నాయి. కొందరు బౌలర్లు టెస్ట్ మ్యాచుల్లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇలానే టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా టాప్ బౌలర్ ఆఫ్ ది ఇయర్‌గా అవతరించాడు. ఈ ఏడాది అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. 2024లో టెస్ట్ క్రికెట్‌లో ఆధిపత్యం చెలాయించిన టాప్ 10 బౌలర్ల గూర్చి తెలుసుకుంటే ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. భారత స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఈ ఏడాది టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఆడిన 12 మ్యాచుల్లో 58 వికెట్లు పడగొట్టాడు. బుమ్రా మొత్తం 294.4 ఓవర్లు బౌల్ చేశాడు, అత్యుత్తమ గణాంకాలు 6/45గా ఉన్నాయి. తర్వాత స్థానంలో ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ గుస్ అట్కిన్సన్ ఈ ఏడాదిలో 52 వికెట్లతో జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. అట్కిన్సన్ అత్యుత్తమ గణాంకాలు 7/45. ఇక ఇంగ్లండ్‌కు చెందిన యంగ్ ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ కూడా ఈ ఏడాది సంచలన ప్రదర్శనలు చేశాడు. 15 మ్యాచుల్లో 49 వికెట్లు పడగొట్టి మూడో స్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్ రైట్ ఆర్మ్ పేసర్ మ్యాట్ హెన్రీ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఈ ఏడాది మొత్తం 48 వికెట్లు తీశాడు. శ్రీలంకకు చెందిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య ఈ సంవత్సరంలో 48 వికెట్లు సాధించాడు. ఈ లిస్టులో ఐదో స్థానం దక్కించుకున్నాడు. అతడు ఈ ఏడాది ఏకంగా 477 ఓవర్లు బౌలింగ్ చేయడం గమనార్హం.

తాజాగా రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అశ్విన్ ఈ లిస్టులో ఆరో స్థానంలో నిలిచాడు. 11 మ్యాచుల్లో 47 వికెట్లు పడగొట్టాడు. అతడి అత్యుత్తమ గణాంకాలు 6/88గా ఉన్నాయి. మరో భారత స్పిన్నర్ రవీంద్ర జడేజా 11 మ్యాచుల్లో 44 వికెట్లు పడగొట్టాడు. జాబితాలో ఏడో బౌలర్‌గా నిలిచాడు. ఇక శ్రీలంక ఫాస్ట్ బౌలర్ అసిత ఫెర్నాండో కేవలం 9 మ్యాచుల్లోనే 37 వికెట్లు తీశాడు. ఎనిమిదో స్థానంలోఉన్నాడు. అతడిఅత్యుత్తమ గణాంకాలు 5/102గా ఉన్నాయి. న్యూజిలాండ్‌కు చెందిన రైట్ ఆర్మ్ పేసర్ విలియం పీటర్ ఓ రూర్క్ 10 మ్యాచుల్లో 24.80 యావరేజ్‌తో 36 వికెట్లు సాధించాడు. జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. టాప్ 10లో చివరిగా ఆస్ట్రేలియన్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ పదో స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది గాయాలతో ఇబ్బంది పడిన అతడు, కేవలం 7 మ్యాచుల్లో 13.60 యావరేజ్‌తో 35 వికెట్లు పడగొట్టాడు.




## మూడో టి20లో.. భారత్ అమ్మాయిల విజయం

### వెస్టిండీస్‌పై 2-1తో సిరీస్ సొంతం

**న్యూఢిల్లీ:** మహిళల మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన ప్రతిష్ఠాత్మక చివరి మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఘన విజయం సాధించింది. 60 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా 21 తేడాతో టీ20 సిరీస్‌ను దక్కించుకుంది. భారత క్రికెటర్ రిచా ఘోష్ అరుదైన ఘనత సాధించింది. మహిళల అంతర్జాతీయ టి20 క్రికెట్లో వేగవంతమైన అర్ధ శతకం నమోదు చేసింది. తద్వారా ప్రపం ప్రపంచ రికార్డును రిచా సమం చేసింది. కాగా మూడు టి20, మూడు వన్డేల సిరీస్లు ఆడేందుకు వెస్టిండీస్ భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నవీ ముంబై వేదికగా టి20 సిరీస్ మొదలు కాగా, తొలి మ్యాచ్‌లో భారత్, రెండో టి20లో వెస్టిండీస్ జట్లు గెలిచాయి. దీంతో సిరీస్ 1-1తో సమం కాగా, తాజాగా జరిగిన మూడో టి20 నిర్ణయాత్మకంగా మరింది. ఈ కీలక మ్యాచ్‌లో భారత్ మహిళా జట్టు ఆల్ రౌండ్ ప్రదర్శతో అదరగొట్టింది. ఇక టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన హర్మన్ ప్రీత్ కౌర్ సేన నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 4 వికెట్లు మాత్రమే నష్టపోయి రికార్డు స్థాయిలో 217 పరుగులు చేసింది. ఓపెనర్ కెప్టెన్ స్మృతి మంధాన 47 బంతుల్లో 77 పరుగులు, 13 ఫోర్లు, 1 సిక్స్, రిచా ఘోష్ 21 బంతుల్లో 54 పరుగులు, 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో హాఫ్ సెంచరీలతో చెలరేగారు. అలాగే జెమీమా రోడ్రిగ్స్ 39 పరుగులు రాఘవి బిస్త్ 31 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడి ఫర్వాలేదనిపించారు. అయితే ఐదో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ రాగానే, ఒక్కసారిగా స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కేవలం 18 బంతుల్లో 50 పరగుల మార్క్ అందుకున్న రిచా మహిళల టీ20 క్రికెట్‌లో ఉన్న ఫాస్టెస్ట్ ఫిఫ్టీ వరల్డ్ రికార్డును సమం చేసింది. అంతకు ముందు సోఫీ డివైన్, లిచ్‌ఫీల్డ్ ఈ ఘనత సాధించగా, రిచా వారి వరల్డ్ రికార్డును సమం చేసింది.వెస్టిండీస్ బౌలర్లలో హెన్రీ, డాటిన్, ఫ్లెచర్, అలెయ్‌నే తలో వికెట్ దక్కించుకున్నారు. ఇక లక్ష్య ఛేదనకు దిగిన వెస్టిండీస్‌కు భారత్ బౌలర్లు చుక్కలు చూపించారు. దీంతో 218 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. హెన్రీ (43) టాప్ స్కోరర్‌గా నిలిచింది. డాటిన్ (25), హెలీ మ్యాథ్యూస్ (22) పర్వాలేదనిపించారు. జోసెఫ్ (11), క్యాంప్ బెల్లి (17) పరుగులు చేశారు. భారత్ బౌర్లలో రాధా యాదవ్ 4 వికెట్లతో చెలరేగగా, రేణుకా సింగ్, టిటస్ సాధు, దీప్తి శర్మ, సజీవన్ సజన ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

## ప్రొ కబడ్డీలో.. యుపి యోధాస్ ఏకపక్ష విజయం

**న్యూఢిల్లీ:** ప్రొకబడ్డీ లీగ్ (పికెఎల్)-2024లో యూపీ యోధాస్ జోరు కొనసాగుతోంది. యుపి జోరుకు గుజరాత్ జెయింట్స్ చేతులెత్తేసింది. దీంతో యుపి యోధాస్ 59-23 స్కోరుతో ఏకపక్ష విజయం సాధించింది. రెయిడర్లు గగన్ గౌడ 19 పాయింట్లు, భవాని రాజ్పుత్ 11 పాయింట్లు అదరగొట్టగా, డిఫెండర్లు సుమిత్ 5 పాయింట్లు, అశు సింగ్ 4 పాయింట్లు, మహేందర్ సింగ్ 4 పాయింట్లతో రాణించారు. 18 సార్లు కూతకెళ్లిన గగన్ గౌడ 13 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చిపెట్టాడు. తొలి అర్ధభాగం మొదలైన 8 నిముషాలకే యోధాస్ ఆటగాళ్ల గుజరాత్‌ను ఆలౌట్ చేశారు. 12-7తో క్కడ మొదలైన ఆధిపత్యం ఆఖరి వరకూ కొనసాగింది. ఈ అర్ధభాగం ముగిసేలోపే మళ్లీ 18వ నిమిషంలో జెయంట్స్ ఆలౌట్ అయింది. గుజరాత్ ఆటగాళ్లలో రెయిడర్ గుమన్ సింగ్ 7 పాయింట్లు, ఆలౌండర్ జితేందర్ యాదవ్ 6 పాయింట్లు, రెయిడర్ రాకేశ్ 5 పాయింట్లతో రాణించారు. ఇదివరకే ప్లే ఆఫ్స్‌కు అర్హత సంపాదించిన యూపీ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. ఇక మరో మ్యాచ్‌లో యు ముంబా 43-37తో పట్నా పైరేట్స్‌పై గెలిచింది. ముంబా రెయిడర్ అజిత్ చౌహాన్ 15 పాయింట్లను పదే పదే తెచ్చిపెట్టగా, డిఫెండర్లు సునీల్ కుమార్ 5 పాయింట్లు, పర్వేశ్ 4 పాయింట్లు, మన్జీత్ 4 పాయింట్లు, ఆల్ రౌండర్ రోహిత్ రాఘవ్ 4 పాయింట్లతో సమష్టిగా రాణించారు.

## దుమ్ము లేపిన బంగ్లాదేశ్

### వెస్టిండీస్ క్లీన్‌స్వీప్



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ గడ్డపై బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు దుమ్ము లేపింది. టి20 ఫార్మాట్లో తొలిసారి విండీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. తద్వారావన్డే సిరీస్‌లో ఎదురైన వైట్వాష్ పరాభవానికి ప్రతీప్రకారం తీర్చుకుంది. ఈ మ్యాచ్లో టాస్ గెలిచిన బంగ్లా తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లలో కెప్టెన్ లిటన్ దాస్ విఫలం కాగా.. పర్వేజ్ హుసేన్ ఇమాన్ (39) మెరుగ్గా ఆడాడు. మిగతా వాళ్లలో మెహదీహసన్ మిరాజ్ 29 రన్స్ చేయగా, జాకెర్ అలీ ధనాధన్ బ్యాటింగ్స్‌తో దంచికొట్టాడు. జాకెర్ అలీ మొత్తంగా 41 బంతులు ఎదుర్కొని మూడు ఫోర్లు, ఆరు సిక్సర్ల సాయంతో 72 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి బంగ్లాదేశ్ 189 పరుగులు చేసింది. విండీస్ బౌలర్లలో రొమారియో షెఫర్డ్ రెండు, అల్జారీ జోసెఫ్, రోస్టన్ ఛేజ్, గుడకేశ్ మోటీ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక లక్ష్య ఛేదనలో వెస్టిం డీస్ బ్యాటర్లు చేతులెత్తేశారు. రొమారియో షెఫర్డ్ 33 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, ఓపెనర్ జాన్సన్ చార్ల్స్ 23 పరుగులు, వికెట్ కీపర్ నికోలస్ పూరన్ 15 రన్స్ చేశాడు. మిగతావాళ్లంతా పూర్తిగా విఫలం కావడంతో 16.4 ఓవర్లలో కేవలం 109 పరుగులకే విండీస్ ఆలౌట్ అయింది. బంగ్లా బౌలర్లలో రిషాద్ హుసేన్ మూడు వికెట్లతో చెలరేగగా, టస్కిన్ అహ్మద్, మెహదీ హసన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. తాంజిమ్ హసన్ సకీబ్, హసన్ మహమూద్ ఒక్కో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.

## ఆసియా కప్ అండర్-19 మహిళా టి20లో.. ఫైనల్‌కు భారత్



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ అండర్-19 మహిళల టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. కౌలాలంపూర్‌లో శుక్రవారం శ్రీలంకతో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో యువ భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లంక 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 14.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష 24 బంతుల్లో 32 పరుగులు, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు, కమలిని 26 బంతుల్లో 28 పరుగులు, 3 ఫోర్లు, 1 సిక్స్, మిథిల 12 బంతుల్లో 17 పరుగులు, 4 ఫోర్లు చేసి రాణించారు. ఈశ్వరి ఒక్క పరుగు కూడా నమోదు చేయకుండా ఔటయింది. అలాగే సానికా చాల్కే కేవలం 4 పరుగులే చేసి సింగిల్ డిజిట్‌తో విఫలం కావడంతో భారత్ 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. తర్వాత త్రిష, కమిలిని నిలకడగా ఆడి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. కెప్టెన్ నిక్కీ ప్రసాద్ 3 పరుగులు చేసిన కాసేపటికే వెనుదిరిగింది. ఈ దశలో భవికా 7పరుగుల అండతో మిథిల జట్టును విజయవం తంగా నడిపించింది. ఇక శ్రీలంక బ్యాటర్లలో కెప్టెన్ మనుడి నానయక్కర 30 బంతుల్లో 33 పరుగులు, ఒక ఫోర్, 2 సిక్స్‌లు, సుముదు నసంసాల 21 పరులుతో మాత్రమే రెండు అంకెల స్కోర్ చేశారు. భారత్ బౌలర్లలో ఆయుషి శుక్లా 4/10తో మరోసారి మెరిసింది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 8వికెట్ల తేడాతో గెలిచింది. 81 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు 12.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 86 పరుగులు సాధించి నెగ్గింది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష 46 బంతుల్లో 58 పరుగులు చేసింది. కెపటన్ నిక్కీ ప్రసాద్ 14 బంతుల్లో 22 పరులతో నాటౌట్‌గాను, ఒక ఫోరు, 2 సిక్స్‌లతో కలసి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ త్రిష టీమిండియాను విజయతీరాలకు చేర్చింది.

# రూ.9 లక్షల కోట్లు హుష్ కాకి

**ముంబై, డిసెంబరు 20:** దలాల్ స్ట్రీట్‌లో నష్టాల పరంపర కొనసాగుతోంది. వడ్డీరేట్ల కోత విషయంలో ఫెడ్ వైఖరి కారణంగా గురువారం భారీ నష్టాలు చవిచూసిన మన మార్కెట్ సూచీలు, శుక్రవారం కూడా అదే బాటలో పయనించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలతో వరుసగా ఐదో రోజూ నష్టాలు చవి చూశాయి. నిఫ్టీ ఐటీ, రియాల్టీ సూచీలు భారీగా పతనమయ్యాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ దాదాపు 4వేల పాయింట్ల మేర కోల్పోయింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజే దాదాపు రూ.9 లక్షల కోట్లు ఆవిరై.. రూ.441 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ చివరికి 1176.46 పాయింట్లు నష్టంతో 78041.59 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 375.05పాయింట్ల నష్టంతో 28,578 65 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయిమారకం విలువ కాస్త రికవరీ అయ్యి 85.03 వద్ద ముగిసింది. నెస్లే ఇండియా, టైటాన్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. వచ్చే యేడాది వడ్డీ రేట్లలో మూణ్నాలుగు కోతలు ఉండొచ్చని మార్కెట్ అంచనా. రెండుసార్లు మాత్రమే రేట్ల కోత ఫెడ్ చేయడంతో వరుసగా రెండో రోజూ ప్రపంచ మార్కెట్లపై ప్రభావం




పడింది. అమెరికాలో డాలర్ విలువ, బాండ్ల రాబడులు పెరగడంతో మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. గడిచిన 4సెషన్లలోనే రూ.12వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించడం. ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంటోంది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.6 శాతం మేర నష్టపోయింది. వాస్తవానికి వాలెట్ అంచనాలను మించి యాక్సెంచర్ మెరుగైన త్రైమాసిక ఫలితాలు, భవిష్యత్ అంచనాలనువెలువరించడంతో శుక్రవారం లాభాల్లో కదలాడిన దేశీయ ఐటీస్టాక్స్ తర్వాత ఆరంభ లాభాలు కోల్పోయి నష్టాల్లోకి జారుకున్నాయి.

## కరోరా ఇండియా ఐపిఒ షురూ

**ముంబై, డిసెంబరు 20:** కరారో ఇండియా ఐపిఒ ప్రారంభమైంది. కంపెనీ ఐపీఓ సైజ్ రూ.1250 కోట్లు. ఈ ఐపిఒ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ ఆధారంగా ఉంటుంది. ఐపీఓ ద్వారా కంపెనీ 1.78 కోట్ల షేర్లను జారీ చేయనుంది. ఈ ఐపిఒ డిసెంబర్ 20న మొదలైంది. కంపెనీ ఐపిఒ డిసెంబర్ 24 వరకు తెరిచిఉంటుంది. ఇంకా కంపెనీ ప్రైస్ బ్యాండ్‌ని కూడా ప్రకటించింది. కరారోఇండియా ఐపిఒ ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ.668 నుండి రూ.704గా నిర్ణయించింది. కంపెనీ ఒక లాట్ 21 షేర్లను చేసింది. దీని కారణంగా ఏదైనా రిటైల్ పెట్టుబడిదారుడు కనీసం రూ.14,784 బెట్ వేయాలి. ఇది ప్రైమరీ బోర్డు ఐపిఒ. దీని కారణంగా కంపెనీ లిస్టింగ్ ఎన్ఎస్ఇ అండ్ బిఎస్ఇలో ప్రతిపాదించింది. ఐపిఒలో గరిష్టంగా 50 శాతం అర్హత ఉన్న సంస్థాగత కొనుగోలు దారుల కోసం రిజర్వ్ చేసారు. అలాగే రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కనీసం 35 శాతం షేర్ రిజర్వ్ చేయగా ఇంకా నాన్ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ఈ ఐపిఒలో కనీసం 15 శాతం వాటా పొందుతారు. గత కొన్నేళ్లుగా కరారోఇండియా పర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో కార్యకలాపాల ద్వారా కంపెనీ ఆదాయం 4.44 శాతం పెరిగి రూ.1770.45కోట్లకు చేరుకుంది. 2023ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.1695.12 కోట్లుగా ఉంది. యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, కారోరా ఇండియా కోసం లీడ్ మేనేజర్లుగా నియమితులయ్యారు. కాగా, లింక్ ఇన్‌టైమ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు. అయితే పబ్లిక్ మార్కెట్ నుండి రూ.1,200 కోట్లను సమీకరించడానికి కారోరా ఇండియా ప్రారంభ పబ్లిక్ ఆఫర్ శుక్రవారం ప్రారంభించనుంది. ప్రాఫిట్ ఆఫ్టర్ ట్యాక్స్ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 48.46 కోట్ల నుండి 202324 ఆర్థిక సంవత్సరంలో రూ. 62.56 కోట్లకు పెరిగింది. 2023 24ఆర్థిక సంవత్సరం మధ్య కరారోఇండియా ఆదాయం 4 శాతం పెరిగగా, ప్రాఫిట్ ఆఫ్టర్ ట్యాక్స్ 29 శాతం పెరిగింది. 2024-25 మొదటి రెండు త్రైమాసికాలలో సంస్థ ఆదాయం రూ.922.74కోట్లు, పిఎటి 49.73 కోట్లుగా ఉంది.




## హోండా కార్ల ధరల పెంపు

**న్యూఢిల్లీ, డిసెంబరు 20:** ప్రముఖ వాహన తయారీ సంస్థ హోండా ఇండియా కార్లధరల్ని పెంచడం శుక్రవారం ప్రకటించింది. కొత్త ఏడాది నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయని. అన్ని మోడళ్లపై 2 శాతం పెంపు కనిపిస్తుందని. ఉత్పత్తివ్యయం పెరిగిన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో ఉంది. ఉత్పత్తి వ్యయం, లాజిస్టిక్ ఖర్చులు పెరగడంతో వాహన ధరల పెంపు తప్పలేదు, కొంత వ్యయభారాన్ని బదిలీ చేయడానికి నిర్ణయించినట్లు హోండా కార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహ్‌లో ఉంది. దేశీయంగా హోండా అమేజ్, సిటీ, ఎలివేట్ వంటి మోడల్‌లను విక్రయిస్తోంది. వచ్చేయేడాది నుంచి తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు ఇప్పటికే అనేక సంస్థలు ప్రకటించాయి, మారుతీ సుజుకీ, హ్యుందాయ్, మహీంద్రా, ఎంజీ మోటార్, టాటా మోటార్స్‌తో సహా పలు సంస్థలు 2025 జనవరినుంచి ధరల పెంపునకు గురవుతున్నాయి. తాజాగా హోండా కూడా ఈజాబితాలో చేరింది.




## వాణిజ్యం

## మారుతి సుజుకి ఫస్ట్ 'ఇవి' ఎస్‌యువి

**న్యూఢిల్లీ, డిసెంబరు 20:** ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ ఎలక్ట్రిక్ వాహనానికి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు ఈ రంగంలో ఎంట్రీ ఇవ్వని ఈ సంస్థ తన పాపులర్ ఎస్యూవీలో ఎలక్ట్రిక్ వెర్షన్‌ను తీసుకురావడానికి సిద్ధంగా ఉంది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ఈవెంట్‌లో కొత్త ఇవి మోడల్‌ను ప్రదర్శిస్తుంది. ఈ మేరకు ఫస్ట్ ఇవికి సంబంధించిన లుక్‌ను టీజ్ చేసింది. మారుతీ సుజుకీకి చెందిన విటారాకు మార్కెట్లో మంచి ఆదరణ ఉంది. దీనితో ఈ మోడల్ ఎలక్ట్రిక్ వెర్షన్ తీసుకురావాలని కంపెనీ నిర్ణయించింది. ఈ విటారా భారత్‌తో పాటు గ్లోబల్ లాంచ్ చేయనున్నారు. వీటి తయారీ భారత్‌లోనే జరగనుంది. దశాబ్దాల ఆటోమోటివ్ నైపుణ్యం, అధునాతన ఎలక్ట్రిక్ టెక్నాలజీతో ఎలక్ట్రిక్ కారును ఉత్పత్తి చేసిన కంపెనీ మార్కెటింగ్ అండ్ సేల్స్ ఈఓ పార్థో బెనర్జీ అందించబడింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 జనవరి 17 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్‌లో మారుతీ కొత్త కారును ఆవిష్కరించారు. ఈవీలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా మెరుగైన కస్టమర్ సేవలను అందించడమే తమ లక్ష్యమని రివీల్ సందర్భంగా జెనర్జీ అన్నారు. ఈ సందర్భంగా దేశంలో ఛార్జింగ్ స్టేషన్ల సమస్య గురించి ప్రస్తావించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు వినియోగించుకోవ దానికి ఛార్జింగ్ సదుపాయం అందుబాటులో లేకపోవడం అడ్డంకిగా మారుతో ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇంట్లోనే ఛార్జింగ్ సదుపాయం కల్పించాల నుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు మారుతీసుజుకీ డీలర్‌షిప్ లు, సర్వీస్ టెడ్ పాయింట్ల వద్ద ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం కల్పిస్తాం.




## దేశమంతటా ఇ-కామర్స్ ఎగుమతి హాబ్‌లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 20:** దేశంలో ఇ-కామర్స్ ఎగుమతి హబ్‌లను ఏర్పాటు చేసేందుకు డీహెచ్‌ఎల్, లెక్స్‌షిప్ సహా కొత్తగా అయిదు సంస్థలకు దరఖాస్తు చేసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయిదింటిలో మూడు దరఖాస్తులను షార్‌లిస్ట్ చేసినట్లు, వీటిపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. రెండు హబ్‌లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ సమీపంలో రాగలవని, వచ్చే యేడాది ఫిబ్రవరిలో కార్యకలాపాలు ప్రారంభం కాగలవని వివరించారు. కస్టమ్స్, సెక్యూరిటీ క్లియరెన్స్ మొదలైనవి వేగవంతం చేయడానికి ఇందులో సౌకర్యాలు ఉంటాయి. అలాగే నాణ్యం, సర్టిఫైయింగ్ ఏజెన్సీలు కూడా ఉంటాయి. హబ్లను నెలకొల్పిన సంస్థల స్పందనను బట్టి దేశవ్యాప్తంగా ఇలాంటివి మరిన్ని ఏర్పాటు చేయడంపై సవివరంగా మార్గదర్శకాలను రూపొందించినట్లు అధికారి పేర్కొన్నారు. లాజిస్టిక్ అగ్రిగేటర్ సంస్థ షిప్రాకెట్, ఎయిర్‌కర్‌లో హ్యాండ్లింగ్ కంపెనీ కార్గో సర్వీస్ సెంటర్లను (సీఎస్సీ) ఇప్పటికి పైలట్ ప్రాతిపదికన ప్రభుత్వం ఎంపిక చేసింది. 2030 నాటికి ఈ కామర్స్ ఎగుమతులు 100 బిలియన్ డాలర్లకు చేరాయి, రాబోయే రోజుల్లో 200250 బిలియన్ డాలర్లకు దూసుకెళ్లవచ్చనే అంచనాలు నెలకొన్నాయి. అలాగే, ప్రస్తుతం 800 బిలియన్ డాలర్లుగా ఉన్న అంతర్జాతీయ ఇ-కామర్స్ ఎగుమతులు 2030 నాటికి 2 లక్షల కోట్ల డాలర్లకు చేరిన నివేదికలు చెబుతున్నాయి. ఇ-కామర్స్ ఎగుమతుల్లో అగ్రగామిగా ఉన్న చైనాలో ఎక్స్‌పోర్ట్ హబ్ ఉన్నాయి.



## 23% ప్రీమియంతో జెమలాజికల్ ఇనిస్టిట్యూట్ ఐపిఒ

**ముంబై, డిసెంబరు 20:** ఇంటర్నేషనల్ జెమలాజికల్ ఇనిస్టిట్యూట్ షేర్లు శుక్రవారం మార్కెట్లో ఎంట్రీ ఇచ్చాయి. ఎన్ఎస్ఈలో రూ.510 వద్ద షేర్లు ప్రారంభమయ్యాయి. ఇష్యూ ధరతో తాజా 22 శాతం ప్రీమియంతో జాబితా అయ్యాయి. ఇక బీఎస్ఈలో 21.06 శాతం లాభంతో రూ.504,85 వద్ద షేర్ల లిస్ట్ అయ్యాయి. ప్రముఖ డైమెండ్ గ్రేడింగ్ సంస్థ ఇంటర్నేషనల్ జెమలాజికల్ ఇని ఆగస్టు రూ.4,225 కోట్లు సమీకరణే లక్ష్యంగా పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ధరల శ్రేణిని రూ.397417గా నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్ మొదలైన తొలిరోజు నుంచే మంచి స్పందన సొంతం చేసుకుంది. చివరిరోజున 34 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఈ ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1475 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సెల్ రూపంలో 6.50 కోట్ల షేర్లను జారీ చేయాలని నిర్ణయించుకుంది. మెరుగైన లిస్టింగ్ నమోదు కావడంతో కంపెనీ మార్కెట్ విలువ 22,040.14 కోట్ల రూపాయలకు చేరింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps